# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 7 ఆగస్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 213 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం



మధ్యశ్రేణికి చెందిన అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని భారత్ విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్ వద్ద స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రయోగం విజయవంతం అయ్యిందని రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. అన్ని ఆపరేషనల్, టెక్నికల్ పారామీటర్లను విజయవంతంగా అందుకుందని వెల్లడించింది.

## సచివాలయంలో బోనాలు



3

# పంద్రాగస్టు నుంచి కొత్త రేషన్ కార్డులు




## సంగారెడ్డిలో సీఎం చేతుల మీదుగా పంపిణీ ప్రారంభం

## అదే రోజు 119 నియోజకవర్గాల్లో అర్హులకు అందజేస్తరు

హైదరాబాద్, ఆగస్టు 6 (మనం బ్యూరో): రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా మంజూరైన 1.05 కోట్ల లామినేటెడ్ రేషన్ కార్డులను స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటి పారుదల, ఆహార పౌర సంబంధాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం అధికారిక మెమో జారీ చేశారు. సంగారెడ్డిలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుండగా, అదే రోజు 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. లబ్దిదారుల జాబితా ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాటు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, ...మిగతా 2లో

### అన్ని రోడ్ నెట్‌వర్క్‌లు ఒకే సిస్టమ్‌లోకి ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణ సరిగా లేదు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతున్నై

రోడ్ల అభివృద్ధిపైనే హైదరాబాద్ నగర భవిష్యత్తు 2





### జయశంకర్ సార్‌కు.. ప్రజాకవి గద్దర్‌కు.. సీఎం రేవంత్ ఘన నివాళులు 3

## ప్రధాని విదేశీ టూర్ల వ్యయం ₹550 కోట్లు.. వచ్చిన ఎఫ్‌డీఐలు ₹30 లక్షల కోట్లపైనే



ఢిల్లీ, ఆగస్టు 6: వివిధ దేశాలతో సన్నిహిత సంబంధాలను పెంపొందించడానికి.. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రధానమంత్రి అత్యున్నత స్థాయి పర్యటనలు దోహదం చేస్తాయని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ విదేశీ ప్రయాణాల ఖర్చులకు సంబంధించి విదేశాంగ శాఖ వివరాలు వెల్లడించింది. 2025లో మొత్తం 23 దేశాల్లో పర్యటించగా, ఇందుకోసం రూ.187 కోట్లు ఖర్చు అయినట్లు తెలిపింది. 2021 ...మిగతా 2లో

## యూపీఐపై ఛార్జీలు.. బ్యాంకులకు అనుమతి!

బిల్లును ఆమోదించిన లోక్‌సభ ● సమీప భవిష్యత్‌లో ఫీజుల విధింపునకూ అనుమతి! 2

## నీట్‌లో పెన్ను, పేపర్‌లకు సెలవు

వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం



## క్యా బోల్తీ పబ్లిక్



- సీజేపీ చేపట్టనున్న దేశవ్యాప్త క్యాంపెయిన్ పేరు ప్రకటించిన అభిజీత్
- నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయాలపై ప్రజాభిప్రాయ సేకరణ
- నిరుద్యోగాన్ని జాతీయ అంశంగా మారుస్తం
- అంబేద్కర్, గాంధీ, నెహ్రూ ఆదర్శాలే మాకు ఆదర్శమన్న దీప్కే

2

## సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో గోపాలపురం పాఠశాలకు నిధులు

- రూ.25 లక్షలతో అదనపు గదుల నిర్మాణం

హైదరాబాద్, ఆగస్టు 6 (మనం బ్యూరో): ఖమ్మం జిల్లా గోపాలపురం ప్రభుత్వ పాఠశాల గదుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించిన సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ జిల్లా కలెక్టర్, ఉపాధ్యాయినితో మాట్లాడారు. పాఠశాలలో గదులు శిథిలమైన తీరుపై మీడియాలో వచ్చిన కథనాలకు ...మిగతా 2లో

## ఉద్యోగార్థులకు మరో శుభవార్త: 1,501 ఎఫ్‌బీఓ, ఏఎస్ఓ ఉద్యోగాల భర్తీ

ఆగస్టులోనే వెలువడనున్న నోటిఫికేషన్

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు త్వరలో మరో శుభవార్త విననున్నారు. అయితే, టీజీపీఎస్సీలో మొత్తం 1,501 పోస్టుల భర్తీకి ఈ నెలలోనే నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, 108 అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు ఉన్నట్లు సమాచారం. ఇతర పోటీ పరీక్షల షెడ్యూళ్లను పరిగణనలోకి తీసుకుని పరీక్షల తేదీలను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రేవంత్ ప్రభుత్వం మరి కొద్ది రోజుల్లో ఓ భారీ శుభవార్త చెప్పేందుకు రెడీ అయింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు బిగ్ రిలీఫ్ కల్పించనుంది. మొత్తం ...మిగతా 2లో

## నాకు, సీఎంకు మధ్య గ్యాప్ లేదు



ఇద్దరం రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటూనే ఉంటాం

క్షుద్ర పూజల విషయంలో హరీష్ వివరణ ఇవ్వాల్సిందే

- ఆయన లీగల్ నోటీసులకు కోర్టులోనే జవాబు చెప్త
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 6 (మనం బ్యూరో): క్షుద్ర పూజల విషయంలో హరీష్ రావు వివరణ ఇవ్వాలిన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. హరీష్ రావు వెళ్లిన దేవాలయాలు క్షుద్ర పూజలకు ఫేమస్ అనీ, ఆ దేవాలయాలకు ఆయన ఎందుకు వెళ్లారో చెప్పాలని నిలదీశారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి ఎవరు శనో, ఎవరు దరిద్రమో గత ఎన్నికల్లో ప్రజలు తేల్చారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ త్యాగాల గురించి ప్రతిపక్ష పార్టీలు తెలుసుకోవాలనీ, విమర్శలు చేయడానికి వారికి అవకాశం ఉంటుంది కానీ అవి సహేతుకంగా ఉండాలని పేర్కొన్నారు. ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంలు కో ఆర్డినేషన్ కమిటీలో చర్చిస్తే బాగుంటుందని అనుకున్నామనీ, అందరం కలసి చర్చిస్తే మంచి నిర్ణయాలు తీసుకోవడానికి వీలుంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. కో ఆర్డినేషన్ కమిటీకి అన్ని ...మిగతా 2లో

## 20 నెలల్లో 150 జీసీసీల ఏర్పాటు

1.5 లక్షల మందికి ఉపాధి

జేఎల్ఎల్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభంలో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఆగస్టు 6 మనం బ్యూరో: గత 20 నెలల కాలంలో రాష్ట్రంలో కొత్తగా 150 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సెంటర్ల ద్వారా 1.5 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించిందని తెలిపారు. గురువారం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ ...మిగతా 2లో

## పాఠశాల పేరు చివరన తోకలు కట్

మోడల్, ఇంటర్నేషనల్, టెక్నో, ఒలింపియాడ్, టాలెంట్ పేర్ల వాడకంపై నిషేధం

ఈ ఫ్యాన్సీ ట్యాగ్స్‌ను ఖచ్చితంగా తీసేయాల్సిందే?

జీవో 91 అమలుపై విద్యాశాఖ సీరియస్

ప్రభుత్వ నిబంధనలు బేఖతర్ చేసేవారిపై కఠిన చర్యలుంటాయ్?

తీవ్రంగా హెచ్చరించిన తెలంగాణ విద్యా శాఖ 3

## అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్త



తెలంగాణ కోసం సర్వస్వాన్ని ధారపోసిన ధీరుడు ప్రొ. జయశంకర్

'సార్' కు ఘనంగా నివాళులర్పించిన కవిత

ట్యాంక్ బండ్‌పై జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలె..

పద్మభూషణ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయాలె

సరూర్‌నగర్ సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో కవిత

హైదరాబాద్, మనం ప్రతినిధి: ఉద్యమాలతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం దక్కలేదని టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కవిత అభిప్రాయపడ్డారు. అన్ని వర్గాల ప్రజలకు లాభం, న్యాయం చేస్తూ తెలంగాణను తీర్చిదిద్దడానికి ముందున్నామని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ కోసం తన సర్వస్వాన్నే ధారపోసిన తెలంగాణ సిద్ధాంతకర్త, త్యాగశీలి, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై జయశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారంనాడు ...మిగతా 2లో

## అక్షరాల వ్యాపారం.. ఫోర్జరీల రాజ్యం




జూనియర్ కాలేజీల కక్కుర్తికి విద్యావ్యవస్థ బలి

విద్యార్థుల భవిష్యత్తుతో 'ఇంటర్' బోర్డ్ జూదం

పుట్టగొడుగులుగా పుట్టుకొస్తున్న జూనియర్ కళాశాలలు

ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా తయారైన ఇంటర్ బోర్డు

హైడ్రా కమిషనర్ సంతకాన్నే 'వాడేసుకున్న' ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు

హైదరాబాద్ ,ఆగస్టు 06 (మనం న్యూస్): అక్షరాల వెలుగులు నింపాల్సిన విద్యా వ్యవస్థ, కాసుల కక్కుర్తికి కసాయి శాలగా మారుతోంది. అర్హతలతో సంబంధం లేకుండా, భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసి, దొంగ పత్రాలతో వెలుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల అక్రమ భాగోతం విద్యా రంగానికే పెద్ద మచ్చగా పరిణమించింది. ప్రభుత్వం ఒకవైపు రాజధాని హైదరాబాద్ను అంతర్జాతీయ స్థాయి 'ఎడ్యుకేషన్ హబ్'గా తీర్చిదిద్దాలని సంకల్పిస్తుంటే, క్షేత్రస్థాయి నుంచి ఇంటర్ బోర్డు ఉన్నతాధికారుల వరకు ...మిగతా 2లో

## ర్యాంకుల పంట పండిస్తున్న బీసీ గురుకులాలు

టీజీ సీపీగెట్‌లో ఇద్దరికి ఫస్ట్ ర్యాంక్

టాప్-10లో ఆరుగురు..

వంద లోపు 32 మంది

మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల డిగ్రీ విద్యార్థుల జయకేతనం 3

## రూ.9.5 లక్షల కోట్లు.. సుంకాలను వెనక్కి ఇచ్చేసిన ట్రంప్



వాషింగ్టన్, ఆగస్టు 6: ప్రపంచ దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్లను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. దాంతో తీర్పునకు ముందువరకు వసూలు చేసిన సుంకాలను యూఎస్ ప్రభుత్వం రిఫండ్ చేస్తోంది. ఇప్పటివరకు 100 బిలియన్ డాలర్ల (రూ.9.5 లక్షలకోట్లకు పైగా) మేర సొమ్మును దిగుమతిదారులకు వెనక్కి ఇచ్చేసింది. రెండోదఫా అధికారంలోకి వచ్చిన తర్వాత అంతర్జాతీయ ఆర్థిక అధికారాల చట్టాన్ని ట్రంప్ ప్రయోగించారు. దానికింద పలు దేశాలపై ట్రంప్ భారీ సుంకాలతో విరుచుకుపడ్డారు. ఈ టారిఫ్ల రూపంలో 166 బిలియన్ల డాలర్లను ట్రంప్ యంత్రాంగం వసూలు చేసింది. అయితే, ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఆ సుంకాలు కట్టిన దిగుమతిదారులకు 100 బిలియన్ల డాలర్లను వాపసు ఇచ్చింది. కోర్టు ఫైలింగ్‌లో ఈ విషయాన్ని ట్రంప్ యంత్రాంగం వెల్లడించింది. అధ్యక్షుడు ట్రంప్ తన పరిమితులను దాటి ఈ సుంకాలను విధించారని ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొన్న సంగతి తెలిసిందే. అధిక సుంకాల కింద కంపెనీల నుంచి వసూలుచేసిన సొమ్ము వాపసు చేయాల్సిందేనని నాడు న్యాయస్థానం స్పష్టం చేసింది. అధిక దిగుమతి సుంకాల విధింపు వల్ల అప్పట్లో ప్రతిరోజూ రూ.4,538 కోట్ల చొప్పున అమెరికా ఖజానాకు వచ్చి చేరాయి. కాగా.. కోర్టు తీర్పుతో చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ లాంటి కీలకమైన ఆసియా దేశాలకు భారీ ఊరట లభించింది.

## గ్రీన్‌కార్డు దరఖాస్తుల ప్రక్రియ నిలిపివేత చట్టవిరుద్ధం

ట్రంప్‌నకు షాకిచ్చిన భారత సంతతి జడ్జి

వాషింగ్టన్, ఆగస్టు 6: గ్రీన్‌కార్డు దరఖాస్తుల ప్రాసెసింగ్ ప్రక్రియను స్తంభింపజేయడం చట్టవిరుద్ధమని యూఎస్ ఫెడరల్ కోర్టు జడ్జి అమిత్ మెహతా తీర్పు చెప్పారు. 75 దేశాలకు చెందిన వారి దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను నిలిపేస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. వీసా నిర్ణయాల అధికారాన్ని కాన్సులర్ అధికారుల నుంచి తొలగించడంద్వారా ...మిగతా 2లో



# యూపీఐపై ఛార్జీలు.. బ్యాంకులకు అనుమతి!

**ఢిల్లీ, ఆగష్టు 6:** యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించడానికి ఉద్దేశించిన 'పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007' సవరణ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. ఇక డిజిటల్ లావాదేవీలపై బ్యాంకులతో పాటు ఇతర ఫిన్టెక్ సంస్థలకు ఛార్జీలు వసూలు చేసే అధికారం ఈ బిల్లు కల్పించనుంది. ఎలాంటి చర్చా లేకుండానే ఈ బిల్లు వాయిస్ ఓటు ద్వారా లోక్ సభలో పాస్ అయ్యింది.

యూపీఐ సహా కొన్ని ఎలక్ట్రానిక్ పేమెంట్లపై మర్చంట్ డిస్కౌంట్ రేటును బ్యాంకులు, సర్వీసు ప్రొవైడర్లు వసూలు చేయకుండా ఇప్పటి వరకు చట్టపరమైన నిబంధన ఉంది. ఈ బిల్లుతో ఇది తొలగనుంది. ప్రస్తుతం జరిపే రియల్ టైం లావాదేవీలపై బ్యాంకులు సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. యూపీఐ లావాదేవీలకు మాత్రం మినహాయింపు ఉంది. దీన్ని తాజాగా తొలగించారు.

వినియోగదారులు, చిన్న వ్యాపారాల కోసం డిజిటల్ చెల్లింపు సేవలపై చిన్న రుసుము విధించడంతో పాటు, డిజిటల్ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థను నడిపించే బ్యాంకులు, చెల్లింపు సర్వీస్ ప్రొవైడర్లు, పేమెంట్ ఇన్ఫ్రా సంస్థలకు ఆదాయాన్ని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో నిర్దిష్ట పరిమితి దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించే అవకాశం ఉంది. ఈ ఛార్జీలు పెద్ద వ్యాపారులకే వర్తిస్తాయి. సాధారణ వినియోగదారులకు వర్తించవు.

# నీట్‌లో పెన్ను పేపర్‌లకు సెలవు

**ఢిల్లీ, ఆగష్టు 6:** నీట్ యూజీ పరీక్షలో పెన్ అండ్ పేపర్ విధానానికి స్వస్తి చెబుతామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జేఈఈ తరహాలో కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలోని హైపవర్ టాస్క్ ఫోర్స్ సిఫార్సుల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొంటూ సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్-యూజీ నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. పేపర్ లీకులు, వ్యవస్థాగత వైఫల్యాలను తొలగించేందుకు నీట్ నిర్వహణలో సమగ్ర మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇటీవల పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. మరోవైపు, ఒకవేళ పరీక్షను కంప్యూటర్ విధానంలోకి మారిస్తే.. ఆ విషయంపై ముందే స్పష్టత ఇవ్వాలని వైద్యుల సంఘం కోరింది. కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్ పై స్పందనను తెలియజేయాలని వైద్యుల సంఘంతోపాటు సంబంధిత పిటిషనర్లకు సుప్రీం కోర్టు సూచించింది.

# ప్రధాని విదేశీ టూర్ల వ్యయం ₹550 కోట్లు.. వచ్చిన ఎఫ్ డీఐలు ₹30 లక్షల కోట్లపైనే..

(మొదటి పేజీ తరువాయి)

నుంచి విదేశీ ప్రయాణాల కోసం మొత్తంగా సుమారు రూ.550 కోట్లకుపైగా ఖర్చయ్యిందని, ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.74 కోట్లు ఖర్చు అయినట్లు పేర్కొంది. ప్రధాని మోదీ 2021 నుంచి ఇప్పటివరకు ఏయే దేశాల్లో పర్యటించారు? ఒక్కో దేశ పర్యటనకు అయిన ఖర్చు ఎంత? తదితర వివరాలపై రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు విదేశాంగశాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు పీఎం చేపట్టిన విదేశీ పర్యటనల కోసం రూ.74.58 కోట్లు ఖర్చు అయ్యింది. జులై 6 నుంచి 11 వరకు ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటించారు.

విదేశీ పర్యటనల కోసం గతేడాది (2025లో) రూ.187 కోట్లు, 2024లో రూ.109 కోట్లు, 2023లో రూ.93 కోట్లు, 2022లో రూ.55 కోట్లు, 2021లో రూ.36 కోట్లు ఖర్చయినట్లు కేంద్రం వెల్లడించింది.గతేడాది (2025) మొత్తంగా 23 దేశాల్లో పర్యటించారు. ఫ్రాన్స్ (రూ.25 కోట్లు), అమెరికా (రూ.16 కోట్లు), సౌదీ అరేబియా (రూ.15 కోట్లు), బ్రెజిల్ (రూ.17 కోట్లు), చైనా (రూ.10 కోట్లు), బ్రిటన్ (రూ.9 కోట్లు) తదితర దేశాల్లో ప్రధాని మోదీ అధికారిక పర్యటనలు చేశారు.మారిషస్, థాయ్లాండ్, శ్రీలంక, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, నమీబియా, మాల్దీవులు, జపాన్, భూటాన్, దక్షిణాఫ్రికా, జోర్డాన్, ఒమన్, ఇథియోపియా దేశాల్లోనూ ప్రధాని పర్యటించారు.ఈ పర్యటనల (ఏప్రిల్ 2021- డిసెంబర్ 2025 మధ్య) సందర్భంగా చేసుకున్న అవగాహన ఒప్పందాల్లో భాగంగా సుమారు 381 బిలియన్ డాలర్ల (రూ.30 లక్షల కోట్ల కన్నా ఎక్కువ) విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది.

# 20 నెలల్లో 150 జీసీసీల ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను గుర్తించి సిఫారసు చేసే సంస్థగా జేఎల్ఎల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందనీ, అలాంటి సంస్థ జేసీసీ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకోవడం తెలంగాణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ ఐటీ కార్యకలాపాలు మార్పులను లోనవుతున్న తరుణంలో ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్ ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా అవతరిస్తున్నాయని చెప్పారు. ఏఐ, ఆటోమేషన్ ప్రభావంతో సాంకేతిక రంగంలో మార్పులు వచ్చినా జీసీసీల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు. 2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయం లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతంగా నమోదైందన్నారు. అదే సమయంలో నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతానికి చేరుకోవడం హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థలో వాటికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. జేఎల్ఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే వచ్చే రెండేళ్లలో సుమారు 1600 మందికి ఉపాధి లభించనుందని వెల్లడించారు. ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, టెక్నాలజీ ఆధారిత సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎల్ఎల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం సేవలను అందిస్తుంది.

## గ్రీన్‌కార్డు దరఖాస్తుల ప్రక్రియ నిలిపివేత చట్టవిరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

వలసలు, జాతీయత చట్టాన్ని ప్రభుత్వం ఉల్లంఘించిందని భారత సంతతికి చెందిన డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియాలోని జిల్లా ఫెడరల్ జడ్జి మెహతా స్పష్టం చేశారు. ఈ ఏడాది జనవరిలో విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో ఇచ్చిన ఆదేశాలు ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే గ్రీన్‌కార్డు దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను స్తంభింపజేసిన దేశాల జాబితాలో భారత్ లేదు.

# అన్ని రోడ్ నెట్‌వర్క్‌లు ఒకే సిస్టమ్‌లోకి

- రోడ్ల అభివృద్ధిపైనే హైదరాబాద్ నగర భవిష్యత్తు
- ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్లను డిసెంబర్ 9లోగా పూర్తి చేయాలె
- ప్లానింగ్ నిర్మాణంలో ట్రాఫిక్ విభాగాన్ని ఇన్వాల్వ్ చేయాలి
- హెచ్ఎండీఏ, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, ఆగష్టు 6 (మనం బ్యూరో):** అన్ని రోడ్ నెట్‌వర్క్‌లను ఒకే సిస్టమ్‌లోకి తీసుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భూ సేకరణ, రుణాలు, రోడ్ల నిర్వహణతో పాటు అన్ని అంశాలు ఈ సిస్టంలోకి తీసుకు రావావాలని సూచించారు. గురువారం ఎంసిహెచ్ఆర్‌డి బోధి పెవిలియన్‌లో హెచ్ఎండిఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణ సరిగా లేదనీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా ఉన్నాడని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇకపై ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలనీ, టీడీఆర్‌పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం సేకరించిన భూములకు మాత్రమే టీడీఆర్ చేయాలనీ, ఈ ప్రక్రియను మొత్తం ఆన్‌లైన్ చేయాలన్నారు. టీడీఆర్‌లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా వ్యవస్థను రూపొందించాలనీ, రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు రేడియల్ రోడ్‌ను డిసెంబర్ 9లోగా పూర్తి చేయాలనీ, ఇందుకు సంబంధించిన అడ్డంకులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. రోడ్డు నిర్మాణం నాణ్యతలో రాజీ లేదనీ, భవిష్యత్తులో ఇబ్బంది రాకుండా రోడ్డు నిర్మాణంలో వాడే మట్టిపైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్‌లకు ఇరువైపులా పచ్చదనం ఉండేలా చూసుకోవాలనీ, ఇందుకు బద్వేల్ ఇంటర్చేంజ్ ట్రంపెట్ అత్యంత కీలకమని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్ 1, 11 పనులు వేగవంతం చేయాలనీ, అలాగే, కారిడార్ 111 బంజారాహిల్స్ నుంచి శిల్పా లే అవుట్‌రోడ్ పనులను త్వరగా మొదలుపెట్టాలని ఆదేశించారు. హైదరాబాద్ నగర భవిష్యత్తు రోడ్లపైనే ఆధారపడి ఉందనీ, దీనికి సంబంధించి భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు. అధికారులు అలసత్వం చూపించవద్దనీ, రోడ్ల ప్లానింగ్, నిర్మాణంలో ట్రాఫిక్ విభాగాన్ని ఇన్వాల్వ్ చేయాలనీ, ల్యాండ్ పూలింగ్‌లో మధ్యవర్తుల జోక్యాన్ని సహించవద్దని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# ఉద్యమానికి దిక్సూచి: కేసీఆర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా నివాళి కార్యక్రమాలు జరిగాయి. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు, ఆయా పార్టీల నేతలు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక తెలంగాణ కోసం పాటుపడ్డ మహనీయుడు జయశంకర్‌కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులు అర్పించారు. ఈ గడ్డ కోసం ఆయన జీవితాంతం నిరంతరం శ్రమించారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు ఆయన సేవలను ఎప్పటికీ మరువరని చెప్పారు. ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని గణాంకాలతో దేశం ముందు ఉంచి, ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా నిలిపారని కొనియాడారు.

## 1,501 ఎఫ్‌బీఓ, ఏఎస్ఓ ఉద్యోగాల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

1,501 ప్రభుత్వ పోస్టుల భర్తీకి ఈ నెలలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. ఇటీవలనే పోలీస్ ఎస్సైలు, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) నోటిఫికేషన్ విడుదలచేసింది. అటవీ శాఖతో పాటు స్టాటిస్టిక్స్ విభాగంలో ఖాళీలను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ సేవలను మరింత బలోపేతం చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పరీక్షలు ఒకదానితో మరొకటి అడ్డురాకుండా ఉండేందుకు ప్రత్యేక ప్రణాళికతో షెడ్యూల్ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.




## పంద్రాగస్టు నుంచి కొత్త రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. కాగా, పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వం సంక్షేమ పాలనలో ఇది మరో మైలురాయిగా నిలుస్తుందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# నాకు, సీఎంకు మధ్య గ్యాప్ లేదు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాల్సిన అవసరం ముఖ్యమంత్రికి లేదనీ, మేం ముఖ్యమంత్రిని గౌరవిస్తామని తెలిపారు. పార్టీ ప్రభుత్వం వేరు కాదు, రేవంత్ రెడ్డి మా కాంగ్రెస్ ముఖ్యమంత్రి, నాకు సీఎంకు మధ్య గ్యాప్ లేదని స్పష్టం చేశారు. సీఎం, నేను రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటామనీ, నిన్న కూడా ఆయనతో ఫోన్‌లో మాట్లాడానని వెల్లడించారు.

సీఎంకు, తనకు మంచి సఖ్యత ఉందనీ, దొంగచాటున ఫిర్యాదులు చేసుకునే అవకాశం కాంగ్రెస్‌లో లేదన్నారు. కో ఆర్డినేషన్ కమిటీలో కీలక చర్చ జరిగిందనీ, అందరం ఓపెన్‌గానే మాట్లాడుకున్నామని తెలిపారు. ఫోటోలో చూస్తే వంశీ మధ్యలో కూర్చున్నట్లు అనిపిస్తుంది కానీ, ప్రోటోకాల్ ప్రకారం సమీక్ష నిర్వహించింది మీనాక్షి నటరాజన్ అని వెల్లడించారు. బయట జరుగుతున్న విషయాలను చర్చించుకుంటాం, కో ఆర్డినేషన్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం టేబుల్ ఓవెల్ షేప్‌లో ఉంది కాబట్టి అందరూ పొరబడుతున్నారని పేర్కొన్నారు. హరీష్ రావు లీగల్ నోటీసులకు భయపడేది లేదనీ, ఏమైనా ఉంటే న్యాయస్థానంలో కొట్లాడుతామని స్పష్టం చేశారు. నా ముందు అర్వింద్, సంజయ్ పిల్లలు. లాల్ బహద్దూర్ శాస్త్రి కూడా హైట్ తక్కువే ఆయన దేశాన్ని ఏలలేదా ? అని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ప్రశ్నించారు.

## గోపాలపురం పాఠశాలకు నిధులు

(మొదటి పేజీ తరువాయి)

స్పందించిన సీఎం వెంటనే పాఠశాలను సందర్శించి వసతుల కల్పనకు అవసరమైననిధులను మంజూరు చేయాలని ఆదేశించారు. దీంతో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ జిల్లా కలెక్టర్, ఉపాధ్యాయిని ఇందిరతో మాట్లాడి పాఠశాలలో పరిస్థితులను తెలుసుకున్నారు. అలాగే కలెక్టర్ దివాకర పాఠశాలను సందర్శించి పాఠశాల అభివృద్ధిపై చొరవ చూపిన ఉపాధ్యాయిని ఇందిరను అభినందించారు. పాఠశాలలో గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపి సంబంధిత నిధులను మంజూరు చేశారు.

# క్యా బోల్తీ పబ్లిక్



**ఢిల్లీ, ఆగష్టు 6:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం దేశవ్యాప్త కార్యక్రమం 'క్యా బోల్తీ పబ్లిక్'ను ప్రకటించారు. సెప్టెంబర్ నుంచి పార్టీ దేశమంతా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతుందని, నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను తమ రాజకీయ కార్యాచరణలో ప్రధానంగా నిలుపుతామని చెప్పారు. రెండు రోజుల పార్టీ చర్చల అనంతరం మీడియాతో మాట్లాడిన దీప్కే.. గత నెల న్యూఢిల్లీ జంతర్ మంతర్‌లో జరిగిన సీజేపీ ఆధ్వర్యంలోని జెన్ జీ ఉద్యమానికి ముఖచిత్రంగా నిలిచారని, ఆ ఉద్యమం ఫలితంగా అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీగా మారకుండానే సీజేపీ కొనసాగుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా యువత ఆశయాలు, అంచనాలు, ఆందోళనలను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తామని దీప్కే తెలిపారు. రెండు రోజుల చర్చల తర్వాత కాక్రోచ్ జనతా పార్టీ సెప్టెంబర్‌లో దేశవ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఆ కార్యక్రమం పేరు 'క్యా బోల్తీ పబ్లిక్' అని దీప్కే చెప్పారు. భారత యువ జనాభాను నిర్లక్ష్యం చేశారని ఆరోపించిన దీప్కే.. దేశ జనాభాలో దాదాపు 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, అయినా వారి సమస్యలకు ప్రధాన రాజకీయ చర్చల్లో చోటు దక్కలేదని అన్నారు. ఈ అంశాలపై మాట్లాడేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మేము ప్రజల వద్దకు వెళ్తాం. వారి అంచనాలను తెలుసుకుంటాం. వారు ఎదుర్కొంటున్న సమస్యలను వింటాం అని చెప్పారు.

### విద్యా సంస్కరణలపై సీజేపీ పోరాటం

విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా విద్యా సంస్కరణలను సీజేపీ ముందుకు తీసుకెళ్తుందని దీప్కే చెప్పారు. విద్య ఖర్చు గణనీయంగా పెరిగింది. విద్యార్థులు అధిక ట్యూషన్ ఫీజులను ఎదుర్కొంటున్నారు. కుటుంబాలు భారీ విద్యా వ్యయాన్ని భరించాల్సి వస్తోంది. మన దేశంలో ఉద్యోగాలు దాదాపు లేవు. జంతర్ మంతర్కు వచ్చిన వారిలో చాలామంది నిరుద్యోగులే. బలవంతం వల్ల స్విగ్గి డెలివరీ ఎగ్జిక్యూటివ్‌గా లేదా డెలివరీ బాయ్‌గా మారాలని ఎవరి కలా, ఆశయమూ ఉండదు అని చెప్పారు.

డిగ్రీలు సంపాదించినా పెద్ద సంఖ్యలో చదువుకున్న యువత నిరుద్యోగులుగానే ఉన్నారని దీప్కే అన్నారు. డిగ్రీ సంపాదించిన తర్వాత కూడా దేశ యువతలో దాదాపు 80 శాతం మంది నిరుద్యోగులుగానే ఉన్నారు అని ఆయన పేర్కొన్నారు. చదువు పూర్తి చేయని వారు లేదా డిగ్రీలు లేని వారు ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. చదువుకున్న యువత భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు.

ఇప్పుడు నిరుద్యోగాన్ని జాతీయ అంశంగా మార్చాలనుకుంటున్నాను. ప్రభుత్వంగా మీరు నిరుద్యోగ సంక్షోభాన్ని ఇక నిర్లక్ష్యం చేయలేరు అని ఆయన తెలిపారు. పార్టీ సైద్ధాంతిక వైఖరిని మరోసారి స్పష్టం చేసిన దిప్కే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఆదర్శాలే సీజేపీకి మార్గదర్శకాలని చెప్పారు.

మా సిద్ధాంతం భారత రాజ్యాంగ విలువలపై ఆధారపడి ఉంటుంది. మేము లౌకికవాదులం. ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తాం. మేము ప్రజాస్వామ్యవాదులం. సామాజిక న్యాయం దిశగా పని చేస్తూనే ఉంటాం అని అన్నారు. మహాత్మా గాంధీ శాంతి, అహింస సందేశం, అంబేద్కర్ సామాజిక న్యాయ దృక్పథం, జవహర్లాల్ నెహ్రూ ఆధునిక భారత స్వప్నం మాకు స్ఫూర్తిగా నిలుస్తాయి అని చెప్పారు. ఇటీవలి రాజకీయ మార్పులకు విద్యార్థులే కారణమని దిప్కే పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పరిణామాలకు ముందు దేశం చాలా ఏళ్ల పాటు అణచివేత, నిరంకుశ పాలనను చూసిందని ఆరోపించారు.

# అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్త

(మొదటి పేజీ తరువాయి)

సరూర్‌నగర్‌లో నిర్వహించిన సామాజిక న్యాయం తెలంగాణ సంకల్ప సభలో కవిత మాట్లాడుతూ.. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి వరకు సామాజిక న్యాయం కోసం పాటుపడలేదని ఆమె అత్యంత ఘాటుగా విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణలో సామాజిక న్యాయం అంటేనే అందరూ భయపడుతున్నారన్నారు. నేటి ఈ సభ తెలంగాణలో కొత్త చరిత్రకు నాంది పలుకుతుందని, ఈ వేదిక అనేక మంది జీవితాల్లో మార్పు తీసుకురానుందని వెల్లడించారు. ఇది అత్యంత ధర్మపోరాటమని, ఈ పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతూ ఉంటుందని, సామాజిక న్యాయం సాధించే వరకు తాము చేసే అలుపెరుగని పోరాటంలో బీసీలంతా ఐక్యమయ్యి మద్దతూ ఇవ్వాలని కవిత పిలుపునిచ్చారు. అయితే, సమైఖ్య



పాలనలో కన్నా తెలంగాణ రాష్ట్రంలో బీసీలు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంచారని రేవంత్ సర్కార్‌పై దుదయ్యబట్టారు.

ఇదిలాఉంటే, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరస్పరం ప్రేమ లేఖలు రాసుకుంటారని.. బీసీ బిల్లుకు ఆమోదం తీసుకురావడంలో ఈ దోస్తీ ఎందుకు కనిపించడం లేదని కవిత ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్ సమావేశాలలోపు బీసీ బిల్లుకు ఆమోదం రాకపోతే సంక్రాంతి తర్వాత ఢిల్లీకి వెళ్లి ఉద్యమం చేపడతామని కవిత హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చి 8 దశాబ్దాలు కావుస్తున్న తెలంగాణలో ఇప్పటికీ ఇంకా కుల వివక్ష కొనసాగుతోందని కవిత అన్నారు. తాను అగ్రవర్ణ కుటుంబంలో పుట్టినా, అణగారిన వర్గాల కోసం చివరి వరకూ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. అగ్రవర్ణాలకు చెందిన వారంతా కూడా బుద్ధుడి ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

# అక్షరాల వ్యాపారం.. ఫోర్జరీల రాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

విస్తరించిన లంచాల వల ఆ లక్ష్యానికి దారుణంగా తూట్లు పొడుస్తోంది. ఏకంగా చెరువుల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో వార్తల్లో నిలిచిన 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ సంతకాన్నే ఫోర్జరీ చేసి దొంగ ఫైర్ ఎన్ఓసీలు సృష్టించారంటే, ఇంటర్మీడియట్ బోర్డు ఎంతటి 'మామూళ్ల మత్తు'లో జోగుతోందో స్పష్టమవుతోంది.

### లాలూచీ వైఖరి:

ఈ దొంగ అనుమతుల భాగోతం ఒక్క రోజులో వెలిసింది కాదు. అట్టడుగు తనిఖీ అధికారుల నుంచి ఇంటర్ బోర్డు ఏసీ గదుల్లో కూర్చునే ఉన్నతాధికారుల వరకు అల్లుకున్న లాలూచీ వైఖరి ఫలితమిది. కనీస విస్తీర్ణం, భద్రతా ప్రమాణాలు, మైదానాలు లేకపోయినా, చివరికి రేకుల షెడ్లలో కాలేజీలు నడుపుతున్నా 'తనిఖీ అధికారులు' క్షేత్రస్థాయికి వెళ్లకుండానే ముడుపుల మాయలో 'అన్నీ భేషుగ్గా ఉన్నాయి' అని బోర్డుకు నివేదికలు ఇచ్చేస్తున్నారు. అటు బోర్డు అధికారులు సైతం నకిలీ పత్రాలు పెట్టి దరఖాస్తు చేస్తే, వాటిని సంబంధిత శాఖల ద్వారా సరిచూసుకునే కనీస




బాధ్యతను గాలికి వదిలేసి, లంచాల కక్కుర్తితో కళ్లు మూసుకుని ఆమోదముద్ర వేసేస్తున్నారు. ఒక సామాన్యుడు సమాచార హక్కు చట్టం ద్వారా వెలికితీసే వరకు, లేక మీడియాలో కథనాలు వచ్చి బట్టబయలయ్యే వరకు ఈ బోర్డు పెద్దలకు అక్రమాలు కనిపించకపోవడం విడ్డూరం.

### ప్రతిష్టను దిగజార్చేలా:

నిబంధనలకు విరుద్ధంగా, నకిలీ పత్రాలతో నడుస్తున్న ఈ కాలేజీలలో వేలాదిమంది విద్యార్థులు చేరిపోయాక, విద్యా సంవత్సరం చివర్లో బోర్డు 'గుర్తింపు లేదు' అంటూ నోటీసులు ఇస్తే ఆ నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ఏమవ్వాలి? రేపు ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాలు గాల్లో కలిస్తే ఈ బోర్డు అధికారులు బాధ్యత వహిస్తారా? స్వయంగా విద్యాశాఖ మంత్రి బాధ్యతలు చేత భూని విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా తయారైన ఇంటర్ బోర్డు లంచాల రాజ్యాన్ని మూలమట్టంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఫోర్జరీ వ్యవహారంతో పాటు గడిచిన కొన్ని ఏళ్లుగా ఇంటర్ బోర్డు జారీ చేసిన ప్రతి కాలేజీ అనుమతిపై తక్షణమే సిఐడి విచారణకు ఆదేశించాలి. నకిలీ పత్రాలు సమర్పించిన కాలేజీ యాజమాన్యాలతో పాటు, లంచాలకు ఆశపడి వాటిని ఆమోదించిన ఇంటర్ బోర్డు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి. ఫైర్, జీహెచ్ఎంసీ, హైడ్రా ఎన్ఓసీలను డిజిటల్ విధానంలో ఆయా శాఖల అధికారిక వెబ్సైట్లతో నేరుగా అనుసంధానించి, మనుషుల ప్రమేయం లేని పారదర్శక తనిఖీ వ్యవస్థను తీసుకురావాలి. అప్పుడే హైదరాబాద్‌కు విద్యా హబ్‌గా అసలైన గుర్తింపు దక్కడమే కాకుండా, విద్యార్థుల విలువైన భవిష్యత్తుకు భరోసా లభిస్తుంది.

# తీగలాగితే డొంక కదిలింది

- ఒక కళాశాల యాజమాన్యంపై ఫిర్యాదుతో హైడ్రా విచారణ షురూ
- నగరంలోని అన్ని కళాశాలల ఎన్వోసీలను తనిఖీ చేస్తున్న హైడ్రా
- ప్రచారాన్ని ఖండించిన హైడ్రా కమిషనర్

**హైదరాబాద్, ఆగష్టు 06 (మనం న్యూస్):** నకిలీ ఫైర్ ఎన్ వోసీలపై హైడ్రా లోతైన విచారణ చేపట్టింది. ఫేక్ ఫైర్ ఎన్ వోసీల సృష్టికర్తలు ఎవరనే దానిపై శాఖాపరమైన విచారణ జరుగుతోందని హైడ్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. గడ్డం శ్రీనివాస యాదవ్ అనే రాజకీయ నాయకుడి కళాశాల(హైందవీ జూనియర్ కళాశాల)కు చెందిన ఫేక్ ఎన్ వో సీ పై వచ్చిన ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగింది. తీగ లాగితే డొంక కదిలినట్టు చాలా కళాశాలలు ఫేక్ ఫైర్ ఎన్ వోసీలతో ఇంటర్ బోర్డు అనుమతులకు దరఖాస్తు చేసుకున్నట్టు తేలింది. దీంతో ఓ ఆర్ ఆర్ పరిధిలోని కళాశాలల ఫైర్ ఎన్వోసీలన్నిటినీ పరిశీలించడం ప్రారంభించింది. ప్రాథమికంగా కొన్నిటిని పరిశీలించగా.. 8 కళాశాలల ఫైర్ ఎన్వోసీలు నకిలీవని తేలింది. వెనువెంటనే నెక్లెస్ రోడ్డులోని లేక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తర్వాత మరో 44 కళాశాలల ఫైర్ ఎన్ వోసీలు ఫేక్ అని తేలింది. ఈ జాబితాను కూడా లేక్ పోలీసులకు హైడ్రా అందజేసింది. ఇలా కళాశాలలన్నీ సమర్పించిన ఫైర్ ఎన్ వోసీలను ఇంటర్ బోర్డుతో కలిసి హైడ్రా పరిశీలిస్తోంది. నకిలీ ఫైర్ ఎన్వోసీలకు సంబంధించి హైడ్రా దృష్టికి రాగానే విచారణ చేపట్టడం.. పోలీసులకు ఫిర్యాదు చేయడం.. ఇంటర్ బోర్డుకు లేఖ రాయడం.. ఒకదాని తర్వాత ఒకటిగా చేస్తూ వచ్చింది. ఇందులో పాత్రదారులు, సూత్రదారులు ఎవరనే విషయాన్ని పోలీసులు నిగ్గు తేల్చనున్నారు. అలాగే ఇంటర్మీడియట్ లో ఒక అధికారి ని నోడల్ ఆఫీసర్ గా నియమించారు. ఆ అధికారి హైడ్రా తో కలసి.. నకిలీ సర్టిఫికెట్లు ఎన్ని ఉన్నాయో గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

### తప్పుడు ప్రచారాన్ని ఖండించిన హైడ్రా..

ఫేక్ ఫైర్ ఎన్వోసీలపై హైడ్రా ముమ్మర విచారణ చేపట్టగా.. దీనితో హైడ్రాకు సంబంధమున్నట్టు తెలుగు స్క్రైబ్ తప్పుడు ప్రచారం చేయడాన్ని హైడ్రా ఖండించింది. తెర వెనుక డీఐఈవోలు, ఉన్నతాధికారులు, హైడ్రా అధికారుల వరకు జోరుగా పంపకాలు జరిగినట్టు పేర్కొనడం తగదని హెచ్చరించింది. దీనిని నిర్ధారించుకోకుండా.. మరికొన్ని సామాజిక మాధ్యమాలు దుష్ప్రచారం చేయడం తగదని పేర్కొంది. హైడ్రా మీద తప్పుడు ప్రచారం చేయడం తెలుగు స్క్రైబ్ కు అలవాటుగా మారిందని.. ఇది సరైన విధానం కాదంది. ఫేక్ ఫైర్ ఎన్ వోసీల వ్యవహారంలో నిగ్గు తేల్చేందుకే పోలీసులకు జులై 4వ తేదీన హైడ్రా ఫిర్యాదు చేసింది. పత్రికల్లో రెండు రోజుల క్రితం వార్తలు వస్తే.. నెల రోజుల ముందే లేక్ పోలీసులకు హైడ్రా ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. జీహెచ్ ఎంసీ, ఫైర్ డిపార్టు మెంట్ పేరుమీద.. రకరకాల స్టాంపులతో.. వేర్వేరు కార్యాలయాల పేరిట ఫైర్ ఎన్వోసీలు జారీ అయిన విషయం ఒకటొకటిగా బయటపడుతున్నాయని హైడ్రా తెలిపింది. 15 మీటర్ల ఎత్తు లోపు ఉన్న భవనాలకే హైడ్రా ఫైర్ ఎన్ వోసీలు జారీ చేస్తుంది. 15 మీటర్ల ఎత్తుకంటే ఎత్తైన భవనాలకు రాష్ట్ర ఫైర్ శాఖ ఎన్ వోసీలను ఇస్తుంది. హైడ్రా రాక ముందు జీహెచ్ ఎంసీ ఫైర్ ఎన్ వోసీలను జారీ చేసేది. ఇప్పటికీ జీహెచ్ ఎంసీ పేరిట ఫేక్ ఫైర్ ఎన్వోసీలు జారీ అవుతుండడం గమనార్హం.

# కల్వకుర్తి మినీ స్టేడియానికి మహర్దశ



కల్వకుర్తి ఆగష్టు 6 (మనం న్యూస్): కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని మినీ స్టేడియం అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ 1 కోటి 30 లక్షల నిధులు మంజూరు చేయడంతో స్టేడియానికి మహర్దశ చేకూరనుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.కల్వకుర్తి మినీ స్టేడియంలో రూ.1 కోటి 30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సమగ్ర అభివృద్ధి పనులకు గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా రంగానికి తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని అన్నారు. కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధికి మంజూరైన నిధులతో ప్రహరి గోడ నిర్మాణం,400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్,కబడ్డీ, వాలీబాల్ కోర్టులు,డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. యువతకు క్రీడల్లో మెరుగైన మౌలిక అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం నాయక్,కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్,స్థానిక కౌన్సిలర్ షేక్ ఏజాస్, కమీషనర్ షేక్ మహమూద్, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల్ల రాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సయ్యద్ మసూద్,రమాకాంత్ రెడ్డి, నాయకులు మక్బూల్, చంద్రకాంత్ రెడ్డి,చిత్తారి శీను,గణేష్, సోఫీ, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.



# కేటీఆర్‌తో ప్రకాష్ అంబేద్కర్ భేటీ

- సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలపై చర్చించిన నేతలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు, వంచిత్ బహుజన్ అగాడీ అధినేత, ప్రకాష్ అంబేద్కర్ హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ మేరకు బంజారాహిల్స్‌లోని కేటీఆర్ నివాసంలో గురువారంనాడు జరిగిన ఈ సమావేశంలో పలు రాజకీయ, సామాజిక అంశాలపై వీరిద్దరూ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డిలతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులను ప్రకాష్ అంబేద్కర్‌కు కేటీఆర్ పరిచయం చేశారు. భేటీ అనంతరం ప్రకాష్ అంబేద్కర్‌కు కేటీఆర్ శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

# పదవుల భర్తీపై పెదవి విరిచిన టీజేఎస్

## జయశంకర్ సార్‌కు ఘన నివాళులు అర్పించిన కోదండరాం

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ సిద్ధాంత కర్త, జాతి పిత, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి వేడుకలు నాంపల్లి తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు, టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం పాల్గొని ఆచార్య జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ఆచార్య జయశంకర్, గద్దర్ జీవితాలు ప్రజాస్వామ్య మార్గంలో సామాజిక మార్పు సాధ్యమని నిరూపించాయని అన్నారు. వారి స్ఫూర్తితో సమాజ పరివర్తన కోసం నిరంతరం కృషి చేయాలని, ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణానికి అందరూ పూనుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమం సాధారణ ప్రజలు చేసిన అసాధారణ ఉద్యమమని పేర్కొన్నారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తూ తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన పాటల ద్వారా తెలంగాణ ఆవశ్యకతను అత్యంత సరళంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమానికి ఊపిరి పోసిన వ్యక్తి గద్దర్ అని తెలిపారు. వారి జీవితాలు ప్రజాస్వామ్య విలువలు, ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. ఇటీవల ఢిల్లీలో విద్యార్థులు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాలు కూడా అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సాధారణ యువత తమ డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సమగ్ర తెలంగాణ నిర్మాణం కోసం అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వంతో చర్చిస్తున్నాం..

చాల కాలంగా పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మా పట్ల సరిగా లేదని ఎమ్మెల్సీ కోదండరాం పెదవి విరిచారు. పదవుల భర్తీ ఆలస్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం లేదన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల అంశంలో బీఆర్ఎస్ హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో స్పందన బాగుందని రేవంత్ రెడ్డి సర్కారును ప్రశంసించారు.

ప్రభుత్వంలో తమ భాగస్వామ్యంపై సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు. మాకు ఎమ్మెల్సీ, కార్పోరేషన్ చైర్మన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరితో ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సర్ అని విద్యార్థులే ప్రకటించుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం వివరించారు.

# ప్రజాకవి గద్దర్‌కు రేవంత్ ఘన నివాళులు

హైదరాబాద్, ఆగష్టు 6 : ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. గద్దర్ ఆటా-పాటా తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తన పాటల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని నింపారని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం తన గళాన్ని వినిపించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాటలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయని అన్నారు. పాటను ప్రజా ఉద్యమానికి ఆయుధంగా మార్చిన అరుదైన వ్యక్తిత్వం గద్దర్ ది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

# జయశంకర్ సార్‌కు రేవంత్ ఘన నివాళులు

హైదరాబాద్, ఆగష్టు 6 : ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# పోకిరీల బెండు తీసిండ్రు

- బోనాల వేడుకల్లో వందలాది మహిళలకు వేధింపులు

హైదరాబాద్, మనం ప్రతినిధి : ప్రతిష్టాత్మక లష్కర్ బోనాల ఉత్సవాల సందర్భంగా మహిళల భద్రత కోసం షీటీమ్స్ ప్రత్యేక నిఘా చేపట్టాయి. అయితే, ఈ ఉత్సవాల్లో భాగంగా పలు దేవాలయాల వద్ద మహిళలను కొందరు వ్యక్తులు వేధింపులకు గురిచేశారు. మహిళల ఫిర్యాదు ఆధారంగా షీ టీమ్స్ రంగంలోకి దిగారు. మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, వేధింపులకు గురిచేసిన 678 మంది ఈవ్టీజర్లను గుర్తించారు. సీసీటీవీ ఫుటేజ్, వీడియో ఆధారాలతో నిందితులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. విచారణ అనంతరం ఆకతాయిలను కోర్టులో హాజరుపర్చగా.. న్యాయస్థానం పలువురికి శిక్షలు విధించింది. 25 మందికి జైలు శిక్షతోపాటు జరిమానాలను కోర్టు విధించింది. అలాగే 11 మందికి 3 రోజుల జైలు శిక్షతో పాటు రూ.1,050 జరిమానా విధించింది. మరో 26 మందికి రూ.1,050 చొప్పున జరిమానాతో పాటు సామాజిక సేవ చేయాలంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మహిళల భద్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# జయశంకర్ త్యాగం మరువలేనిది

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 93వ జయంతి సందర్భంగా రాజ్యసభ బీఆర్ఎస్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు, అమర్ రావు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు తోడుగా నిలిచి తెలంగాణ కోసం ఆయన గట్టిగా పోరాడారన్నారు. సార్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలు అమూల్యం అని వెల్లడించారు. మలిదశ ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం పోరాడిన 2011లో ప్రత్యేక రాష్ట్రం రాకముందే కన్నుమూయడం బాధాకరమని బీఆర్ఎస్ ఎంపీలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సమన్వయంతో యూనిఫామ్ పంపిణీ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ ఆగష్టు 6 (మనం బ్యూరో): సెర్ఫ్, విద్యా శాఖ ఉన్నతాధికారులతో డిఆర్డిఏ, మెప్మా, జిల్లా విద్యా శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ విద్యార్థుల యూనిఫామ్ పంపిణీ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి వివిధ అంశాలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఆర్డిఏ, మెప్మా, విద్యా శాఖ సమన్వయంతో యూనిఫామ్ పంపిణీ పూర్తి చేయాలని, పంపిణీకి ముందు యూనిఫామ్ నాణ్యతను పరిశీలించాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలియజేసే 'అపార్' నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆధార్ లో పొరపాట్ల వల్ల రిజిస్ట్రేషన్ ఆలస్యమైతే ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఆధార్ సరి చేయించాలని, ప్రధానోపాధ్యాయులు ఈ బాధ్యత తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, 95 శాతం విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను ఎంఈఓలు పరిశీలించాలని, అవసరమైన చోట వసతులు కల్పనకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. వర్షాల కారణంగా పాఠశాలలో ఇబ్బందులు లేకుండా చూడాలని, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం కావాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ పాఠశాలల్లో నిర్దేశిత లక్ష్యం నిండే వరకు విద్యార్థులను చేర్చుకోవాలని పేర్కొన్నారు. విద్యా శాఖ ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహిస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాధికారి చైతన్య జైని, ఏ.డి ప్రశాంత్ రెడ్డి, కో ఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, ఎమ్.ఈ.ఓలు పాల్గొన్నారు.

# సచివాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సంజయ్ జాజు



హైదరాబాద్, ఆగస్టు 6(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.సచివాలయం ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

# మమ్మల్ని ఖతం జేస్తరు



## నా ప్రేమ పెళ్లిని అడ్డుకుంటున్నరు?

## నాకు, నా ప్రేయసికి ఏం జరిగినా మా నాన్నదే బాధ్యత?

## ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌పై కొడుకు సంతోష్ గౌడ్ ఆరోపణలు



హైదరాబాద్, మనం ప్రతినిధి : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌పై ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. తాను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకోవడాన్ని తన తండ్రి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమకు ఏదైనా జరిగితే అందుకు ప్రకాశ్ గౌడ్‌నే బాధ్యుడిగా భావించాలని అన్నారు. మణికొండకు చెందిన బీఆర్ఎస్ నాయకురాలు రూపారెడ్డి కుమార్తెను తాను ప్రేమిస్తున్నానని సంతోష్ గౌడ్ తెలిపారు. ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పగా తొలుత కుటుంబ సభ్యులు అంగీకరించలేదని చెప్పారు. తర్వాత తన ఇష్టప్రకారం పెళ్లి చేసుకోవచ్చని చెప్పడంతో గత నెలలో నిశ్చితార్థం చేసుకున్నానని వెల్లడించారు. అప్పటి నుంచి రూపారెడ్డి ఇంట్లోనే ఉంటున్నట్లు తెలిపారు. తమను అంతం చేయాలనే ఉద్దేశంతో దాదాపు 40 మందితో తన కాబోయే అత్త ఇంటిపై దాడి చేయించారని సంతోష్ గౌడ్ ఆరోపించారు. ఈ ఘటన వెనుక తన తండ్రి ఉన్నారని అన్నారు. దాడి విషయాన్ని పోలీసులకు తెలియజేసినా ఫిర్యాదును సరిగా స్వీకరించలేదని సంతోష్ గౌడ్ ఆరోపించారు. నార్సింగ్ పోలీసులు రాజకీయ ఒత్తిళ్లతో తమపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. మీడియా ముందుకు రావడంతో తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, తనపై కొడుకు చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు.

# ర్యాంకుల పంట పండిస్తున్న బీసీ గురుకులాలు

- టీజీ సీపీగెట్‌లో ఇద్దరికి ఫస్ట్ ర్యాంక్
- టాప్-10లో ఆరుగురు.. వంద లోపు 32 మంది
- మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల డిగ్రీ విద్యార్థుల జయకేతనం



హైదరాబాద్,ఆగష్టు 6(మనం న్యూస్) : తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ సీపీగెట్)-2026 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు అపూర్వ విజయాన్ని నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షలో బీసీ గురుకుల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి విద్యా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించినట్లు సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు,గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో కామర్స్ విభాగంలో తోట రాహుల్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఎస్. శ్రావణి మొదటి ర్యాంక్ సాధించి సంచలనం సృష్టించారు. అలాగే బోటనీ విభాగంలో ఎం. వినీల్, ఫిజిక్స్ విభాగంలో ఎం. ప్రశాంత్ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ దక్కించుకోగా, జువాలజీ విభాగంలో జి. అనూష మూడో ర్యాంక్ సాధించారు. మొత్తం ఆరుగురు విద్యార్థులు టాప్-10 లోపు, 12 మంది విద్యార్థులు 20 లోపు, 18 మంది విద్యార్థులు 50 లోపు రాష్ట్ర ర్యాంకులు సాధించగా, 17 పోస్ట్ గ్రాడ్యుయేట్ విభాగాల్లో ఏకంగా 32 మంది విద్యార్థులు 100 లోపు ర్యాంకులు సాధించి గురుకుల విద్యా ప్రమాణాల సత్తాను చాటారు.

### గురుకులాల కల్పవృక్షం - నాణ్యమైన విద్య

ప్రభుత్వం బీసీ గురుకులాల్లో అందిస్తున్న నాణ్యమైన ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ, అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల నిరంతర కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కార్యదర్శి కొనియాడారు. విద్యార్థులను ఉన్నత విద్య, పరిశోధనలకు గురుకులాలు సమర్థంగా తీర్చిదిద్దుతున్నాయనే విషయాన్ని ఈ ఫలితాలు నిరూపించాయని ఆయన వెల్లడించారు. ఇటీవల వెలువడిన సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లోనూ బీసీ గురుకుల డిగ్రీ విద్యార్థులు మెరిసారు. ఏకంగా 28 మంది విద్యార్థులు అర్హత సాధించి దేశంలోని అత్యుత్తమ కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో పీజీ సీట్లు సాధించారని కార్యదర్శి సైదులు వివరించారు. కందుకూరు బీసీ గురుకుల లా కళాశాల విద్యార్థి జనార్ధన్ రచించిన కేస్ కామెంటరీ ప్రతిష్ఠాత్మక ఇండియన్ జర్నల్ ఆఫ్ లా అండ్ లీగల్ రిసెర్చ్‌లో' ప్రచురితమవడం సంస్థకు గర్వకారణమని కార్యదర్శి తెలిపారు. ఇది విద్యార్థి పరిశోధనా సామర్థ్యానికి, కళాశాలలో అందుతున్న నాణ్యమైన న్యాయ విద్యకు నిదర్శనమన్నారు.

### ఆర్ట్ డైరెక్టర్‌గా గురుకుల చిన్నోడు..

మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో బీఏ యానిమేషన్ విఎఫ్ ఎక్స్ మొదటి బ్యాచ్ విద్యార్థి వినయ్, ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ 'వైరా ప్రొడక్షన్స్' లో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా ఎంపిక కావడం విశేషం. సృజనాత్మక మరియు ఉపాధి రంగాల్లోనూ బీసీ గురుకుల విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని సెక్రటరీ తెలిపారు. టీజీ సీపీగెట్-2026లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన లా విద్యార్థి జనార్ధన్‌ను, సినీ రంగంలో అవకాశం దక్కించుకున్న వినయ్‌ను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, బీసీ సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, విద్యాసంస్థల కార్యదర్శి బడుగు సైదులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ బీసీ గురుకులాలు నాణ్యమైన ఉన్నత విద్యతో పాటు పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తాయని తెలిపారు.

# పాఠశాల పేరు చివరన తోకలు కట్

- మోడల్, ఇంటర్నేషనల్, టెక్నో ఒలింపియాడ్, టాలెంట్ పేర్ల వాడకంపై నిషేధం
- ఈ ఫ్యాన్సీ ట్యాగ్స్‌ను ఖచ్చితంగా తీసేయాల్సిందే?
- జీవో 91 అమలుపై విద్యాశాఖ సీరియస్
- ప్రభుత్వ నిబంధనలు బేఖతర్ చేసేవారిపై కఠిన చర్యలుంటాయ్?
- తీవ్రంగా హెచ్చరించిన తెలంగాణ విద్యా శాఖ

మీరుండే ఏరియాలోనో, ఊరిలోనో ఉండే ప్రైవేటు స్కూల్స్ పేర్లను ఎప్పుడైనా గమనించారా..? అవును కచ్చితంగా ప్రైవేట్ స్కూల్ పేర్లలో ఇంటర్నేషనల్, టెక్నో, ఒలింపియాడ్, టాలెంట్ వంటి పదాలు కనిపిస్తాయి. అయితే అటువంటి పదాలను స్కూల్ నేమ్ బోర్డులో వాడొద్దనే రూల్ ఉందనే విషయం తెలుసా..? అటువంటి పేర్లు ఉపయోగించరాదని రాష్ట్ర ప్రభుత్వం 2009లో జారీ చేసిన జీవో నెం.91 స్పష్టంగా పేర్కొన్నప్పటికీ.. చాలా జిల్లాల్లో ఇప్పటికీ వందలాది పాఠశాలలు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నట్లు తేలింది. ప్రభుత్వం నిషేధించిన ఈ పేర్లను కొనసాగిస్తూ కొన్ని విద్యాసంస్థలు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతు వెళా ఇకనుంచైనా ప్రభుత్వం సీరియస్ యాక్షన తీసుకుంటొందా? లేదా? అనేది వేచి చూడాలి మరి.

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలోని ప్రైవేట్ స్కూల్ పేర్లలో మోడల్, ఇంటర్నేషనల్, టెక్నో, ఒలింపియాడ్, టాలెంట్ వంటి పదాలను వాడకూడదని రాష్ట్ర ప్రభుత్వం 2009లోనే జీవో-91 ద్వారా నిషేధించినప్పటికీ, ఇప్పటికీ చాలా ప్రైవేటు పాఠశాలలు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నట్లు తేలింది. విద్యావేత్తలు ఇటువంటి పేర్లను మార్కెటింగ్ వ్యూహాలుగా చెబుతుండగా.. ప్రభుత్వ ఉత్తర్వుల అమలులో లోపాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు పేరు కంటే విద్యా నాణ్యతను ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు.

పాఠశాల విద్యాశాఖ అధికారిక డేటాబేస్ ఆధారంగా నిర్వహించిన విశ్లేషణ ప్రకారం.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని మొత్తం 3,697 పాఠశాలల్లో కనీసం 601 స్కూల్స్ అంటే దాదాపు 16.3 శాతం విద్యాసంస్థలు, నిషేధిత పదాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పదాలను తమ పేర్లలో కొనసాగిస్తున్నాయని తేలింది. వీటిలో అత్యధికంగా మోడల్ అనే పదం 210 పాఠశాలల పేర్లలో ఉండగా.. టాలెంట్ 73, ఇంటర్నేషనల్ 72 పాఠశాలల పేర్లలో కనిపించింది. అదనంగా కాన్సెప్ట్, ఎక్సలెన్స్, బ్రిలియంట్, క్రియేటివ్ వంటి పదాలు కూడా విస్తృతంగా వినియోగంలో ఉన్నట్లు గుర్తించారు.

### ఫీజుల కట్టడికి కొత్త చట్టం.. ప్రైవేట్ స్కూళ్లకు విద్యాశాఖ ఆదేశాలు

2009లో జారీ చేసిన జీవో-91 ప్రకారం.. ఇటువంటి పేర్లు పాఠశాలలు పెట్టుకుంటే ఇతర సంస్థల కంటే మెరుగైన విద్య అందిస్తున్నాయనే తప్పుడు అభిప్రాయాన్ని తల్లిదండ్రుల్లో కలిగిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ పేర్లను ఆధారంగా చేసుకుని అధిక ఫీజులు వసూలు చేసే అవకాశం ఉందన్న కారణంతో ఈ నిబంధన తీసుకొచ్చారు. అయినప్పటికీ దాదాపు 17 సంవత్సరాలు గడిచినా ఆ ఉత్తర్వుల అమలు పూర్తిస్థాయిలో జరగలేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. విద్యావేత్తలు ఈ ధోరణిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా పేర్లు విద్యా నాణ్యతకు కొలమానం కావని, కేవలం తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ఉపయోగించే మార్కెటింగ్ వ్యూహాలేనని మాజీ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్పర్సన్ డాక్టర్ శాంతా సిన్హా పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్య కూడా ఒక వస్తువులా మారిపోయిందని, పిల్లలకు మంచి విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను కొందరు విద్యాసంస్థలు బ్రాండింగ్ ద్వారా వినియోగించుకుంటున్నారని ఆమె వ్యాఖ్యానించారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శేఖర్‌రావు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్నేషనల్, మోడల్, టెక్నో వంటి పదాలను చూసి చాలా మంది తల్లిదండ్రులు ఆ పాఠశాలలు మెరుగైన విద్య అందిస్తాయని భావిస్తున్నారని, కొందరు యాజమాన్యాలు ఈ అభిప్రాయాన్ని మార్కెటింగ్ సాధనంగా ఉపయోగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

ఈ విషయంపై హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య స్పందిస్తూ.. రెండు సంవత్సరాల క్రితం నిబంధనలను ఉల్లంఘించిన పలు పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత కొన్ని విద్యాసంస్థలు తమ పేర్లను మార్చుకున్నాయని.. ప్రస్తుతం కొత్తగా గుర్తింపు కోసం వచ్చే పాఠశాలలకు నిషేధిత పదాలతో పేర్లకు అనుమతి ఇవ్వడం లేదని చెప్పారు. ఇదిలా ఉండగా, కొందరు తల్లిదండ్రులు కూడా పాఠశాల పేర్లు తమ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయని అంగీకరిస్తున్నారు. ఇంటర్నేషనల్, టెక్నో వంటి పదాలు కనిపిస్తే అక్కడ మెరుగైన పాఠ్యాంశాలు, ఆధునిక సౌకర్యాలు ఉంటాయని చాలామంది భావిస్తారని చెబుతున్నారు.

మరోవైపు ప్రైవేటు స్కూల్స్ యాజమాన్య సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ రాజు మాత్రం కేంబ్రిడ్జ్ లేదా ఐబీ సిలబస్ బోధించే పాఠశాలలు ఇంటర్నేషనల్ అనే పదాన్ని ఉపయోగించడంలో తప్పు లేదని అభిప్రాయపడ్డారు. అయితే కేవలం పేరు ఆధారంగా కాకుండా పాఠశాల బోధనా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల నాణ్యత, విద్యార్థుల ఫలితాలు వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

## ప్రశ్నల పరాగం

కాలం గాజు గిన్నెలో దాచిన పగుళ్లను
యువతరం వేళ్లు చదవడం మొదలెట్టాయి!

లీకైన ప్రశ్నాపత్రం -
కేవలం ఒక పరీక్ష కాదు
భవిష్యత్తు నుదుటిపై పట్టిన కాల గ్రహణం!

ప్రతి నిరుద్యోగి కన్నూ
దేశపు పటంలో తెరుచుకున్న
ఒక కొత్త సరిహద్దు!

నిశ్శబ్దం ఇక గ్రంథాలయపు దుమ్ము కాదు,
మన శ్వాస అడుగుతున్న
రాజ్యాంగపు తెల్లని ఖాళీ!

ఈ రోజు వీధుల్లో నడుస్తున్నది
విద్యార్థులు కాదు
రేపటి చరిత్రకు ముందుమాట
రాస్తున్న ప్రశ్నల పరాగం!

గాలిలో ఎగురుతున్న నిరసన స్వరాలు
రేపటి చైతన్యానికి నూతన విత్తనాలు!

అధికారం అల్లిన ఇనుప బారికేడ్లు
భయంతో పేర్చిన తాత్కాలిక సాలెగూళ్ళు!

వాటిని చేతులతో కాదు...
యువతరం తమ ప్రకాశించే
రేపటితో చీరేస్తోంది!

నేల పాలు చేసిన విశ్వాసపు బూడిద నుంచే
ప్రతిఘటన తన మొదటి
శ్వాస తీసుకుంటోంది!

ఈ ప్రశ్నల మొలకను ఏ అధికార బలమూ
మట్టిలో శాశ్వతంగా పాతిపెట్టలేదు!

**- యం డి. ఉస్మాన్ ఖాన్**
9912580645

# అణు నిరాయుధీకరణకు అడ్డుగోడ అగ్రరాజ్యాలే



అణ్వాయుధాలు మానవాళిని ఎన్నిసార్లైనా నాశనం చేయగల శక్తిని కలిగి ఉన్నాయని ప్రపంచం ఎనిమిది దశాబ్దాల క్రితమే గ్రహించింది. అందుకే రెండో ప్రపంచ యుద్ధం అనంతరం అణ్వాయుధాల వ్యాప్తిని అరికట్టేందుకు, ఇప్పటికే ఉన్న ఆయుధాలను తగ్గించేందుకు అనేక అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. అయినప్పటికీ, అణ్వాయుధాలు తగ్గాల్సిన చోట మరింత ఆధునీకరించబడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం సాంకేతిక లోపాలు కాదు. అగ్రరాజ్యాల రాజకీయ ద్వంద్వ వైఖరే.

ప్రపంచ శాంతి, అణ్వాయుధ నిరాయుధీకరణ గురించి అత్యధికంగా మాట్లాడే దేశాల్లో అమెరికా ముందుంటుంది. అయితే దాని మాటలకు, ఆచరణకు మధ్య ఉన్న అంతరమే అంతర్జాతీయ అణు వ్యవస్థపై విశ్వాసాన్ని బలహీనపరిచింది. ఇతర దేశాలు అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తే ప్రపంచ భద్రతకు ముప్పు అని హెచ్చరించే అదే అమెరికా, తన వద్ద వేలాది అణ్వాయుధాలను నిల్వ ఉంచుకోవడాన్ని జాతీయ భద్రత పేరుతో సమర్థించుకుంటుంది. ఇదే ద్వంద్వ ప్రమాణం అనేక దేశాల్లో అసంతృప్తిని పెంచింది.

మానవ చరిత్రలో యుద్ధంలో అణుబాంబును ప్రయోగించిన ఏకైక దేశం అమెరికా. 1945 ఆగస్టు 6న హిరోషిమాపై, ఆగస్టు 9న నాగసాకిపై అణుబాంబులు వేయడంతో లక్షలాది మంది అమాయక పౌరులు తక్షణమే లేదా తరువాత రేడియోధార్మిక వికిరణాల ప్రభావంతో ప్రాణాలు కోల్పోయారు. ఆ విధ్వంసం మానవ నాగరికతకు చెరగని మచ్చగా మిగిలిపోయింది. యుద్ధాన్ని త్వరగా ముగించడానికే ఈ చర్య తీసుకున్నామని అమెరికా అధికారికంగా చెప్పినప్పటికీ, కొందరు ప్రముఖ చరిత్రకారులు దీనిని అప్పటి సోవియట్ యూనియన్కు అమెరికా తన సైనిక శక్తిని ప్రదర్శించిన చర్యగా కూడా విశ్లేషిస్తారు. కారణాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నా, అణ్వాయుధాలను యుద్ధంలో ఉపయోగించిన ఏకైక దేశం అమెరికానే అన్నది మాత్రం చారిత్రక సత్యం.

1968లో రూపొందిన అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం ప్రపంచాన్ని రెండు వర్గాలుగా విభజించిందనే విమర్శ మొదటి నుంచే ఉంది. అప్పటికే అణ్వాయుధాలు కలిగిన ఐదు దేశాలకు ప్రత్యేక హోదా కల్పించి, మిగిలిన దేశాలకు మాత్రం పరిమితులు విధించడం సమానత్వ సూత్రానికి విరుద్ధమని అనేక దేశాలు అభిప్రాయపడ్డాయి. అణ్వాయుధ దేశాలు నిరాయుధీకరణకు కట్టుబడి ఉంటామని ప్రకటించినప్పటికీ, ఆ దిశగా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేకపోయాయి.

ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం అణ్వాయుధాల్లో దాదాపు తొంభై శాతం అమెరికా, రష్యా దేశాల వద్దనే ఉన్నాయి. ఒకవైపు నిరాయుధీకరణ గురించి మాట్లాడుతూనే, మరోవైపు తమ అణ్వాయుధ వ్యవస్థలను ఆధునీకరించడం ప్రపంచానికి విరుద్ధ సంకేతాలను పంపుతోంది. అణ్వాయుధాలు తమకు అవసరమని, ఇతర దేశాలకు మాత్రం అవసరం లేదని పరోక్షంగా చెప్పే ఈ విధానం అంతర్జాతీయ వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బ తీస్తోంది.అంతర్జాతీయ ఆయుధ నియంత్రణ వ్యవస్థను బలహీనపరిచిన నిర్ణయాల్లో కూడా అమెరికా పాత్ర ప్రస్తావనీయమే. 2002లో క్షిపణి నిరోధక వ్యవస్థల పరిమితి ఒప్పందం నుంచి వైదొలగడం, 2018లో ఇరాన్‌తో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ఒప్పందంను విడిచిపెట్టడం, 2019లో అమెరికా-రష్యా మధ్య ఉన్న మధ్యశ్రేణి అణు క్షిపణుల నిర్మూలన ఒప్పందం ముగియడానికి దారితీసిన పరిణామాలు ప్రపంచ భద్రతా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపాయి. అదే సమయంలో రష్యాపై కూడా ఈ ఒప్పంద ఉల్లంఘన ఆరోపణలు వచ్చాయి. ఇరాన్‌పై జరిగిన యుద్ధం అంతర్జాతీయ రాజకీయాల్లో మరో ముఖ్యమైన ఉదాహరణ. వినాశక ఆయుధాలు ఉన్నాయనే ఆరోపణలతో యుద్ధం ప్రారంభమైనప్పటికీ తరువాత అలాంటి ఆయుధాలు కనుగొనబడలేదు. అయినప్పటికీ లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక దేశం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర సంక్షోభంలోకి వెళ్లింది. ఈ సంఘటన ప్రపంచవ్యాప్తంగా అమెరికా విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తింది.




లిబియా, ఇరాక్ వంటి దేశాల్లో జరిగిన పరిణామాలు, అలాగే 1994లో అణ్వాయుధాలను వదులుకున్న ఉక్రెయిన్ తరువాత రష్యా దాడులను ఎదుర్కొన్న పరిస్థితి ప్రపంచ భద్రతా వ్యవస్థపై కొత్త సందేహాలను సృష్టించాయి. ఈ పరిణామాలు అంతర్జాతీయ భద్రతా హామీల విశ్వసనీయతపై విస్తృత చర్చకు దారితీశాయి. కొందరు వ్యూహాత్మక విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఇవి కొన్ని దేశాల్లో అణ్వాయుధాలే అంతిమ రక్షణ అనే భావనను బలపరిచాయి. ఇది అణ్వాయుధ నిరాయుధీకరణ లక్ష్యానికి ఎదురుదెబ్బగా మారింది. అయితే ఈ సంక్షోభానికి అమెరికా ఒక్కటే కారణమని చెప్పడం సరైంది కాదు. రష్యా, చైనా, ఉత్తర కొరియా వంటి దేశాలు కూడా తమ అణ్వాయుధ సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకుంటున్నాయి. అయినప్పటికీ ప్రపంచ రాజకీయాల్లో అత్యధిక ప్రభావం కలిగిన దేశంగా అమెరికాపై నైతిక బాధ్యత మరింత ఎక్కువ. ప్రపంచానికి సూచించే ప్రమాణాలను ముందుగా తానే పాటించినప్పుడే ఆ నాయకత్వానికి విశ్వసనీయత లభిస్తుంది.

ప్రపంచానికి ఇప్పుడు అవసరమైనది కొత్త ఆయుధాల పోటీ కాదు; కొత్త విశ్వాసం. అణ్వాయుధ దేశాలన్నీ 'ఏ దేశంపైనా ముందుగా అణ్వాయుధాలను ప్రయోగించము' అనే విధానాన్ని స్వీకరించే దిశగా కదలాలి. అణుశక్తి వినియోగాన్ని పర్యవేక్షించే అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తనిఖీలను మరింత పారదర్శకంగా, వివక్ష లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాలి. అలాగే కృత్రిమ మేధస్సు ఆధారిత స్వయంచాలిత వ్యవస్థల ద్వారా అణ్వాయుధాల నియంత్రణ జరగకుండా స్పష్టమైన అంతర్జాతీయ నిబంధనలు రూపొందించాలి.

అణ్వాయుధాలు ఏ దేశానికీ శాశ్వత భద్రతను ఇవ్వవు. అవి పరస్పర వినాశనాన్ని మాత్రమే హామీ ఇస్తాయి. అగ్రరాజ్యాలు తమకు ఒక న్యాయం, మిగిలిన ప్రపంచానికి మరో న్యాయం అనే ద్వంద్వ వైఖరిని విడిచిపెట్టి, నిజమైన నిరాయుధీకరణ దిశగా ముందడుగు వేసినప్పుడే అణ్వాయుధ రహిత ప్రపంచం అనే లక్ష్యం వాస్తవ రూపం దాల్చుతుంది.

**- డి జె మోహన రావు**
8247045230

# నాకేంగాదులే అనుకుంటే 'పీకే'టోళ్లుంటరు...



గానడ్మ అయితారం అంబటాల్లకు నెత్తెంటికలు సిక ముడిసే తట్టుగ పెరిసగియని, మా ముసల్ది ఊకె గునుసుతంటె బాల్ కొట్టిద్దామని మంగలైనతాన్కి బోయిన. ఆడ సుత మంది జిబజిబనేతట్టు గున్నరు. ఆడ బొచ్చెడు మంది నా అసొంటోల్లు కూసొని బాతకాని కొడ్తాండ్లు. అండ్ల నా సాయితగాల్లు సుతం ఉన్నలు. అన్ని తరీకల ముచ్చట్లు నడుత్తన్నయ్. గండ్ల ఒకాయిన ఆనా కాలంల యెండలుగొట్టుడు,సలికాలంల సెము టలు వెట్టుడసొంటి ఇచ్చంత్రాల ముచ్చట్లన్నీ మునుం బెట్టిండు. ఇంకొకాయిన జెప్పే పరాసి కాల ముచ్చట్లకు అందరు పలగవడి నవ్వు తాండ్లు. మల్లొకాయిన బలమంతుడ నాకేమిటి... సలిసీమల సేతసిక్కి సావదె సుమతీ అని పొల గాండ్లు జడ్సుకునేతట్లుగా రాగమెత్తుకున్నడు. యే జరసైసు. ఒవ్వలన్న ఇంటండ్లా!లేరా!! అన్జా సుడు లేదా! !నువ్వే మన్న గద్దరన్నవా? లేపోతే గోరేటెంకన్నవా? కీసుపిట్టలెక్క ఒక్కటే ఒర్రుడని గప్పుడే ఆడికచ్చిన లచ్మన్ సురుకంటించిండు.




సరెగని లచ్మన్ సారు గీనపాడిన పద్దెంల ఉన్న ముచ్చట అసలు సంగతేందో జర సమఝె తట్టు సెప్పలేవో..అని గాయిన సాయితగాడు అడి గిండు. యే గదాంట్ల సెప్పనీకేమున్నదే! యెసొంటి మనిసైనా,యెంత సిరిమంతులైనా, రాజిర్కమైన యెల్లకాలం ఆల్లయే నడ్వయ్ గదా! పతి దాన్కో లెక్కుంటది. గదాంతోని వోవాలే. నేను తోపును, నన్నెవ్వలేంజేయలేరనుకుంటే. యెప్పుడోసారి బొక్క బోర్ల వడ్తరని లచ్మన్ అన్నడు.

గిట్ల నే గీ నడ్మ డిల్లీ జంతర్ మంతర్ తాన దినాలకానంగ జర్గిన లొల్లి యెరుకున్న దేనా యే. 'సావుదప్పి కన్నులొట్టవాయెనన్నట్టు' అండ్ల కెల్లి మన్దేస సర్కారు బయట పడిందో! లేదో!!యెంటనే మూడు జాగలల్ల అసెంబ్లీ ఎలచ్చన్లు జర్గినయ్. గండ్ల యెవలు గెలిసిండ్లో సూత్తె కండ్లు వెయ్‌తిర్గుతయ్. గా మూడిట్లల్ల ఒక దాంట్ల గదే గా 'బంకీపూర్' నుంచి ఎలచ్చన్ల అందరి పంచాంగం జెప్పే ప్రశాంత్ కిషోర్ (పీ.కే)గెలి సిండు. యెంటనే ఆ... గదేంది యెవలో ఒకరు గెలుత్తరు. గండ్ల ఇచ్చంత్రమే ముంది? అన్న.. పురాగ ఇనవా? కాల్లల్ల కట్టెవెట్టినట్టు అడ్డం బడ్తవ్. గా బంకీపూరనేది పువ్వు గుర్తుకు పెట్టని కోట. గా పువ్వు గుర్తు మీనగా పువ్వు గుర్తు ఇప్పటి పాల్టి పెబ్బే గాయిన అయ్య కల్సి ఎనిమిది మాట్ల గెలిసిరు. గాయిన పాల్టి పెబ్బె కాంగనే యే గ సీటు మన్దేనాయే గాడ మనం కుక్కను నిలవెట్టిన గెలుత్తది, గా దంట్లో తండ్లాడేదేంలేదనే గమండీతోని ఉన్నరు. గ పీకె ఇంక బొద్దింకలు కలగల్సి మొగులు మీన ఉన్న పువ్వోల్లను,బూమ్మీనకు దించిరు.

గందుకనే నాకంటే తోపు యెవ్వల్లేరనుకుంటే గిట్లనే బోర్ల బొక్కలవడుతరు.అని లచ్మన్ అనగానే దునియా మొత్తం మీన యెక్వ మంది ఉన్న పాల్టి గదా! గట్లెట్లైంది? అని నేనడిగిన. ఇగ ఇను కర్నుని సావుకు యెన్ని కార్నాలున్నయో గీ దీన్కి సుత గన్నున్నయ్. వాల్లకు ఉన్న గమండీ తోని పోటీ చేసేటోల్లను ఊకె ఊకె మార్చిను గట్లనే ఎట్లైనా మనం గెల్తన్నం గదా అనుకోని లైట్తీసుకున్నరు. ఇగ మునుపటి తరీకనే పచారం, ఇంక అయ్యవోతే కొడుకు, కొడుకువోతే మల్ల ఆల్ల ఇంట్లోల్ల రాజిర్కానికి జనం ఇట్టపడలే. బిహారుల లంచ గొండోల్లు సానా పెరిగిండ్లంట, గట్లనే పాత ముక్కెమంతిరి సుత పసారం సెయ్యలేదంట. ఇంక సదుకున్న పొలగాండ్లకు నౌకర్లు సుత దొర్కుత లేవాయే. గియ్యన్నోలెక్కగా నౌకర్లేని పొలగాండ్లు బొద్దిం కలై సెంటరోల్లను గద్దె దించాలని సూడవట్టి. గాల్లకు మోకా దొరి కింది ఊకుంటరా? ఇంకా పట్నం పాల్టీగా పిల్సుకునే బాజాపాకు గా పట్నవోల్లు, ఆల్లు నమ్ముకున్న కులాల వోల్లు గట్టి టోకరా యిచ్చిండ్లు.

గియ్యన్నిటికి సాయితగా పికే పసారం అన్ని పాల్టీలకన్న రొండు నెల్ల ముందుగా సురుజేసిండు, గల్లీ గల్లీ దిరిగిండు, మొహల్లదర్బార్లు వెట్టిండు. అక్కడున్న జనాల యిబ్బందు లేంటియో సెప్పిండు. కొత్తకొత్త పసార తరీకలు బెహత్తరీన్‌గా జేసిండు. రాముని గుడి కోసం అచ్చిన పైసలు మెక్కిన సంగతి బాగా సెప్పిండు. పెత్రోలుకు సాయితగా సరుకులు పైసలు వెర్గుడు జనాలు సోచాయించేతట్ల జెప్పిండు. లోపాయికారిగ ఆర్‌జేడీ పాల్టీ లీడర్లు అస్సలు పసారం జెయ్యలేదు. ఇంక గీ పికెకు కల్సచ్చిన ముచ్చటేందంటే యే గీ ఒక్కసీటుతోని సర్కారుకేమన్నా ముప్పున్నదా? పాడా! అని సానా తక్వమంది ఓట్లేసిండ్లు. గట్లనే పాపంగ పికె మునుపు ఓడిపోయిండనేది సుత ఉండి ఉంటది. యేది యెట్లున్న జనాలు అవసరాలు పట్టిచ్చు కోకుండ, ఆల్లుసెప్పేది ఇనిపిచ్చుకోకుండ,మా ఓట్లు మాకున్నయ్. మా దేవుల్లు గెలిపిత్తలు అనుకుంటే గిట్లనే ఐతయ్. జనాల ఆసలు నిరాసలైనపుడు కొత్త కొత్త ఆలోసన్లతోని కొట్లాడుతలు. గాల్లను పోలీసులతోటి అనుగదొక్కుతమనుకుంటె ఇంకింత పైకి లేత్తరు. గట్లైతే ఆల్లందరు ఒక్కటైతే ఇగో గిట్లైతది. మన్లో ఉన్న మనుసులు కావచ్చు,మన్లో ఉన్న గమండీ కావచ్చు, మనం సెప్పేదాన్కి, సేసేదాన్కి ఉన్న తేడా కావచ్చు. నేనింతే నేను మారను అంటే మార్సేదానికి జనాలు తయారుగుంటరు. సర్కారు సక్కగ పన్జెయ్యకుంట ఇరాం లేకుంట ఇబ్బందులు వెడ్తండ్లని, పతిపచ్చాలు కుత్రలు జేత్తండ్లని ఇంకేండ్లు జెప్తలు. గిదంత'మన మొకం మంచిగ లేక అద్దాన్ని నాలకేసి కొట్టినట్లని'పిత్త లేదా! అని లచ్మన్ ఆపేసి ఇగవోతన్న అనుకుంటవోయిండు. నా సవురం జేసుడు యాదికచ్చి,యేర సవురం సేత్తవా?సెయ్యవురా? ఆకలైతందిరా...సెనార్థులు...

**- మీస రాజమల్లయ్య**
9491319904

# భావోద్వేగభరిత 'తస్లీమా నస్రీన్'



తాను నమ్మిన విశ్వాసాల కోసం, విలువల కోసం ఎన్నో వివాదాలు తలెత్తిననూ, ఎన్నో బెదిరింపులు వచ్చిననూ, దేశ బహిష్కరణలు, ఫత్వాలు మొదలైన వాటన్నింటిని ఎదుర్కొని ముందుకు సాగిన ధీశాలి తస్లీమా నస్రీన్. ఆమె వృత్తిరీత్యా పిజీషియన్. ప్రవృత్తి రీత్యా రచయిత్రి. తన రచనలతో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. తస్లీమా నస్రీన్ బంగ్లాదేశ్‌లోని మిమెన్‌సింగ్‌లో 1962 లో జన్మించి మత ఛాందసవాదాన్ని ప్రతిఘటిస్తూ మహిళా హక్కులు, భావస్వేచ్ఛ, సమానత్వం, సెక్యూలరిజం కోసం పిడికిలి బిగించి ఆ దిశగా ఉద్యమిస్తూనే ఉన్నారు.



తస్లీమా నస్రీన్ 1993లో రాసిన 'లజ్జ' అనే నవల అంతర్జాతీయ గుర్తింపు పొందింది. కాని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆ నవలని నిషేధించింది. 'మత గ్రంథాలు సమకాలీన సమాజానికి అప్రస్తుతంగా ఉన్నాయి' అని పేర్కొన్న కారణంగా తస్లీమా నస్రీన్ దేశ బహిష్కరణకు గురయ్యారు. దేశంలోని మత పెద్దల నుండి అనేక బెదిరింపులు ఆమె ఎదుర్కొన్నారు. ఫలితంగా ఆమె 1994 నుండి అనేక దేశాల్లో తలదాచుకున్నారు. ఆ క్రమంలోనే 2004 నుండి 2007 మధ్య తస్లీమా నస్రీన్ కోల్కతాలో నివసించారు. కోల్కతా తనకు గొప్ప మానవులను ఎందరినో అందించడమే కాకుండా ఆ నగరం నాకు 'రెండో ఇల్లు'గా నిలిచింది అని పేర్కొన్నారు. తస్లీమా నస్రీన్ ఆత్మకథ 'ద్విఖండితో' లోని కొన్ని భాగాలపై హింసాత్మక నిరసనలు చెలరేగడంతో ముస్లిం సమాజంలోని కొన్ని వర్గాల మనోభావాలను దెబ్బతీస్తోందనే ఆరోపణలతో 2003లో అప్పటి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం నిషేధించింది. ముఖ్యంగా 'మత ఛాందసవాదులు ప్రేరేపించే అశాంతికి ఆమె ఉనికి కారణం కావచ్చు' అనే కారణంతో ప్రభుత్వం తస్లీమా నస్రీన్‌ని కోల్కతా నగరం విడిచి వెళ్ళండి అని విజ్ఞప్తి చేసిన క్రమంలోనే క్రమక్రమంగా ఆమె యూరోప్ వెళ్లిపోయారు. తస్లీమా నస్రీన్ మహిళల హక్కుల కోసం పనిచేస్తూనే అన్ని రకాల మత ఛాందసవాదాన్ని, అలాగే పితృస్వామ్య సంప్రదాయాలు, సంస్కృతులు మరియు ఆచారాలపై సునిశిత విమర్శలు చేశారు. 'ఏ దేశమూ మతంతో ముడిపడి ఉన్న మూఢనమ్మకాల పద్ధతులను, మతాల ధార్మిక పద్ధతులను విమర్శించకుండా నాగరికతను సాధించలేదు. రాజ్యాన్ని, మతాన్ని వేరు చేయకుండా ఏ రాజ్యం గాని, సమాజంగాని ఆధునికంగా మారలేదు. మతాన్ని ప్రభుత్వం నుండి వేరుగా ఉంచాలి. అణచివేతకు గురైనవారు ఎవరైనా సరే, నేను ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడ్డాను. ముస్లింలు హింసకు గురైనప్పుడల్లా నేను వారిని సమర్థించాను, అలాగే బంగ్లాదేశ్‌లో అణచివేతకు గురైన హిందు వులను లేదా పాకిస్తాన్‌లో అణచివేతకు గురైన క్రైస్తవులను కూడా సమర్థించాను. నాకు మత గుర్తింపు అప్రస్తుతం' అని పేర్కొన్న తస్లీమా నస్రీన్ వ్యాఖ్యలు సమతా భావన లకు అద్దం పడుతాయి.

తస్లీమా నస్రీన్ దాదాపు రెండు దశాబ్దాల తర్వాత గత శుక్రవారం నాడు తిరిగి కోల్కతాకు చేరుకోవడం విశిష్ట ప్రాముఖ్యతను సంతరించు కుంది. 'తనను లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం కోల్కతా నుండి బయటకు పంపించిననూ మళ్ళీ తిరిగి వస్తాననే ఆశను తాను ఎన్నడూ వదులుకోలేదు' అని ఆమె భావోద్వేగానికి గురికావడం గమనార్హం. ఈ క్రమంలో ఆమె రాకని 'భావోద్వేగభరితమైన పునరాగమనానికి ప్రతీక'గా పేర్కొనవచ్చు. 'నేను నా సొంత దేశానికి తిరిగి వస్తున్నట్లుగా భావిస్తున్నాను. బెంగాల్ నా హృదయంలో ఎన్నడూ ఒక సరిహద్దుతోగానీ, ముళ్లకంచెతో గానీ విభజించబడలేదు. నేను ఇక్కడ వదిలిపెట్టిన జీవితంలోని ఒక భాగానికి తిరిగి వచ్చినట్లుగా అనిపించింది. అన్యాయం దీర్ఘకాలం ఉండవచ్చు కాని శాశ్వతం కాదు. భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కును వినియోగించుకున్నందుకు ఏ రచయిత కూడా తమ మాతృభూమిని విడిచి పెట్టకుండా ఉండే విధంగా భవిష్యత్తును ఆశిస్తున్నాను'అని తస్లీమా నస్రీన్ పేర్కొనడం తద్వారా భావ స్వేచ్ఛకు బలమైన గొంతుకగా నిలిచారు.ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు భావస్వేచ్ఛ పరిరక్షణ కోసం ఆచరణాత్మకంగా ఉద్యమిస్తూ సాటి రచయితలకు అండగా నిలవాల్సిన అవసరం తప్పకుండా ఉంది.

**- జె.జె.సి.పి. బాబూరావు**
94933 19690

# 'వైట్ ఫుడ్స్'ని దూరం పెడితే ఆరోగ్యం భేష్



మనలో చాలామంది రోజూ తినే కొన్ని వైట్‌ఫుడ్స్ ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తాయి. పేలవమైన జీవన శైలి, అనారోగ్యకరమైన ఆహారం తింటూ ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. విలాసవంతమైన జీవితానికి అలవాటుపడినా ఆహారం విషయంలో మాత్రం రాజీ పడకుడదంటున్నారు. అటువంటి పరిస్థితిలో, మీరు ఏదైనా తినడానికి ముందు ఆరోగ్యంపై దాని ప్రభావాల గురించి ఆలోచించకపోతే మీరు ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందంటున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకుంటే ఈ తెల్లని ఆహార పదార్థాలను దూరంగా ఉంచాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇవి రుచికరంగా ఉండవచ్చు. కానీ ఆరోగ్యానికి విషం కంటే తక్కువ కాదంటున్నారు. ఈ 5 వైట్‌ఫుడ్స్‌ను దూరం చేస్తే సగానిపైగా సమస్యలు దూరమవుతాయని ఆరోగ్యం కూడా మీ చేతుల్లోనే ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మైదా, తెల్ల చక్కెర, తెల్ల ఉప్పు, తెల్ల బియ్యంతో చేసిన ఉత్పత్తులకు దూరంగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది మరియు బరువు నియంత్రణలో ఉంటుంది. ఇవి కాకుండా గుండె జబ్బులు, బీపీ వంటి దీర్ఘకాలిక సమస్యల ముప్పు కూడా తగ్గుతుంది. ఈ ఐదు వైట్‌ఫుడ్స్ మానేయడం లేదా తగ్గించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. నేటి హడావుడి జీవితంలో అనేక మంది మార్కెట్లో దొరికే ఫాస్ట్‌ఫుడ్స్ తిని సరిపెట్టుకుంటున్నారు.

మైదా: దీనిలోని పోషకాలు, పీచు పదార్థాలు పూర్తిగా తొలగిపోతాయి. ఇది తిన్న వెంటనే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీనికి బదులుగా రాగులు, జొన్నలు, సజ్జలు, లేదా గోధుమ పిండి వంటివి వాడటం మంచిది. మైదాతో చేసే వైట్ బ్రెడ్‌లోపీచు పదార్థం, పోషకాలు తక్కువగా ఉంటాయి. ఇది తింటే రక్తంలో చక్కెర స్థాయిలు తీవ్ర ఎగుడు దిగుడులకు లోనవుతాయి. ఫలితంగా ఇవి తిన్న కాసేపటికే మళ్లీ ఆకలి మొదలువుతుంది. దీంతో, అతిగా తిని క్రమంగా బరువుపెరుగుతారు. చివరకు టైప్ - 2 డయాబెటిస్ బారిన పడతారు.

తెల్ల చక్కెర: ఇది కేవలం క్యాలరీలు మాత్రమే ఇచ్చే ఈ ఆహారం అని గుర్తుంచుకోవాలి. తెల్ల చక్కెర శరీరంలో ఇన్సులిన్ స్థాయిలను అస్తవ్యస్తం చేస్తుంది. దీనివల్ల ఊబకాయం, మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. దీనికి బదులుగా బెల్లం, తాటి బెల్లం, లేదా పచ్చి తేనె వంటి సహజ స్వీటెనర్లను ఉపయోగించవచ్చు. డయాబెటిస్‌తోపాటు గుండె సంబంధిత సమస్యలు కూడా వస్తాయి.

తెల్ల ఉప్పు : అధికంగా శుద్ధి చేసిన ఉప్పు వాడటం వల్ల శరీరంలో నీరు చేరి ఉబ్బరం , రక్తపోటు, మరియు కిడ్నీ సమస్యలు దాడి చేస్తాయి. ఉప్పునకు బదులు సైంధవ లవణం లేదా సముద్రపు ఉప్పును మితంగా వాడాలి.

తెల్ల బియ్యం: పాలిష్ చేసిన తెల్ల బియ్యంలో ఫైబర్ లోపించడం వల్ల ఇది తిన్న వెంటనే బ్లడ్ షుగర్ లెవల్స్ పెరుగుతాయి. దీనికి బదులుగా దంపుడు బియ్యం లేదా బ్రౌన్/బ్లాక్ క్వినోవా వంటివి తినడం ఉత్తమం. జొన్న పిండి, రాగి పిండి, సజ్జ పిండి, లేదా ఓట్స్ పిండిని వాడవచ్చు. ఈ తరహా బియ్యంలో పీచు పదార్థం తక్కువగా ఉండటంతో గ్లైసిమిక్ ఇండెక్స్ పెరుగుతుంది.

పాల ఉత్పత్తులు: కొందరు వ్యక్తులకు పాలలో ఉండే లాక్టోస్ పడక గ్యాస్, ఎసిడిటీ లేదా జీర్ణ సమస్యలు వస్తాయి. ఫుల్ క్రీమ్ పాలతో చేసిన డెయిరీ ఉత్పత్తులు కూడా అనారోగ్య కారకాలు.

బంగాళదుంప చిప్స్‌తో కూడా ఆరోగ్య సమస్యలు తప్పవు. వీటిని నూనెలో వేయిస్తారు కాబట్టి ఇవి అనారోగ్య కారకమని న్యూట్రిషనిస్టులు హెచ్చరిస్తున్నారు. ఇవి దీర్ఘకాలిక అనారోగ్యాలకు దారి తీస్తాయి.

ఆ ఐదు వైట్‌ఫుడ్స్ స్థానంలో మీరు తీసుకోగల ఉత్తమమైన, ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తే.. అనేక ప్రత్యామ్నాయాలు మనకు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు తెల్ల రవ్వ ఎక్కువ ప్రాసెసింగ్ ద్వారా తయారు చేస్తారు, దీని ద్వారా పీచు, పోషకాలు చాలా వరకు పోతాయి. ఇది జీర్ణక్రియలో అసౌకర్యం కలిగించడంతో పాటు, రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతుంది. దీనికి బదులుగా గోధుమ రవ్వ వంటివి వాడటం ఆరోగ్యానికి మంచిది. వివిధ రకాల పండ్లు, కూరగాయలు తినడం వల్ల అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ లభిస్తాయి. ఓట్స్, రాగి వంటి సమగ్ర ధాన్యాలు ఫైబర్, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. మార్కెట్లో లభించే అనేక రిఫైన్డ్ నూనెలు అధిక ప్రాసెసింగ్ ద్వారా తయారవుతాయి. వీటిలో ఉపయోగించే రసాయనాలు శరీరంలో ఇన్ఫ్లమేషన్‌ను పెంచే అవకాశం ఉంటుంది. అందు వల్ల కోల్డ్-ప్రెస్డ్ ఆయిల్స్, నెయ్యి, కొబ్బరి నూనె, ఆలివ్ ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన కొవ్వులను వాడాలి. వంటింట్లో ఉండే ఈ 5 రకాల వైట్ ఫుడ్స్‌ను ఎంత తక్కువగా తీసుకుంటే అంత మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఆహారం ఎంత తెల్లగా ఉంటే, అందులోని పోషకాలు అంతగా తొలగించబడే అవకాశం ఉంటుంది.



వంటగదిలో చిన్న మార్పులు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలికి బాటలు వేసుకోవచ్చు. సరైన ఆహార ఎంపికలు శరీరానికి శక్తినివ్వడమే కాకుండా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నుంచి మనల్ని బయటపడేస్తాయి. ఒకసారి ఆరోగ్యం చేజారితే తిరిగి పొందడం అంత ఆషామాషీ వ్యవహారం కాదు. కాబట్టి, ఆరోగ్యం విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.

**- జి. సత్యనారాయణ రాజు**
9030880709

## ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యం

జగిత్యాల రూరల్, ఆగస్టు 06( మనం న్యూస్ ): జగిత్యాల జిల్లాలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యం కలకలం రేపింది.. కండ్ల పల్లి మోడల్ స్కూల్ లో ఏడవ తరగతి చదువుతున్న బాలిక బుధవారం మధ్యాహ్నం సడన్ గా అదృశ్యమైంది.బాలిక తల్లిదండ్రులు జగిత్యాల గ్రామీణ పోలీసులను ఆశ్రయించగా పోలీసు విచారణలో తేలింది ఏమనగా సదరు బాలిక గత కొన్ని రోజుల నుండి ఇన్స్టాగ్రామ్ వేదికగా ఒక అబ్బాయితో చాట్ చేసినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అయితే ఆ అబ్బాయి తోనే ఈ అమ్మాయి లెటర్ రాసి పుస్తకంలో పెట్టి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది.

# విద్యుత్ వాహన సాంకేతికతపై రెండు రోజుల శిక్షణా శిబిరం ప్రారంభం



జగిత్యాల, ఆగస్టు 06 ( మనం న్యూస్ ): జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్, జగిత్యాల (స్వయంప్రతిపత్తి)లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో మ్యాత్వర్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఆర్కాన్స్ ఇన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల సహకారంతో మ్యాట్ల్యాబ్ మరియు సిమ్యులింక్ ఆధారిత విద్యుత్ వాహన సాంకేతికత అంశంపై రెండు రోజుల శిక్షణా శిబిరం తొలి రోజు గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమం మూడో మరియు నాలుగో సంవత్సరం బి.టెక్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా దీపప్రజ్వలనతో ప్రారంభమైంది. అనంతరం విద్యార్థులు అతిథులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి స్వాగత గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, ఈఈఈ విభాగాధిపతి శ్రీ సి. రాధాచరణ్ మ్యాత్వర్క్స్-ఆర్కాన్స్ ఇన్ సంస్థకు చెందినఅప్లికేషన్ ఇంజినీర్ పొన్నగంటి చందనముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరసింహ మాట్లాడుతూ, విద్యుత్ వాహనాల సాంకేతికత భవిష్యత్తులో అత్యంత ప్రాధాన్యమైన రంగంగా అభివృద్ధి చెందుతోందని, విద్యార్థులు ఇటువంటి పరిశ్రమ-విద్యాసంస్థల సంయుక్త శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, పరిశ్రమల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించి ఉపాధి అవకాశాలను మరింత విస్తృతం చేస్తాయని పేర్కొన్నారు ఈఈఈ విభాగాధిపతి శ్రీ సి. రాధాచరణ్ మాట్లాడుతూ, రెండు రోజుల శిక్షణా శిబిరంలో విద్యుత్ వాహనాల నమూనా రూపకల్పన, నియంత్రణ వ్యవస్థలు, బ్యాటరీ నమూనా రూపకల్పన, బ్యాటరీ నిర్వహణ వ్యవస్థ (ఆఖీ), బ్రష్లెస్ డీసీ (ఆబ్బెఇ) మరియు శాశ్వత అయస్కాంత సమకాలిక మోటార్ల (కఖిఇ) నియంత్రణ వంటి ఆధునిక అంశాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.తొలి రోజు నిర్వహించిన సాంకేతిక సమావేశంలో వనరుల నిపుణురాలు పొన్నగంటి చందన విద్యార్థులకు విద్యుత్ వాహనాల పరిచయం, నమూనా ఆధారిత రూపకల్పన, సిమ్యులింక్ బ్లాక్ డయాగ్రామ్ల ద్వారా వ్యవస్థల నమూనా రూపకల్పన, నియంత్రణ వ్యవస్థల రూపకల్పన, పవర్ ఎలక్ట్రానిక్స్ అనుకరణలు, అలాగే ఙఅఖీఔఆఆ మరియు ఖిజీఝఙజూజీఱజ వినియోగంపై సిద్ధాంతంతో పాటు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా శిక్షణ అందించారు.శిక్షణా శిబిరం రెండవ రోజువిద్యుత్ మోటార్ల అనుకరణ మరియు నియంత్రణ, బ్యాటరీ నమూనా రూపకల్పన, బ్యాటరీ నిర్వహణ వ్యవస్థ, సంపూర్ణ విద్యుత్ వాహన నమూనా రూపకల్పన తదితర అంశాలపై ప్రాయోగిక శిక్షణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఈఈఈ విభాగ సమన్వయకర్తలు డాక్టర్ ఎస్. జగదీశ్ కుమార్, డాక్టర్ పి. సంగీత సమన్వయం వహించారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగ అధ్యాపకులు, ఇతర విభాగాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, అలాగే మూడో మరియు నాలుగో సంవత్సరం బి.టెక్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులకు కృతజ్ఞతలు తెలుపగా, ₹₹జాతీయ గీతం 'జనగణమన'₹₹ ఆలాపనతో తొలి రోజు శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## అనాథ వృధాశ్రమంలో అన్నదానం



జగిత్యాల ఆగష్టు 06 ( మనం ప్రతినిధి ): టిఎన్జీఓ జగిత్యాల జిల్లా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మరియు టిఎన్జిఓ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ జన్మదిన సందర్భంగా జగిత్యాల టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఊకంటి అమరేందర్ రెడ్డి అధ్వర్యంలో ఉద్యోగులు కేక్ కట్ చేసి, స్వీట్లు తినిపించుకొని మారం జగదీశ్వర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో విలసిల్లాలని, ఉద్యోగుల సమస్యలపై పోరాటంలో వారికి ఎల్లవేళలా విజయం కలగాలని అకాంక్షిస్తూ వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం టిఆర్ నగర్ లోని శ్రీ గాయత్రి అనాథ వృద్దాశ్రమంలో వృద్దులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమములో ట్రెసా జిల్లా అధ్యక్షులు ఎండి.వకీల్, ఎన్టిపిఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, టిఎన్జీఓ జిల్లా నాయకులు సాహెద్ బాబు, రవి చంద్ర, రవీందర్, రాజేశం, సుగుణాకర్, హకీమ్, మహేందర్, మధుకర్, మల్లయ్య, హరి ప్రసాద్, రాజశేఖర్, సునీత్ కుమార్, శ్రీనివాస్, గౌసుద్దీన్, మల్లేశం, శైలజ, శ్రావణి, నాల్గవ తరగతి ఉద్యోగుల అధ్యక్షురాలు అరుణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



జగిత్యాల ఆగష్టు 06( మనం ప్రతినిధి ): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రవేశ గోడ-కరపత్ర ఆవిష్కరణ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్. జిల్లా విద్యాధికారి రాములు. మరియు తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ రామడుగు రవీందర్ చేతుల మీదుగా గోడ-కర పత్రికలను ఆవిష్కరించడం జరిగినది. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పాఠశాల స్థాయిలోనే చదువుకి దూరమై. చదవాలనే కుతూహలం ఉన్న యువతీ యువకులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తీర్ణత పొంది ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లా అధికారి రాములు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లోనీ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు వారి వారి గ్రామాల్లో చదువుకు దూరమైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ కల్పించే గొప్ప అవకాశాన్ని ఉపయోగించుకునే విధంగా ప్రోత్సహించగలరను తెలియజేశారు. మరియు ఈ కార్యక్రమంలో టాస్ ఉమ్మడి కర్మ జిల్లా కోఆర్డినేటర్ రామడుగు రవీందర్ మాట్లాడుతూ అక్షరస్యతలో వెనుకబడిన మన తెలంగాణ రాష్ట్రాన్ని నూటికి.నూరు శాతం అక్షరాస్యతను పెంపొందే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా గ్రామాల్లోని యువకులు కనీసం ఇంటర్ వరకు చదువుకునే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా టాస్ లో చేర్పిస్తూ కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. డాక్టర్ నక్కరాజు. సిరిపురం రాజేందర్. గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ పనులను పరిశీలించిన కలెక్టర్

- మానాల గ్రామంలో వివో భవనం పరిశీలన

జగిత్యాల/ మల్యాల,ఆగస్టు 6:(మనం ప్రతినిధి): జగిత్యాల జిల్లా పరిధిలోని పెగడపల్లి, మల్యాల, కొడిమ్యాల మండలాలకు సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం మల్యాల మండల కేంద్రంలో పరిశీలించారు. ఈ సందర్భంగా యూనిట్ నిర్మాణ పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యూనిట్ ఏర్పాటుకు అవసరమైన యంత్రాల కొనుగోలు, నిర్వహణ విధానాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మార్గదర్శకాల మేరకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లో బేలింగ్ మెషిన్ , ష్రెడర్ మెషిన్ , లిఫ్టింగ్ కార్ట్ , వెయింగ్ మెషిన్ తదితర ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు



కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మూడు మండలాలకు ఉమ్మడిగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ను ఏర్పాటు చేయడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు అవకాశం కలుగుతుందని అన్నారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ పారిశుద్ధ్య మెరుగుదలతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) లక్ష్యాల సాధనకు మరింత తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, రీసైక్లింగ్, రీసైక్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించి పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఈ యూనిట్ కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం మల్యాల మండలం మానాల గ్రామంలో నిర్మాణం లో ఉన్న వివో భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం పనులు దాదాపు పూర్తికాగా పూర్తి స్థాయిలో పనులు చేసి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. తద్వారా మహిళల సంఘాల సభ్యులకు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ పిఆర్ లక్ష్మణ్ రావు, ఎంపిడివో స్వాతి, తహసీల్దార్ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ లు, మహిళా సంఘం సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్టీయు టెట్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, డీఈవో



జగిత్యాల ఆగష్టు 06( మనం ప్రతినిధి ): స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) స్టడీ మెటీరియల్ న జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, డీఈవో వేర్వేరుగా గురువారం తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. 2028 ఆగస్టు 31 లోపు ఉపాధ్యాయులందరూ టెట్ పాస్ అవడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చిన నేపథ్యంలో (ఎస్టీయు) ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిష్ణాతులైన ఉపాధ్యాయ విషయ నిపుణులతో మెటీరియల్ రూపొందించడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి (డి ఈ ఓ) కే.రాము గారు అన్నారు. జిల్లాలో ఇంకా 522 మంది ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత కావలసి ఉందని, ఈ మెటీరియల్ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.. ఉపాధ్యాయులందరూ ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ , డీఈవో ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, పాలెపు శివరామకృష్ణ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీర్ణంచ రవీందర్, జిల్లా కోఆర్డినేటర్ చిప్ప సత్యనారాణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ మచ్చ రాజశేఖర్, వంశీ, కోరుట్ల మండల ప్రధాన కార్యదర్శి అన్నం మహేష్ ఉన్నారు.

## అభివృద్ధి నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలి



- నాణ్యతతో కూడిన పనులకే ప్రాధాన్యం ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల, ఆగష్టు 6 ( మనం ప్రతినిధి ): జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, కిచెన్ షెడ్స్, పాఠశాల మరుగుదొడ్లు, పాఠశాల భవనాలతో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (ృఖీ) ద్వారా కలెక్టర్కు వివరించారు. సమీక్ష సందర్భంగా ప్రతి శాఖ పరిధిలో చేపట్టిన నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, పూర్తయిన పనులు, పెండింగ్లో ఉన్న పనుల వివరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ, అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి

- జయంతి వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, ఆగస్టు 6:(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా, ఆత్మగౌరవ పోరాటానికి మార్గదర్శిగా, ప్రజా చైతన్యానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన ప్రొఫెసర్ డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి భావజాల పునాది వేసిన మహనీయుడని అన్నారు. తెలంగాణ ప్రజలకు జరిగిన ప్రాంతీయ అసమానతలను శాస్త్రీయ ఆధారాలు, గణాంకాలతో దేశానికి వివరించి ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను చాటిచెప్పిన గొప్ప మేధావి అని కొనియాడారు. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ఉద్యమకారుడిగా, పరిపాలనా నిపుణుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా సేవలందిస్తూ విద్యారంగంలోనూ విశిష్ట కృషి చేశారని తెలిపారు.

ప్రొఫెసర్ జయశంకర్ కలలుగన్న తెలంగాణ అంటే కేవలం ప్రత్యేక రాష్ట్రం మాత్రమే కాదని, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, నాణ్యమైన విద్య, యువతకు ఉపాధి, మహిళల సాధికారతతో కూడిన సమగ్ర అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ఆయన ఆశయమని పేర్కొన్నారు. నిరాడంబర జీవనం, నిస్వార్థ సేవ, ప్రజల పట్ల అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, , జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## బిడ్డ పుట్టిన అరగంటలోపే తల్లిపాలు అందించాలి

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 06 (మనం బ్యూరో): తల్లిపాలు శిశువుకు ప్రకృతి దేవుడు ప్రసాదించిన అమూల్యమైన వరమని, నవజాత శిశువు పుట్టిన అరగంటలోపే తల్లిపాలు అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితానికి బలమైన పునాది వేయవచ్చని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. శిశువు తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తి కూడా లభిస్తుందని తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మంద పుల్లారెడ్డి (ఎంపీఆర్) ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీలో శాసనమండలి సభ్యులు కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



పాల్గొన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి నాగర్కర్నూల్ కేసరి సముద్రం మినీ ట్యాంక్బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో వైద్య కళాశాల విద్యార్థులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తల్లిపాలే బిడ్డకు తొలి రక్షణ, డబ్బా పాలు వద్దు తల్లి పాలు ముద్దు, తల్లిపాలు బిడ్డకు జీవనాధారం వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం పెంచేల పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ర్యాలీ అనంతరం కేసరి సముద్రం ట్యాంక్ బండ్ పై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ...., తల్లిపాలు ఇవ్వడం అనేది ప్రకృతిలో అత్యంత పవిత్రమైన ప్రక్రియన్నారు. బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో తల్లులు తమ చిన్నారులకు పాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు సమాజం దానిని, చెడు ఆలోచనలతో కాకుండా గౌరవప్రదంగా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. అలాంటి సందర్భాలను అపార్థం చేసుకోకుండా, తల్లి, బిడ్డల ఆరోగ్యం, వారి అనుబంధానికి సంబంధించిన పవిత్రమైన ప్రక్రియగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ సూచించారు. శిశువు పుట్టిన వెంటనే తొలి అరగంటలో తల్లిపాలు అందించడం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జననం తర్వాత మొదటి మూడు రోజులలో వచ్చే ముర్రు పాలు (కొలస్ట్రం) శిశువుకు ప్రకృతి ప్రసాదించిన తొలి టీకా వంటివని తెలిపారు. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయకుండా బిడ్డకు తప్పనిసరిగా ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

## ఉపాధ్యాయుడిపై కక్షపూరిత షోకాజ్ నోటీసు

- తల్లిదండ్రుల ఆగ్రహం ఆందోళనకు సిద్ధం

నలగొండ -ఆగష్టు 6( మనం ప్రతినిధి )ః ఘట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట ఎంపీపీ ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు శేఖర్ పై మండల విద్యాధికారి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని అంతంపేట పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు ఎంఈఓ ఉపాధ్యాయుడు శేఖర్కు షోకాజ్ నోటీసు జారీ చేసి 7 రోజుల్లో వివరణ కోరారు. దీనిపై స్పందించిన అంతంపేట గ్రామస్తులు, తల్లిదండ్రులు గురువారం సమావేశమై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ



సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ శేఖర్ సార్ ను కావాలనే ఎంఈఓ విద్యార్థులు లేని శేరి గూడెం పాఠశాలకు బదిలీ చేశారని ఆరోపించారు 'అంతంపేట పాఠశాలలో విద్యార్థులసంఖ్య 100, మంది ఉన్నారన్నారు శేఖర్ సార్ గత కొన్నేళ్లుగా పాఠశాల కోసం కష్టపడుతున్నారు' అని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఎంఈఓ కక్షతో వ్యవహరించి ఉపాధ్యాయుడిని వేధిస్తున్నారని, పేపర్లో ఫోటో వచ్చిందనే కారణంతో నోటీసు ఇవ్వడం సరికాదని వారు మండిపడ్డారు. ఉపాధ్యాయుడు శేఖర్ను అంతంపేట పాఠశాలలోనే కొనసాగించాలని, షోకాజ్ నోటీసును రద్దు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరారు. తమ డిమాండ్ నెరవేరని పక్షంలో మండల కేంద్రంలో ధర్నా చేసి, ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తల్లిదండ్రులు హెచ్చరించారు.

ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎం నరేందర్ ,వి అశోక్ ,ఎం ఆనంద్, ఏ నరసింహ ,వీ రాధా ,ఎం యాదయ్య ,బిక్షపతి ,బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు ఈ ఘటనతో మండలంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య తీవ్ర చర్చ జరుగుతోంది.

## రౌడీ, హిస్టరీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 06 (మనం ప్రతినిధి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి విఘాతం కలగకుండా రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లలో ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో రౌడీ, హిస్టరీ, సస్పెక్ట్ షీట్ల నిర్వహణ, తరుచూ నేరాలకు పాల్పడే వ్యక్తులపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లలో ఉన్న వ్యక్తుల ప్రవర్తన, కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు.



శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశమున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పాత నేరస్థులు తిరిగి నేరాలకు పాల్పడకుండా వారిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని అన్నారు. రౌడీ,హిస్టరీ అనుమానాస్పద, అల్లర్ల లో ప్రమేయం ఉన్నవారిని ప్రతి నెల పోలీస్ స్టేషన్ కు పిలిపించి వివరాలు తీసుకోవాలని అన్నారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్, సీఐలు కరుణాకర్, సుధాకర్, రామ్ నరసింహారెడ్డి, రాజ్కుమార్, సురేష్బాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## తల్లిపాలు చంటి పిల్లలకు చాలా శ్రేష్టం

- ఐసీడీఎస్ సూపర్వైజర్ శైలజ

బిర్పూర్ , ఆగస్టు 06( మనం న్యూస్ ): తల్లిపాలు చంటి పిల్లలకు చాలా శ్రేష్టమని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ శైలజ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను పురస్కరించుకొని గురువారం బీర్పూర్ మండలంలోని కొలువై కండ్లపెల్లి గ్రామాలలో తల్లిపాల అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, 5 నెలల గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమంలు సూపర్ వైజర్ శైలజ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ శైలజ మాట్లాడుతూ ముర్రుపాల ప్రాముఖ్యతను వివరిస్తూ, పుట్టిన గంటలోపు ఇచ్చే మొదటి పాలు బిడ్డకు మొదటి టీకాలా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు. 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, దీనివల్ల తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుందని సూచించారు. 6 నెలల తరువాత పిల్లలకు అంగన్వాడీలో ఇచ్చే బాలామృతం తప్పనిసరిగా తినిపించాలని, అందులో ఐరన్, విటమిన్లు, మినరల్స్ ఉంటాయని అన్నారు. ఆకుకూరలు, అయోడిన్, పప్పుధాన్యాలు గర్భిణులు, బాలింతలకు సూచించారు. ఈ కార్యక్రమం లోసర్పంచ్ రంగు లక్ష్మణ్ వార్డ్ మెంబర్ నరేష్ పంచాయతీ కార్యదర్శి జోష్నా, ఎమ్మెల్ హెచ్ పి కే రాహుల్ శర్మ, ఏ ఎన్ ఎం మంగ, జయ,ఆశ రజిత, కృష్ణవేణి, రేణుక అంగన్వాడి టీచర్లు లక్ష్మి, లింగమ్మ, ప్రబలత, ప్రభుత్వ పాఠశాల టీచర్లు, ప్రసన్నకుమార్, శ్రీదేవి సర్పంచ్ తొగిటి సత్యవ్వ అంగన్వాడి టీచర్స్ పద్మ, శ్రీలత,కార్యదర్శి సురేష్, ఆశ సంధ్యారాణి ఉపాధ్యాయులు తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు



## ఏఐ ప్లస్ ప్రాజెక్ట్ ట్రస్ట్ ప్లస్‌కు రూ.100 కోట్ల కేటాయింపు




హైదరాబాద్, ఆగస్టు 6(మనంన్యూస్): ¬రతీయ స్మార్ట్‌ఫోన్ రంగంలో భద్రత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్ సంస్థ ప్రాజెక్ట్ ట్రస్ట్ ప్లస్ పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రకటించింది. దేశంలోనే అత్యంత సురక్షితమైన స్మార్ట్ఫోన్ ఎకోసిస్టమ్ను నిర్మించాలనే లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో ఏటా రూ.20 కోట్లు చొప్పున మొత్తం రూ.100 కోట్లను వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా ఎథికల్ హ్యాకర్లు, సైబర్ భద్రతా పరిశోధకులు, డెవలపర్లు సంస్థ ఎకోసిస్టమ్ను పరీక్షించి భద్రతా లోపాలను గుర్తించి, వాటి పరిష్కారంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించింది. సాంప్రదాయ బగ్ బౌంటీ కార్యక్రమాలకు మించి కమ్యూనిటీ సహకారంతో మరింత పటిష్టమైన భద్రతా వ్యవస్థను రూపొందించడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని తెలిపింది. ఈ సందర్భంగా ఏఐ ప్లస్ స్మార్ట్ఫోన్ సీఈఓ, నెక్ష్ట్‌క్వాంటమ్ షిఫ్ట్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మాధవ్ షెత్ మాట్లాడుతూ, భద్రత అనేది అంతిమ గమ్యం కాదని, నిరంతరం అభివృద్ధి చెందే ప్రక్రియ అని పేర్కొన్నారు. అత్యంత సురక్షితమైన ఉత్పత్తులు సమిష్టి సహకారంతోనే రూపుదిద్దుకుంటాయని, అందుకే భారత టెక్నాలజీ కమ్యూనిటీకి తమ వేదికను తెరిచామని తెలిపారు. ఈ కార్యక్రమం కంపెనీ అభివృద్ధి చేసిన నెక్స్ట్ క్వాంటమ్ ఓఎస్ లో పారదర్శకత, గోప్యత, వినియోగదారుల డేటా భద్రతకు మరింత బలం చేకూరుస్తుందని సంస్థ వెల్లడించింది. ప్రాజెక్ట్ ట్రస్ట్ ప్లస్లో పాల్గొనదలచిన వారు మాధవ్ షెత్ ఇన్స్టాగ్రామ్ బయోలో ఉన్న లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది.

# ప్రభుత్వ వైద్యంపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

- సిద్దిపేట జిల్లా ఆస్పత్రిలో అత్యాధునిక యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయి
- సిద్దిపేట జిజిహెచ్ సూపరింటెండెంట్ పనితీరు పై మంత్రి పొన్నం మండిపాటు
- సిద్దిపేట ఆసుపత్రి వైద్యులు, సూపరింటెండెంట్ విధులకు సరిగా హాజరు కావడం లేదు, హరీష్ రావు




సిద్దిపేట, ఆగస్టు 6 (మనం ప్రతినిధి): ప్రజా వైద్యం కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు పెడుతుంటే స్థానిక వైద్యులు, అధికారులు సరిగా విధులు నిర్వర్తించకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదని రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా ఆస్పత్రిలో అత్యాధునిక యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నా వైద్యులు విధులు సక్రమంగా నిర్వహించక పోవడంతో పేదలకు వైద్య సేవలు అందడం లేదని హరీష్ రావు పేర్కొనడం పట్ల స్పందించిన మంత్రి పొన్నం సూపరింటెండెంట్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు, జిల్లా కలెక్టర్ హేమావతి, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణలతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో స్థానిక వైద్య బృందం సిబ్బంది విఫలమవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.సిద్దిపేట ప్రభుత్వ జెనరల్ ఆసుపత్రీలో అందుబాటులో ఉన్న నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు ఆశించినంతగా జిల్లా ప్రజలకు అందడం లేదని వైద్య సేవలు మరింత సమర్ధవంతంగా అందేలా అధికారులు, వైద్యులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను పరిశీలించి, వాటి భర్తీకి అవసరమైన ప్రతిపాదనలను తక్షణమే ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన అదనపు నిధుల కోసం ప్రభుత్వం, జిల్లా ఇంచార్జ్ మంత్రికి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందిస్తున్న ప్యాలియేటివ్ కేర్ సేవలపై ప్రజలకు ఆశా వర్కర్లు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పీజీ వైద్య విద్యార్థుల సహకారంతో ఆర్బీఎస్కే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కంటి, వినికిడి లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి సకాలంలో మెరుగైన చికిత్స అందించాలని, జిల్లాలోని 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య పరీక్షలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. అనవసరంగా సీ-సెక్షన్ ప్రసవాలు నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారం నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో ఉండేలా పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా అందుబాటులో లేని అత్యాధునిక వైద్య పరికరాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నాయని, ఈ విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు రిఫర్ చేసే రోగులను ప్రభుత్వ అంబులెన్స్ ద్వారానే తరలించాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన చిన్న చిన్న రిపేర్లు త్రాగునీరు సమస్య రాకుండా చూసుకోవాలని, ఎమర్జెన్సీ సర్వీసులలో సీనియర్ డాక్టర్లు అందుబాటులో ఉండి ఆసుపత్రికి వచ్చే రోజులు ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు తిరిగి వెళ్లకుండా సేవలందించాలని అన్నారు.

### వైద్య సేవలు ప్రజలకు సత్వరమే అందాలి.. హరీష్ రావు

జిల్లా ప్రజలకు సత్వరమే ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు అందించాలనేదే లక్ష్యమని ఆ దిశగా ఆస్పత్రి వైద్యులు పనిచేయాలని హరీష్ రావు అన్నారు. ఆసుపత్రికి అవసరమైన అనేక వైద్య పరికరాలను అందించడం జరిగిందని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మరియు వైద్యులు రెగ్యులర్ గా విధులకు హాజరు కావడం లేదని తన దృష్టికి వచ్చిందని, అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. పాలియేటికేర్ సేవలు, పీడియాట్రిక్ కేర్ సేవలు, కీమోథెరపీ, ఆస్పత్రి అంబులెన్స్, ఇన్ పేషంట్ రోగులకు అందించే ఆహారం, వైద్య పరీక్ష సేవలు, ఎన్ఆర్ఐ, సిటీ స్కాన్ తదితర అన్ని సేవలు సమర్థవంతంగా అందించాలని అన్నారు. డీ-అడిక్షన్ సెంటర్ ద్వారా ప్రత్యేక వైద్య సేవలు అందించడంతో పాటు ఆర్బీఎస్కే కార్యక్రమం ద్వారా కంటి, వినికిడి సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి వారికి సకాలంలో చికిత్స అందించాలని పేర్కొన్నారు. క్యాన్సర్ రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కీమోథెరపీ సేవలు అందుబాటులో ఉన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, జిల్లాలోని 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గర్భిణులకు అవసరమైన టిఫా స్కాన్లు ప్రభుత్వ వ్యవస్థలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అనవసర సీ-సెక్షన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే ఆహారం నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

### ప్రొ జయశంకర్ గద్దర్ లకు నివాళి

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మరియు శాసనసభ్యులు హరీష్ రావులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంగీత షా, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర వాహన దొంగ అరెస్టు



- రూ. 10 లక్షల విలువైన వాహనాల స్వాధీనం

సిద్దిపేట, ఆగస్టు 6 (మనం ప్రతినిధి): పలు వాహనాల దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగ పెండ్యాల సుదర్శన్ ను పోలీసులు పట్టుకున్నారు. గత నెల 3 న క్యాబ్ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుకునూరు పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితుడు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన పెండ్యాల సుదర్శన్ గత కొన్ని సంవత్సరాలుగా వాహనాల దొంగతనానికి పాల్పడుతున్నాడు. ఓలా క్యాబ్ డ్రైవర్ అంగోతు తుల్జా తన కారును దొంగిలించబడిందని కూనూర్ పల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశాడు. జులై 2న ఎల్బీనగర్ ఫ్లైఓవర్ వద్ద క్యాబ్ బుకింగ్ కోసం వేచి ఉన్న నిందితుడు కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వెళ్లాలని మాట్లాడుకున్నాడు. దర్శనం తర్వాత తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఆకలిగా ఉందని కుకునూరుపల్లి వైపు హోటల్ కోసం వెతుకుతూ డ్రైవర్ను నమ్మించి టీఎస్ 34 టీ బి 7506 కారుతో పరారయ్యాడు. ఈ మేరకు బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. నర్సింలు గజ్వేల్ లో రాజకీయ నాయకుల వద్ద డ్రైవర్ గా పనిచేసే రూ 50,000 దొంగలించాడు. గజ్వేల్, నార్సింగి, ఎస్ ఆర్ నగర్, చైతన్యపురి, ఖమ్మం టూ టౌన్, భద్రాచలం, మధుర నగర్, మలక్ పేట, నకిరేకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల దొంగతనాలకు పాల్పడి కేసు నమోదై పలుమార్లు జైలు శిక్ష అనుభవించాడు. దూర ప్రాంతాలకు ప్రయాణం అంటూ టాక్సీ, క్యాబ్ లను బుక్ చేసుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి కారణ దొంగలించి అమ్ముకుని జల్సాలు చేస్తాడు. కేసు చేదనలో గజ్వేల్ ఏసిపి నరసింహులు, సిఐ లతీఫ్, కుకునపల్లి ఎస్సై బాలకృష్ణ, పోలీసులు, సిబ్బందిని సిపి రశ్మి పెరుమాళ్ అభినందించారు.

## ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి



హనుమకొండ, ఆగష్టు 6 (మనం ప్రతినిధి ): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతని గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ ఏకశిలా పార్కులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) శేషాద్రి, హనుమకొండ ఆర్డిఓ వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, బల్దియా సి హెచ్ ఓ లాక్ష్మారెడ్డి, రెవెన్యూ మున్సిపల్, ఇతర శాఖల అధికారులు, వాకర్స్, తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ అనుకూల సాగు సాంకేతికతలపై రైతులకు శిక్షణ



ములుగు, ఆగస్టు 6(మనంన్యూస్): శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ములుగు, సిద్ధిపేటలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో, ముల్కనూరు కో-ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, ముల్కనూరు సహకారంతో ముల్కనూరు ప్రాంత కూరగాయల రైతుల కోసం 'వాతావరణ మార్పులకు తట్టుకునే కూరగాయల సాగు సాంకేతికతలు' అంశంపై ఒక రోజు శిక్షణ మరియు అవగాహన కార్యక్రమాన్ని ములుగులోని పరిపాలనా కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రొఫెసర్ డా. వి. సుచిత్ర స్వాగత ప్రసంగంతో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, రైతులకు వాతావరణ మార్పుల నేపథ్యంలో కూరగాయల సాగులో అనుసరించాల్సిన ఆధునిక సాంకేతికతలు, కూరగాయల అంటుకట్టడం, నాణ్యమైన నారుమడి తయారీ పద్ధతులు, కూరగాయల కోత అనంతర నిర్వహణ, తెగుళ్లు మరియు పురుగుల గుర్తింపు, నివారణ చర్యలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెజిటబుల్ రీసెర్చ్ స్టేషన్, రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డా. జె. శ్రీనివాస్ ఎల్నినో పరిస్థితుల్లో వాతావరణ అనుకూల కూరగాయల సాగు గురించి వివరించారు. అనంతరం పీజీఐహెచ్ఎస్కు చెందిన ఇన్-సర్వీస్ పీహెచ్.డి. పరిశోధకులు శ్రీమతి కె. నిరోష నాణ్యమైన నారుమడి తయారీ సాంకేతికతలు, ఆయిల్ పామ్ సాగులో పాటించాల్సిన ఉత్తమ పద్ధతుల గురించి శ్రీ పులి శ్రీనివాస్ వివరించారు. డా. వి. సురేష్ కూరగాయల పంటల్లో పురుగులు, వ్యాధుల నిర్ధారణ మరియు సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. అనంతరం రైతులను ఉద్యాన విశ్వవిద్యాలయం దత్తత గ్రామం క్షీరసాగర్ లో గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి (ఓఆఖ) మరియు వైస్ సర్పంచ్ నల్లా పరుశురాం గారి ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన క్షేత్ర ప్రదర్శనకు తీసుకువెళ్లి, వాతావరణ అనుకూల కూరగాయల సాగు పద్ధతులను ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా రైతులు శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.రైతులు కూడా ఈ శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు.



## హుస్నాబాద్ టు కొత్తపల్లి నాలుగు వరుసల రోడ్డు విస్తరణకు హైకోర్టు బ్రేకా




చిగురు మామిడి ఆగస్టు 6 ( మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామం నుండి, అలాగే సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ వ్యవహారంలో చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో నాలుగు వరసల రహదారి విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నాలుగు వరుసల రహదారి విస్తరణ అంశంపై దాఖలైన రిట్ పిటిషన్లపై బాధితులకు స్టేటస్ కో (యథాతథ స్థితి) కొనసాగించాలని ఆదేశిస్తూ హైకోర్టు ఉపశమనం కల్పించింది. మొదట ప్రధాన పిటిషనర్ కందుకూరి లక్ష్మణాచారి, కక్కర్ల బాలయ్య, కెమ్మసాగరం వెంకటయ్య, ఓరుగంటి భారతీ దేవి, వంతడుపుల మల్లయ్య, పిట్టల రమేష్, గైని శ్రీనివాస్, బోల్లబతిని రాజేశం, మొలుగూరి వెంకటాద్రి, వంతడుపుల వినయ్, సిలుమోజు యశోద మొదలైన 11 మంది దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై ఆగస్ట్ 4న విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరపల్లి నంద గారు 11 మంది మందికి చెందిన ఆస్తులపై ప్రస్తుతం ఉన్న పరిస్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ మద్యంతర ఉత్తర్వులు స్టేటస్ కో జారీ చేశారు. దీంతో పిటిషన్ బాధితులకు హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. వాదన ప్రకారం గ్రామ పంచాయతీ కార్యదర్శి గారికి, సర్పంచ్ గారికి ఇండ్ల కూల్చివేతపై ఎలాంటి అధికారాలు ఉన్నాయని గ్రామ ప్రజలకు నోటీసులు జారీ చేశారని తెలిపారు ,అధికారులు చట్టబద్ధమైన ప్రక్రియ అనుసరించకుండా తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా, భవిష్యత్తులో 4, 6 వరుసల రహదారి నిర్మాణం బైపాస్ ద్వారా రోడ్డు నిర్మిస్తే బాగుంటందనే విషయం ఆలోచించకుండ , నష్టపరిహారం చెల్లించకుండానే రోడ్డు విస్తరణ పేరుతో తమ ఆస్తులపై చర్యలకు సిద్ధమ వుతున్నారని కోర్టు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది.

పిటిషనర్ల తరపున న్యాయవాదులు వి.వెంకట సుబ్రహ్మణ్యం, దాసరి శ్రీనివాస్ రెడ్డి వాదనలు వినిపించడం జరిగింది. దీనిపై స్పందించిన హైకోర్టు తదుపరి విచారణ వరకు ఆస్తులపై కూల్చివేయడం స్వాధీనం లేదా ఇతర జోక్య చర్యలు చేపట్టరాదని స్పష్టం చేస్తూ స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు 11 2026 కు వాయిదా పడింది. ఈ నాలుగు వరసల రహదారి విస్తరణ అంశంపై పిటిషనర్లుకు హైకోర్టులో స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేయడం హుస్నాబాద్ నియోజకవర్గం లో చర్చనీయాంశ గా మారింది. చట్టబద్ధమైన ప్రక్రియ ప్రజల అభ్యంతరాల పరిశీలన, భవిష్యత్తులో4,6 వరుసల రోడ్డుకు, నేషనల్ రోడ్డుకు, గ్రీన్ ఫీల్ రహదారికి బైపాస్ రోడ్డు అనుకూలమని ప్రతిపాదన, అదేవిధంగా ఉత్తర తెలంగాణ నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తులో మంచి ప్రదాన రాష్ట్ర, జాతీయరహదారి నిర్మించాలంటే బైపాస్ రోడ్డు ద్వారానే నిర్మించాలని, తగిన నష్టపరిహారం వంటి పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయ నిన్యాయవార్గాలు అభిప్రాయపడుతున్నారు.



## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులనుపై కలెక్టర్ సమీక్ష

వరంగల్, ఆగస్టు 6:(మనం ప్రతినిధి ): జిల్లాలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పురోగతి పై జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి పూర్తయితే జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష లో ఆర్ అండ్ బి ఎస్ ఇ రమేష్ బాబు,ఎలక్ట్రిసిటీ ఎస్. ఇ ఆనందం , ఇన్చార్జి డి ఎం అండ్ హెచ్ ఓ రాజా రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఇంజనీర్ శరవణ్,వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ ,ఇ ఇ దేవిక చౌహాన్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్ పై రావి చెట్లు...

- అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

జమ్మికుంట, ఆగస్టు 6 (మనం న్యూస్): ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం కలిగిన ఫ్లైఓవ్ర చెట్లు పెరిగేంత వరకు నిర్వహణ చర్యలు లేకపోవడం అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ప్రమాదం జరిగాక స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకుని వంతెనను సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాని ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే... జమ్మికుంట పట్టణంలో గత కొన్నేళ్ల క్రితం కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఫ్లైఓవర్ వంతెనపై రావి చెట్లు మొలవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వంతెన పక్కల గోడల మధ్య, కాంక్రీట్ పగుళ్లలో మొలిచిన రావి మొక్కలు ప్రస్తుతం పెద్ద చెట్లుగా మారుతూ నిర్మాణ భద్రతపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలంలో ఈ చెట్ల వేళ్లు కాంక్రీట్లోకి చొచ్చుకుపోయే ప్రమాదం ఉండటంతో వంతెన బలహీనపడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ల క్రితం ఫ్లైఓవర్ వంతెన పెచ్చులూడి కింద పడిన సమయంలో వంతెన కింద చిరు వ్యాపారం చేసుకునే వారికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ఫ్లైఓవ్ర ఇలాంటి పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. నిర్మాణ నిపుణుల అభిప్రాయం ప్రకారం రావి, మర్రి చెట్ల వేళ్లు కాంక్రీట్లోకి చొచ్చుకుపోయి పగుళ్లను మరింత విస్తరింపజేసే అవకాశం ఉంటుంది. వర్షపు నీరు ఆ పగుళ్ల ద్వారా లోపలికి చేరితే ఇనుప రాడ్లు తుప్పు పట్టి వంతెన దీర్ఘకాలిక మన్నిక దెబ్బతినే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు పలుమార్లు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. వెంటనే ఫ్లైఓవర్ కు ఇరువైపులా మొలిచిన చెట్లను తొలగించి, దెబ్బతిన్న ప్రాంతాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు వంతెన నిర్మాణ భద్రతపై సాంకేతిక నిపుణులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.



## ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి



హనుమకొండ, ఆగష్టు 6 (మనం ప్రతినిధి ): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతని గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ ఏకశిలా పార్కులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) శేషాద్రి, హనుమకొండ ఆర్డిఓ వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, బల్దియా సి హెచ్ ఓ లాక్ష్మారెడ్డి, రెవెన్యూ మున్సిపల్, ఇతర శాఖల అధికారులు, వాకర్స్, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి పోర్టల్ మాడ్యూల్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి



హనుమకొండ ఆగస్టు 6(మనం ప్రతినిధి ): హనుమకొండ : భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి పోర్టల్ మాడ్యూల్స్ పై జూనియర్ అసిస్టెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ఎన్ఐసి హాలులో భూభారతి పోర్టల్ ద్వారా మాడ్యూల్స్ కు సంబంధించిన అంశాలపై జిల్లాలోని 14 మండలాలకు చెందిన జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న జూనియర్ అసిస్టెంట్లను ఉద్దేశించి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ భూభారతికి సంబంధించిన అన్ని అంశాలపై జూనియర్ అసిస్టెంట్లు పూర్తి అవగాహన తో ఉండాలని పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా శిక్షణ కార్యక్రమంలో భూభారతి పోర్టల్ కు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ డి సెక్షన్ సూపరింటెండెంట్ జి. నాగరాజు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

# రేషన్ కార్డుదారులకు 6 కిలోల సన్నబియ్యం

## తెలంగాణలోనే సన్నబియ్యం పంపిణీ మూడు నెలల ఉచిత సన్నబియ్యం పంపిణీ చేసిన మంత్రి






**కూసుమంచి, ఆగస్టు 06(మనం న్యూస్):** రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు ప్రతి నెల 6 కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచి మండలం ఈశ్వర మాదారం గ్రామం చౌక ధరల దుకాణంలో కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి రేషన్ కార్డుదారులకు మూడు నెలల ఉచిత సన్నబియ్యాన్ని మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేదలకు భద్రత, భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి వ్యక్తికి ప్రతినెల 6 కేజీల సన్నబియ్యాన్ని అందిస్తుందని తెలిపారు. దేశంలో రేషన్ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని అన్నారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని చాలా మంది వినియోగించకుండా అమ్మేయడం లేదా రీసైక్లింగ్ పేరుతో అక్రమాలకు గురికావడం వల్ల ప్రభుత్వ ధనం వృథా అయ్యేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం నాణ్యంగా ఉండటంతో ప్రజలు స్వయంగా వినియోగిస్తున్నారని తెలిపారు. పేద కుటుంబాలకు మెరుగైన ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, రేషన్ షాప్ డీలర్ వై. సైది రెడ్డి, గ్రామస్థులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

### పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు

కూసుమంచి మండలంలో కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మంత్రి పొంగులేటి గురువారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాజుపేట బజార్ గ్రామం వద్ద ఈశ్వర మాదారం నుండి భద్రు తండా వరకు రూ.1.76 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ఈశ్వరమాదారం-భద్రు తండా రోడ్డు నుండి తాళ్లగడ్డ తండా వరకు రూ.50 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చౌటుపల్లి గ్రామంలో రూ.3.20 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి పనులకు, లింగారం తండాలో రూ.1.28 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి లింగారం తండా వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలో చౌటుపల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మంత్రిగా అవకాశం లభించిన అనంతరం గ్రామంలో మిగిలిన అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లింగారం తండాలో రూ.5.45 కోట్ల అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు.



లింగారం తండాలో వీధి దీపాల ఏర్పాటును వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాలేరు ప్రాంతంలో భూ రీ-సర్వే చేపట్టామని, పరిశీలించి అర్హులైన వారికి పట్టాదారు పాస్బుక్ లు అందిస్తామని చెప్పారు. నకిలీ పాస్ బుక్ లను రద్దు చేసి, సర్వే ఆధారంగా ప్రతి రైతుకు న్యాయబద్ధమైన భూమికి పాస్బుక్ అందజేస్తామని స్పష్టం చేశారు.

### అరకపట్టిన మంత్రి

లింగారం తండాలో మంత్రి పొంగులేటి పొలంలోకి దిగి స్వయంగా ఎద్దుల అరకపట్టి దుక్కి దున్నారు. రైతులతో మమేకమై వ్యవసాయ పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, డీవైఎస్వో సునీల్ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, లింగారం తండా సర్పంచ్, ఉప సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పిల్లలకు ప్రమాదం జరిగితేనే చర్యలు





- ప్రిన్సిపాల్‌కు వత్తాసు పలికిన డిఐఈవో
- మనం కథనంపై వింత వివరణ
- గతంలో ఓ అధ్యాపకుడి విషయంలోనూ నామమాత్రపు చర్యలే

**కారేపల్లి, ఆగస్టు 06(మనం న్యూస్):** ఖమ్మం జిల్లా పరిధిలోని కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాలేజీ వర్కింగ్ సమయంలో కాకతీయ టయోటాకు చెందిన టిఎస్/టిజి003/టిసి/55 నెంబర్ గల రెడ్ కలర్ కారు ప్రమోషన్స్, ఓ అధ్యాపకురాలి టెస్ట్ డ్రైవ్, పర్యావసనంగా ప్రమాదం జరిగిన ఘటనపై ‘అధ్యాపకురాలి జోరుకి..కారు బేజారు‘ అనే శీర్షికతో గురువారం మనం దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలేజీ పనివేళల్లో ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన ‘కారు సేల్స్ ప్రమోషన్స్‌కు పాల్పడిన విషయం పట్ల జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబుతో ఫోన్లో మాట్లాడి వివరణ కోరగా వింత సమాధానం వినిపించింది. ‘పిల్లలకు ప్రమాదం జరిగితేనే చర్యలు‘ తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ ను కొనియాడుతూ మాట్లాడారు. బాధ్యుల వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాల్సిన డిఐఈఓ చర్యలు తీసుకోకపోగా..ప్రిన్సిపాల్ పనితనానికి వత్తాసు పలకడం గమనార్హం.

### గతంలోనూ నామమాత్రంగా చర్యలే....

గతంలో ఇదే కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. అయినా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయం నుండి ఆశించిన స్థాయిలో ఆర్డర్స్ పాస్ కాలేదనే ఆరోపణలు ఉన్నాయి. ‘గతంలో ఓ లెక్చరర్ ఆడపిల్లలతో డబుల్ మీనింగ్ వచ్చే డైలాగులతో అసభ్యకరంగా ప్రవర్తించిన సందర్భంలోనూ లిఖితపూర్వక ఫిర్యాదు అందజేసినా ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదనే ఆరోపణ ఉంది. ‘సాయంత్రం స్టడీ అవర్స్ సమయంలో ఓ లెక్చరర్ ఒక విద్యార్థితో దురుసుగా ప్రవర్తించగా..సదరు విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయినా జిల్లా అధికారి మాత్రం నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకున్నారు. ‘విద్యార్థులు తమకు నచ్చిన టైలర్ వద్ద కళాశాలకు సంబంధించిన తమ, తమ యూనిఫామ్ దుస్తులను కుట్టించుకునే అవకాశం ఉన్నా కేవలం ఒక్కరి దగ్గర మాత్రమే బట్టలు ఇవ్వాలనే నిబంధన పెట్టారు. ‘పలు సందర్భాల్లో స్టూడెంట్స్ ముందే లెక్చరర్స్ గొడవలకు దిగడం, ఒక్కో లెక్చరర్ ను ఒక్కో విధంగా ట్రీట్ చేస్తూ అధ్యాపకుల్లో ప్రిన్సిపాల్ వర్గ, విభేదాలను సృష్టిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అయినా డిఐఈఓ నామమాత్రపు చర్యలకు పాల్పడడం గమనార్హం.

# భూ భారతి శిక్షణ విజయవంతం



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 6(మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్లో గురువారం భూ భారతి రిజిస్ట్రేషన్ , సక్సెషన్ మాడ్యూళ్లపై శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆకిత్ మాట్లాడుతూ, భూ భారతి చట్టం, నూతన నిబంధనలు, భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, ప్రజలకు వేగవంతమైన సేవల అందింపు, ప్రతి దరఖాస్తును చట్టబద్ధంగా పరిశీలించి బాధ్యతాయుతంగా సేవలు అందించాల్సిన అవసరంపై అధికారులకు విలువైన సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనంత రామకృష్ణ, భూ భారతి రిజిస్ట్రేషన్ మరియు సక్సెషన్ మాడ్యూళ్ల అమలు విధానం, పత్రాల పరిశీలన, భూ భారతి వ్యవస్థలో అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని మండల స్థాయి జూనియర్ అసిస్టెంట్లు, డివిజన్ స్థాయి జూనియర్ అసిస్టెంట్లు మరియు కలెక్టరేట్ జూనియర్ అసిస్టెంట్లు పాల్గొని భూ భారతి మాడ్యూళ్లపై సమగ్ర అవగాహన పొందారు. శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ (టెక్నికల్ మేనేజర్స్ - హెచ్ హెచ్ పి) గా ఎన్. దిలీప్ కుమార్ ( కలెక్టరేట్), టి. రాజేష్ - (కొత్తగూడెం డివిజన్) ఎస్. సత్యేంద్ర కుమార్ (భద్రాచలం డివిజన్) భూ భారతి రిజిస్ట్రేషన్ మరియు సక్సెషన్ మాడ్యూళ్లను ప్రదర్శిస్తూ, వ్యవస్థలో అనుసరించాల్సిన ప్రతి దశను సవివరంగా వివరించి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమం ద్వారా భూ భారతి వ్యవస్థను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన మరియు నాణ్యమైన రెవెన్యూ సేవలు అందించేందుకు అవసరమైన అవగాహన కల్పించబడింది.

# పారిశ్రామిక విద్యా పర్యటనలో యస్.బి.ఐ.టి. విద్యార్థులు



**ఖమ్మం, ఆగస్టు 6(మనం న్యూస్):** విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, స్టార్టప్ వ్యవస్థ, ఇంక్యుబేషన్, హ్యాకథాన్లు, ఐడియాథాన్లపై అవగాహన కల్పించే లక్ష్యంతో తమ కళాశాల విద్యార్థులు హైదరాబాద్లోని ప్రముఖ ఆవిష్కరణ కేంద్రాలైన ఉయ్-హబ్, టి-హబ్, టి-వర్క్స్‌లను పారిశ్రామిక విద్యా పర్యటనలో భాగంగా సందర్శించారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల నిపుణులు విద్యార్థులకు స్టార్టప్ల స్థాపన, ఇంక్యుబేషన్ ప్రక్రియ, వినూత్న ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలచే విధానం, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. హ్యాకథాన్లు, ఐడియాథాన్లు విద్యార్థుల సమస్య పరిష్కార సామర్థ్యాన్ని, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి తెలిపారు. టి-వర్క్స్‌లో అత్యాధునిక ప్రోటోటైపింగ్ సదుపాయాలు, డిజైన్, తయారీ సాంకేతికతలను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. కళాశాల వైస్-ఛైర్మన్ కె.శ్రీచైతన్య మాట్లాడుతూ ఉయ్-హబ్లో మహిళా పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాల గురించి తెలుసుకోగా, టి-హబ్లో స్టార్టప్ల అభివృద్ధి, మెంటరింగ్, పెట్టుబడి అవకాశాలు, ప్రపంచ స్థాయి ఇంక్యుబేషన్ విధానాలపై విద్యార్థులు సమగ్ర అవగాహన పొందారని తెలిపారు. ఈ పారిశ్రామిక విద్యా పర్యటన ద్వారా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకత (ఎంట్రప్రెన్యూవర్షిప్), పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం పట్ల మరింత ఆసక్తిని పెంపొందించుకున్నారని, భవిష్యత్తులో హ్యాకథాన్లు, ఐడియాథాన్లు, స్టార్టప్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, ఇన్నోవేషన్ సెల్ ఇన్చార్జ్ పి. అశ్విని, టి.పి.ఒ. డాక్టర్ యన్. సవిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో

# ప్రజావాణి



- వినతులు స్వీకరించిన డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్

**ఖమ్మం, ఆగస్టు 6(మనం న్యూస్):** ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ గురువారం ప్రజావాణి నిర్వహించారు. ఇప్పటికి 15 వారాలుగా ఈ కార్యక్రమ కొనసాగుతోంది. ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ జిల్లా నలుమూలలనుండి అనేక మంది ప్రజలు సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందజేస్తున్నారని, వీటిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. కొన్నింటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తున్నామన్నారు. గురువారం 18 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు తూములూరి లక్ష్మీ నరసింహారావు, కిలారు అనిల్ కుమార్, మూడుముంతల గంగరాజు యాదవ్, కొట్టె రాజశేఖర్, బండి మాధవరావు, నాయిని సునీత, దామా స్వరూప, పాటి నర్సయ్య, టిపిసిసి యస్‌సి సెల్ వైస్ చైర్మన్ దర్జీ చెన్నారావు, పుచ్చకాయల సోమిరెడ్డి, గోవిందు శ్రీను, హలావత్ అర్జున్, గంగిశెట్టి ప్రసాద్, బ్రహ్మారెడ్డి, మర్రికట్ల బాబు, కిలారు వెంకటరమణ, గజ్జి సూర్యనారాయణ, ఆజ్గర్, పురుషోత్తం, మహమూద్, పంది రాజు గౌడ్, ఫరీద్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి

### ఆత్మనిర్భరత మిషన్ కింద రైతులకు సబ్సిడీ కంది విత్తనాల పంపిణీ: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 06 (మనంప్రతినిధి):** ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకుని, అధిక నీటి అవసరం ఉండే వరి సాగుకు బదులుగా పప్పుధాన్యాలు, అపరాలు వంటి తక్కువ కాల వ్యవధి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. గురువారం గట్టుమల్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మనిర్భరత మిషన్ పథకం కింద రైతులకు సబ్సిడీపై కంది విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్ రైతులకు సబ్సిడీ కంది విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున వరి సాగుకు బదులుగా కంది, పెసర, మినుము, శనగ వంటి పప్పుధాన్యాలతో పాటు ఇతర అపరాల పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం సూచిస్తున్న నీటి సంరక్షణ, నీటి ఆదా పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు అవలంబించడం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించుకుని అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సమయానికి అందేలా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని పంటల వైవిధ్యీకరణ ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పప్పు, దాన్యాల ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పప్పుధాన్యాల సాగుతో పాటు ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా మెరుగైన ఆదాయం లభిస్తుందని వివరించారు. ఆత్మనిర్భరత మిషన్ పథకం కింద పంపిణీ చేస్తున్న నాణ్యమైన కంది విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సాగు సంబంధిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు, మండల వ్యవసాయ అధికారి జి. దీపక్ ఆనంద్, గట్టుమల్ల గ్రామ సర్పంచ్ బట్టు కనకరాజు, తహసీల్దార్ శిరీష, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) విజయ్ వంశీ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# టిజిఓ ఆధ్వర్యంలో జయశంకర్‌కు ఘన నివాళులు



**ఖమ్మం, ఆగస్టు 6(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహనీయుడు, తెలంగాణ జాతిపితగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఖమ్మం అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి ఆధ్వర్యంలో గురువారం గెజిటెడ్ భవన్ లో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి మేధోబలాన్ని అందించిన గొప్ప విద్యావేత్త, ఆర్థికవేత్త, దూరదృష్టి గల ఆలోచనాపరుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కొనియాడారు. మోదుగు వేలాద్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం స్వాభిమానాన్ని ప్రపంచానికి చాటి చెప్పడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎస్‌జిపిఏ జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనుక ఉన్న చారిత్రక, సామాజిక, ఆర్థిక కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని దేశవ్యాప్తంగా వినిపించిన మహనీయుడు జయశంకర్ సార్ అని అన్నారు. ఎస్‌జిపిఏ కార్యదర్శి రవి మాట్లాడుతూ ఆయన జీవితమంతా తెలంగాణ ప్రజల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి కోసం అంకితమైందని గుర్తు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ప్రభుత్వ అధికారి ప్రజాసేవను అత్యున్నత బాధ్యతగా భావించి నిబద్ధత, పారదర్శకత, నిజాయితీతో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కొండపల్లి శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డా. పి విజయ్ కుమార్, జిల్లా కోశాధికారి సూరంపల్లి రాంబాబు, కార్యవర్గ సభ్యులు దేశబైనా అరుణ్ కుమారి, మోదుగు వెంకటేశ్వర్లు, ఇంటూరి భాస్కర్, ఏడిఏ సతీష్, ఏడిఏ నారాయణరావు, నాలుగో తరగతి ఉద్యోగ సంఘ నాయకులు గఫూర్, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులు, సంఘ సభ్యులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# సాయి బోధనలు నేటి మానవాళికి ఆచరణీయం

- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న

**హనుమకొండ , ఆగష్టు 6(మనం ప్రతినిధి):** శ్రీ షిర్డీ సాయిబాబావే నాడో..బోధించిన ‘శ్రద్ధ - సబూరి‘ సూత్రాలు నేటి మానవాళికి అత్యంత ఆచరణీయమైనవని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. గురువారం హనుమకొండ సాయిబాబా మందిరాన్ని సందర్శించిన ఆయనకు ఆలయ ఛైర్మన్ మతకుమల్లి హరిగోపాల్ సూచనల మేరకు ధర్మకర్త వెయ్యి గండ్ల రమేష్, ఆలయ పూజారులు కిషోర్ శర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ, సాయిబాబా బోధించిన శ్రద్ధ, సబూరి, సేవాభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరిస్తే సమాజంలో శాంతి, సామరస్యం, మానవీయ విలువలు మరింత పెంపొందుతాయని పేర్కొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కమిషనర్కు బాబా శేష వస్త్రాలను సమర్పించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయంలో నిరంతరం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ కమిషనర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సాయికృష్ణ,రాజు భక్తులు, ఆలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన ఎంపీ వద్దిరాజు

### నిరుద్యోగి వేణుకు లక్ష రూపాయలు అందజేత



**ఖమ్మం, ఆగస్టు 6(మనం న్యూస్):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తన దాతృత్వాన్ని మరోసారి చాటిచెప్పారు. ఉద్యోగాల భర్తీకి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేయకపోవడంతో మానసిక ఆందోళనకు గురైన గడ్డం వేణుకుమార్ గౌడ్ ఈ నెల ఒకటవ తేదీన ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యాలక్మీపురం వాస్తవ్యులు గడ్డం భద్రయ్య కుమారుడైన వేణుకుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేసి ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సంసిద్ధమవుతున్నారు. నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసి, అవి విడుదల కాకపోవడంతో తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనై ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రి పాలయ్యారు. వేణు చిన్నగా కోలుకుని బుధవారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలో తీరిక లేకుండా ఉన్న రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రకు వేణు ఉదంతం గురించి తెలిసి తీవ్ర విచారం ప్రకటించారు. అలాగే వేణుకు తన వంతు సాయంగా ఎంపీ రవిచంద్ర లక్ష రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. జేడీప్ మాజీ ఛైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇంఛార్జి లింగాల కమల్ రాజ్ ద్వారా లక్ష రూపాయలు పంపించి దయార్ద్ర హృదయాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర పంపిన లక్ష రూపాయల నగదును వేణు, ఆయన తండ్రి భద్రయ్యలకు కమల్ రాజ్ గురువారం అందజేసి ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సర్పంచ్ సలీమా ఖాసీం, ఉప సర్పంచ్ రమాదేవి, మాజీ ఎంపీటీసీ నానబాల కిరణ్, మాధవి, కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేటర్ గుణచరిత్, వేణు సోదరుడు వెంకటేష్, పాల్వంచ రాజేష్, నానబాల హరీష్, వీరాస్వామి, సెల్వరాజ్, కోటయ్య, సతీష్, ఉపేంద్రాచారి, నజీర్, నానబాల హరినాథ్ బాబు, షేక్ నబీ, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

# త్రీదశ వెంచర్‌కు అమ్ముడుపోయారా పంచాయతీ అధికారులు..?

- అక్రమాలకు అధికారిక అండ
- అధికార దుర్వినియోగమా
- అవినీతికి ప్రోత్సాహమా
- ఫిర్యాదులు వినం... చర్యలు శూన్యం..!
- అపవాదులు మూటగట్టుకుంటున్న పంచాయతీ కార్యదర్శి
- మౌనం అంగీకారమేనా






సంగారెడ్డి ప్రతినిధి /కంది మనం న్యూస్ ఆగస్టు 06: గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించి, గ్రామ పంచాయతీ పరిధిలో చట్టాలు, నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులపైనే ఇప్పుడు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా త్రీదశ వెంచర్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల విషయంలో పంచాయతీ అధికారుల వ్యవహారశైలిపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, కేవలం నోటీసులు జారీ చేసి కాలయాపన చేస్తున్నారే తప్ప అక్రమ నిర్మాణాలను నిలిపివేసేలా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. త్రీదశ వెంచర్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని గ్రామస్తులు పదేపదే ఫిర్యాదు చేసినా, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులను స్వీకరించినా, వాటి ఫలితం మాత్రం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అక్రమ నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతుండగా, వాటిని అడ్డుకోవాల్సిన అధికారుల మౌనం అనేక అనుమానాలకు తావిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. 'త్రీదశ వెంచర్కు పంచాయతీ అధికారులు అమ్ముడుపోయారా?', 'అధికారిక అండతోనే అక్రమాలు కొనసాగుతున్నాయా?' అనే ప్రశ్నలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యమా, లేక అక్రమాలకు పరోక్ష సహకారమా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు జరుగుతున్నా, వాటిని అడ్డుకోవడంలో పంచాయతీ యంత్రాంగం విఫలమవడం వెనుక కారణాలపై సమగ్ర విచారణ జరగాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. త్రీదశ వెంచర్కు సంబంధించి వచ్చిన ప్రతి ఫిర్యాదుపై జిల్లా స్థాయి అధికారులు స్వతంత్రంగా విచారణ చేపట్టి, ఆరోపణల్లో నిజానిజాలు వెలికితీయాలని కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు ఎవరైనా అధికారులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించినట్లు తేలితే, వారిపై కఠిన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన అధికారులు ఆరోపణల నుంచి బయటపడాలంటే, వెంటనే పారదర్శకంగా వ్యవహరించి అక్రమాలపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్



- ఘనంగ ప్రోపెసర్ జయశంకర్ జయంతి వేడుకలు
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 06 (మనం బ్యూరో): తెలంగాణ రాష్ట్ర సాధనకు కృషి చేసి, తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిలు మాట్లాడుతూ... తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే శ్వాసగా, ఆశయంగా భావించి తన జీవితాంతం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన గొప్ప యోధుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. జయశంకర్ ఉద్యమ నాయకుడిగానే కాక తెలంగాణ ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తూ రాష్ట్ర భవిష్యత్ దిశను సైద్ధాంతికంగా నిర్దేశించిన మహా మేధావని ప్రశంసించారు. ప్రొఫెసర్ జయశంకర్ రచనలు, ఉపన్యాసాలు, పరిశోధనలు తెలంగాణ ఉద్యమానికి మేధస్సుతో పాటు మార్గదర్శకత్వాన్ని కూడా అందించాయన్నారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణం వెనుక ఉన్న జయశంకర్ విద్యారంగంలో చేసిన కృషి, సమానత్వం, ప్రాంతీయ న్యాయం వంటి అంశాలపై ఆయన చేసిన అధ్యయనాలు ఈ తరం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కొత్తపల్లి జయశంకర్ జీవితాంతం తెలంగాణ హక్కుల కోసం పోరాడిన మహానేతలలో ప్రముఖులుగా నిలిచిపోతారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మంజుల, పలువురు జిల్లా అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి



- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు -06(మనం ప్రతినిధి ): ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన సమయంలో ఉద్యమ స్ఫూర్తిని సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేస్తూ, తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో చైతన్యంగా మలచడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.సమాజం పట్ల నిబద్ధతతో అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- 12వ తేదీలోపు అన్ని పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు, ఆగస్టు 6, మనం ప్రతినిధి: ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని,12వ తేదీ లోపు అన్ని పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించనున్న సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ముఖ్య మంత్రి పర్యటన లో అధికారులు అప్రమత్తంగా ఉండి అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. పైలాన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. నూతన కలెక్టరేట్ కార్యాలయంలో ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, సమావేశ మందిరం, మంత్రివర్గ గది, అదనపు కలెక్టర్ల చాంబర్ల లో అవసరమైన అన్ని సదుపాయాలతో సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆగస్టు 12వ తేదీలోపు అన్ని పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మేడారం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్నటువంటి హెలిప్యాడ్ ల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. వీఐపీల బస కోసం ప్రత్యేక అతిథి గృహాలను సిద్ధం చేయడంతో పాటు, ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకునే సందర్భంగా పూజా కార్యక్రమాలు, శేష వస్త్రాల సమర్పణ, ఆశీర్వచనాల ఏర్పాట్లు, ఆలయ పరిసరాల పరిశుభ్రత, అవసరమైన సౌకర్యాలను ముందుగానే పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా రెప్పపాటు కూడా విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వైద్య శాఖ అన్ని అత్యవసర సదుపాయాలతో సిద్ధంగా ఉండాలని, అవసరమైన మందులు, వైద్య బృందాలు, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని సూచించారు. హెలిప్యాడ్ ప్రాంతంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, వాహనాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, శాఖల మధ్య సమన్వయం లోపించకుండా చూడాలని సూచించారు. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తించి, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమీక్షించి, ఆగస్టు 12వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థలు సంపత్ రావు,ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, ఎస్డిసి ప్రతాప్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుషీల్ వంశీ, ఆర్డీవో కృష్ణవేణి, డి ఎస్ పి రవీందర్, జిల్లా అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 5.30 లక్షలతో విద్యుత్ లైన్ల మరమ్మత్తు పనులు ప్రారంభం



ములుగు : ఆగస్టు 6 మనం ప్రతినిధిః గాంధీనగర్ గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పునరుద్ధరించేందుకు గాంధీనగర్ గ్రామపంచాయతీల్లో 5 లక్షల 30 వేల రూపాయలతో చేపట్టిన మరమ్మత్తు పనులను గ్రామ సర్పంచ్ ₹బానోత్ నిర్మల వెంకన్న మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మంత్రి సీతక్క సహకారంతో గ్రామంలో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామని గ్రామంలోని పాత విద్యుత్ లైన్లు, స్తంభాలు శిథిలావస్థలో ఉండటంతో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. రైతులు, , గృహ వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పనుల్లో భాగంగా దెబ్బతిన్న వైర్ల మార్పు, కొత్త స్తంభాల ఏర్పాటు, వంటివి జరుగుతాయని అధికారులు తెలిపారు. అనంతరం విద్యుత్తు ఉద్యోగులు లైన్ ఇన్స్పెక్టర్ రామచందర్ లైన్మెన్ తిరుపతి లను సన్మానించిన గ్రామ పాలకవర్గం ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మదా ఉప సర్పంచ్ వల్లపు మహేష్ , వార్డు సభ్యులు మాలోతు శంకర్, తేజావత్, హుని, రామావత్ సంధ్యా బిక్షపతి, కూరాకుల సురేష్ బాలవికాస ప్రతినిధులు వినయ్ శంకర్ , గ్రామ పెద్దలు గ్రామంలోని వివిధ కమిటీల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త



- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

ములుగు, ఆగస్టు 6, మనం ప్రతినిధి, : ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త అని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు.ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ జీవిత చరిత్ర సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను జిల్లా ఉన్నతాధికారులు స్మరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగ లాగా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపట్టానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్నామని తెలిపారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని, స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసారని, రాష్ట్ర అభివృద్ధి కొరకు మంచి ప్రణాళికలు సైతం రూపొందించారని, ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, డి ఆర్ ఓ రవికుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుషిల్ వంశీ, డి పి ఆర్ ఓ రఫిక్, కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, సూపరిండెంట్లు మహేష్ బాబు మంజుల, శివకుమార్, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస గ్రామాల్లో పూర్తిస్థాయిలో వసతులు

- నిర్వాసితులందరికీ ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి కృషి
- సమీక్ష సమావేశంలో జోగులాంబ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 06 (మనం బ్యూరో): ర్యాలంపాడు, చిన్నోనిపల్లి, నాగర్ దొడ్డి పునరావాస గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లో సదుపాయాలపై కలెక్టర్, ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పునరావాస గ్రామాల్లో నిర్వాసితులందరూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేందుకు సహకారం అందిస్తామన్నారు. ర్యాలంపాడు ఆర్ అండ్ ఆర్ గ్రామంలో ఇండ్ల నిర్మాణానికి ఇంకా 5 ఎకరాల భూమిని సేకరించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్లాట్లను మంజూరు చేస్తామన్నారు. ఆయా పునరావాస గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు తాగునీరు, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాలన్నీ కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలల భవన నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆలయాల నిర్మాణం, ఇతర పనులన్నింటినీ వేగవంతం చేసి నిర్వాసిత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద నీరు వస్తుండడంతో జూరాల కుడి కాలువ పరిధిలో ఆయకట్టు రైతులు వరి సాగు చేస్తే పంట చేతికొచ్చే వరకు నీటి విడుదల విషయంలో, చివరి డిస్ట్రిబ్యూటరీతో పాటు ఆర్డీఎస్ లింక్ కాలువలకు నీళ్లు అందించే విషయంపై నీటి పారుదల శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సూచించడం జరిగిందని కలెక్టర్ తెలియజేశారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు స్పందిస్తూ రైతులు వరి సాగు చేయడం, పంటలు చేతికొచ్చే వరకు నీటి లభ్యత ఆధారంగా కాలువలకు నీటిని విడుదల చేసే అంశాన్ని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, సర్వే ఏడి నూకరాజు, ఇతర ఇరిగేషన్ అధికారులు, సంబంధిత మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తీజ్ పండుగ వేడుకలు



దుగ్గొండి. ఆగస్టు 6 మనం ప్రతినిధి : వెంకటాపురం శివారు మంగళ్ తండా లో తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు పాల్గొని మహిళలతో కలిసి వేడుకల్లో సందడి చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ తీజ్ పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. గ్రామంలో ప్రజలు ఐకమత్యంతో ఉండి సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాటేటి రవి వార్డ్ నెంబర్ ఊరేటి లింగం తండా పెద్దమనిషి ధరవద్ రాజన్న మహిళలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య



ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 06 (మనం బ్యూరో): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ముందుగా పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో కలిసి జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి అయన సేవలను స్మరించుకున్నారు.అనంతరం అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనుక ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలు, ఉద్యమ స్ఫూర్తి, అచంచల సంకల్పం కీలక పాత్ర పోషించాయన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలనే లక్ష్యంతో ఆయన జీవితాంతం చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ఉద్యమకారుడిగా జయశంకర్ సమాజానికి అందించిన సేవలు అమూల్యమైనవని చెన్నయ్య తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలు నేటికీ సమకాలీనమైనవేనని అన్నారు. యువత నేటి సమాజంలో ముఖ్యంగా జయశంకర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా భావంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించడం ద్వారా జయశంకర్ ఆశయాల సాధనకు తమ వంతు పాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక సమానత్వం సాధనలో ఆయన చూపిన మార్గదర్శకత్వం,ఇప్పుడు, ఎప్పుడూ, ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాండు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఇందిర, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటయ్య, ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి

- డ్రిప్ ఏర్పాటు, మొక్కల నాటే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి
- రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు -6(మనం ప్రతినిధి ): జిల్లాలో నిర్దేశించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని, డ్రిప్ సౌకర్యం కల్పించడం, మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రి-యునిక్ కంపెనీ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో ఆయిల్ పామ్ సాగు పురోగతి, లక్ష్యాన్ని చేరుకోవడంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఆయిల్ పామ్ మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లక్ష్య సాధనలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం సకాలంలో అందేలా ఉద్యాన, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అదేవిధంగా, డ్రిప్ ఏర్పాటు, మొక్కల సరఫరా ప్రక్రియల్లో జాప్యం లేకుండా సంబంధిత కంపెనీ ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి ఆర్ శరత్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 06 (మనం బ్యూరో): మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు పట్టణ ప్రాంతాల్లో లభించే స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నాగర్కర్నూలు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల ద్వారా ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, చికిత్స విధానం, ప్రసూతి సేవలు, అత్యవసర వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సత్వర వైద్యం అందించాలన్నారు.

మనం
హైదరాబాద్ - శుక్రవారం 7 ఆగష్టు 2026



# ట్రంప్‌నకు తప్పిన ముప్పు...

## గాల్లో విమానానికి దగ్గరగా ఆయన హెలికాప్టర్..!




**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ట్రంప్ ప్రయాణిస్తున్న మెరైన్ వన్ హెలికాప్టర్ ప్రయాణికుల విమానానికి అతి సమీపానికి వెళ్లింది. ఆ సమయంలో ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఉండటం.. ఇంకోవైపు ప్యాసింజర్ విమానం కావడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది.

అమెరికా రాజధాని గగనతలంలో ఒక మైలుకంటే తక్కువదూరంలోకి హెలికాప్టర్, విమానం వచ్చాయి. అమెరికా కాలమానం ప్రకారం ఆగస్టు నాలుగున ఈ ఘటన జరిగింది. ఎయిర్ క్రాఫ్ట్ సిబ్బందితో కమ్యూనికేషన్ సరిగా లేకపోవడం వల్లే ఇలా జరిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత వెంటనే రెండింటి మధ్య నిర్దేశిత దూరం భారీగా తగ్గిందని గుర్తించిన ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలర్ వెంటనే పైలట్లను అప్రమత్తం చేశారు. దాంతో ప్రమాదం తప్పింది. నిబంధనల ప్రకారం రెండు ఎయిర్‌క్రాఫ్ట్‌ల మధ్య కనీసం మైలున్నర దూరం ఉండాలి. ఈ ఘటనపై నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్, అమెరికా విమాన యాన నియంత్రణసంస్థ దర్యాప్తు చేపట్టాయి. సమీక్ష జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఏఏ వెల్లడించింది. ఈ ఘటనపై వైట్‌హౌస్ స్పందించింది. మెరైన్ వన్ హెలికాప్టర్లను అత్యంత ప్రతిభావంతులైన పైలట్లు నడుపుతారని, అధ్యక్షుడు ట్రంప్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదని వెల్లడించింది. ఆ సమయంలో ట్రంప్ కాలిఫోర్నియాకు ప్రయాణిస్తున్నారు.

# ఇరాన్ యుద్ధం తెచ్చిన తంటా



## ట్రంప్, హెగ్సెత్‌ల మధ్య వాగ్వాదం..! • కథనాన్ని కొట్టిపారేసిన పెంటగాన్

**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు అటు ప్రపంచాన్ని ఇటు ఆ రెండు దేశాలను అన్ని రకాలుగా దెబ్బతీస్తున్నాయి. ఈ యుద్ధం కారణంగా సైనిక శక్తి అయిన అగ్రరాజ్యం వద్ద క్షిపణి నిల్వలు పడిపోతున్నాయని ఇప్పటికే పలు కథనాలు వచ్చాయి. అధ్యక్షుడి అధికారిక నివాసం క్యాంప్ డేవిడ్‌లో జరిగిన సమావేశంలో ఇదే అంశంపై డొనాల్డ్ ట్రంప్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మధ్య వాగ్వాదం జరిగిందని సమాచారం. తరిగిపోతున్న నిల్వలపై తనకు పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వలేదని మంత్రిపై అధ్యక్షుడు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అమెరికా మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి అధ్యక్షుడు, రక్షణమంత్రి మధ్య పెరుగుతోన్న అంతరాన్ని ఈ వ్యవహారం వెల్లడి చేస్తోందని పేర్కొంది.

కీలకమైన ఆయుధాల కొరత కారణంగా ఇర్రా పూర్తిస్థాయిలో దాడులు చేపట్టలేని పరిస్థితి వచ్చిందంటూ హెగ్సెత్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆయుధాల కొరత సమస్య పరిష్కారమవుతుందని తాను భావించానని, కానీ అది అలాగే ఎందుకు ఉందో తనకు సమాధానం ఇవ్వాలని మండిపడినట్లు సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనం పేర్కొంది. హెగ్సెత్ మాత్రం తనను తాను సమర్థించుకున్నారట. అమెరికా ఆయుధాల నిల్వలు, కొరతల గురించి అధ్యక్షుడికి పూర్తి సమాచారం ఇవ్వలేదంటూ రక్షణశాఖ సహాయ మంత్రిని నిందించారు.

ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ చౌకగా తయారు చేసిన డ్రోన్లను భారీ సంఖ్యలో వినియోగిస్తోంది. ఒక్కో డ్రోన్ ధర కేవలం 20 వేల నుంచి 50వేల డాలర్లలోపే. అయితే వీటిని ఎదుర్కోవడానికి అమెరికా వినియోగిస్తున్న ఒక్కో ఇంటర్సెప్టర్ క్షిపణి ధర మాత్రం 1.5 మిలియన్ డాలర్ల పైమాటే. అంతే కాకుండా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు తీవ్రం చేయడంతో అమెరికాకు చెందిన అనేక స్థావరాలు దెబ్బతిన్నాయి. వాటిని రక్షించడానికి పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ ఇంటర్సెప్టర్లు, ఇతర ఆయుధాలను పెద్ద మొత్తంలో ఉపయోగించింది. ఫలితంగా థాడ్, పేట్రియాట్ వంటి క్షిపణుల కొరత ఏర్పడిందని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఇరాన్‌పై భీకర దాడులు చేస్తామని, అవి రెండో ప్రపంచం యుద్ధం తర్వాత జరిగే శక్తిమంతమైన దాడులని హెచ్చరించిన ట్రంప్ తర్వాత చర్చలు జరుగుతాయని ప్రకటించారు. ఆయుధాల కొరత వార్తల తర్వాతే అమెరికా దాడులకు విరామం ఇవ్వడం గమనార్హం. కాగా, అమెరికా మీడియా కథనాన్ని వైట్‌హౌస్ తోసిపుచ్చింది. ''100 శాతం నకిలీ వార్త ఇది. హెగ్సెత్‌పై ట్రంప్‌నకు పూర్తి విశ్వాసం ఉంది'' అని ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు. పెంటగాన్ కూడా ఈ కథనాన్ని కొట్టిపారేసింది.

## సెప్టెంబర్ 27 డెడ్లైన్..

# పాక్ ప్రభుత్వానికి ఇమ్రాన్ మద్దతుదారుల డిమాండ్లు

**ఇస్లామాబాద్, ఆగస్టు 6:** పాక్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ అరెస్టు అయి మూడేళ్లవుతోంది. ఈ క్రమంలోనే ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పాక్ వ్యాప్తంగా మళ్లీ నిరసనలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 100 మందికి పైగా అరెస్టయ్యారు. ఈ నిరసనలు ప్రధానంగా పీటీఐ పార్టీ అధికారంలో ఉన్న ఖైబర్ ఫఖ్తుంఖ్వాలో ప్రారంభమయ్యాయి. ఇమ్రాన్‌కు తన హక్కులను తిరిగి కల్పించాలంటూ లాహోర్, రావల్పిండి, కరాచీ సహా పలు నగరాల్లో ఆయన మద్దతుదారులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. బాష్పవాయువును ప్రయోగించారు.

### సెప్టెంబర్ 27 డెడ్‌లైన్..

ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి, పీటీఐ నేత ముహమ్మద్ సోహైల్ అఫ్రిదీ పాక్ ప్రభుత్వానికి సెప్టెంబర్ 27 డెడ్‌లైన్ విధించారు. ఇమ్రాన్, ఆయన సతీమణిపై పెట్టిన కేసుల్లో న్యాయపరమైన విచారణ జరగాలని, తన న్యాయవాదులను, వైద్యసిబ్బందిని మాజీ ప్రధాని కలుసుకునేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజధాని నగరం పెషావర్‌లో పార్టీ మద్దతుదారులతో మాట్లాడారు. ఆయనకు న్యాయం దక్కకపోతే పాక్ ప్రజలు సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు మార్చ్‌గా వస్తారని హెచ్చరించారు.



ఇదిలా ఉంటే.. జైల్లో ఉన్న ఇమ్రాన్‌కు సరైన వైద్య సహాయం అందడం లేదని, చూపు మందగించిందని ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తోన్న సంగతి తెలిసిందే. గత మూడేళ్లుగా ఇమ్రాన్ ఖాన్‌కు న్యాయమైన విచారణ హక్కును తిరస్కరించారని, సుదీర్ఘకాలం పాటు ఏకాంత నిర్బంధంలో ఉంచారని మానవ హక్కుల సంస్థ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా ఆరోపించింది.

## ఎల్ఐసీ త్రైమాసిక లాభం రూ.13,492 కోట్లు




**ముంబై, ఆగస్టు 6 :** ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) మెరుగైన త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.13,492 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.10,987 కోట్ల నికర లాభంతో పోలిస్తే 23 శాతం వృద్ధి నమోదైంది. ఎల్ఐసీ మొత్తం ఆదాయం రూ.2,37,848 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే సమయంలో రూ.2.22 లక్షల కోట్లుగా ఉన్నట్లు ఎల్ఐసీ తన రెగ్యులేటరీ ఫైలింగ్లో పేర్కొంది.

సమీక్షిస్తున్న త్రైమాసికంలో తొలి ఏడాది ప్రీమియంలు వసూళ్లు రూ.7,525 కోట్ల నుంచి రూ.9217 కోట్లకు పెరిగాయని ఎల్ఐసీ తెలిపింది. రెన్యువల్ ప్రీమియం వసూళ్లు రూ.59,885 కోట్ల నుంచి రూ.61,833 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. సింగిల్ ప్రీమియం ద్వారా రూ.56,369 కోట్లు వసూలైనట్లు తెలిపింది. మొత్తం ఖర్చులు రూ.2.11 లక్షల కోట్ల నుంచి రూ.2.25 లక్షల కోట్లకు పెరిగినట్లు ఎల్ఐసీ తన రెగ్యులేటరీ ఫైలింగ్లో పేర్కొంది. తొలి త్రైమాసికంలో వ్యక్తిగత సెగ్మెంట్లో 31.02 లక్షల పాలసీలు విక్రయించినట్లు ఎల్ఐసీ తెలిపింది. లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్లో తొలి ఏడాది ప్రీమియం ఆదాయం విషయంలో ఎల్ఐసీ 60.1 శాతం మార్కెట్ వాటాతో అగ్రగామిగా ఉందని కంపెనీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి వెల్లడించారు.

# బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్ ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడి



**ఢాకా, ఆగస్టు 6:** బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ ఇంటి వద్ద దుండగులు రెచ్చిపోయారు. పెట్రోల్ బాంబులు విసిరి బీభత్సం సృష్టించారు. మాజీ ప్రధాని షేక్ హసీనా తాజాగా నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో షకీబ్ వర్చువల్‌గా పాల్గొనడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. మోటారు సైకిళ్లపై వచ్చిన కొందరు దుండగులు.. క్రికెటర్ ఇంటిపై బాంబులు వేశారు. భారీ శబ్దంతో మంటలు రావడంతో స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. మంటలను ఆర్పివేసి ఆస్తి నష్టం జరగకుండా చేశారు. ఆ సమయంలో షకీబ్ కుటుంబ సభ్యులు ఇంట్లో లేరని పోలీసులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రస్తుతం ఆయన ఇంటి వద్ద సిబ్బందిని మోహరించినట్లు వెల్లడించారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ తరఫున షకీబ్ ఎంపీగా గెలిచిన సంగతి తెలిసిందే. హసీనా ప్రభుత్వం రద్దు అయిన నేపథ్యంలో అతడి పదవి కూడా పోయింది.

### బంగ్లా.. మరో పాక్లా తయారైంది: వాజెద్

మరోవైపు, బంగ్లాదేశ్ ప్రభుత్వంపై హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ తీవ్ర ఆరోపణలు చేశాడు. భారత్‌కు ఈశాన్యంలోనూ మరో పాకిస్థాన్ తయారైందని విమర్శలు గుప్పించాడు. విదేశీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు బంగ్లా నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. హసీనా ప్రెస్ కాన్ఫరెన్స్ ముందు సాజీబ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ''గత రెండేళ్ల నుంచి వేలాది మంది జైళ్లలోనే మగ్గుతున్నారు. అందులో ఎక్కువగా అవామీ లీగ్ పార్టీ నాయకులే ఉన్నారు. వారికి బెయిల్ కూడా ఇవ్వట్లేదు. వీరిలో చాలా మంది 80 ఏళ్ల పైబడిన వారే. పోలీస్ కస్టడీలోనే కొందరు ప్రాణాలు వదిలారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతకంటే భారత్ ఆందోళన చెందాల్సిన కీలక విషయం మరొకటి ఉంది. భారత తూర్పు సరిహద్దులో మరో పాకిస్థాన్‌లా బంగ్లా మారింది'' అని వాజెద్ ఆరోపించారు.

# తల్లిని హింసిస్తే.. ఇల్లు వదిలి పోవాల్సిందే



## ఒక కేసులో తీర్పు చెప్పిన కర్ణాటక హైకోర్టు

**బెంగళూరు, ఆగష్టు 6 :** కన్నతల్లినే నిత్యం హింసిస్తున్న కుమారుడికి ఆ ఇంట్లో ఉండేందుకు అర్హత ఉండదని కర్ణాటక హైకోర్టు కీలక తీర్పు ప్రకటించింది. తల్లిని విడిచి ఇంట్లోంచి వేరుగా వెళ్లిపోవాలని ఇమ్రాన్ ఖాన్ అనే వ్యక్తిని బుధవారం ఆదేశించింది. బెంగళూరు విల్సన్ గార్డెన్లో తల్లితో కలిసి ఉంటున్న ఇమ్రాన్ నిత్యం ఆమెను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడనేది అభియోగం. అతని వేధింపులకు భార్య, పిల్లలు సహకరించడం మొదలుపెట్టారు. వారి వేధింపులు తాళలేక ఆమె సీనియర్ సిటిజన్ల ట్రైబ్యునల్ను ఆశ్రయించారు. ఇంటిని ఆమెకే వదిలిపెట్టి, మిగిలినవారంతా ఖాళీ చేసి వెళ్లాలని ఆ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. తీర్పును ప్రశ్నిస్తూ హైకోర్టులో కొడుకు వేసుకున్న అర్జీని న్యాయమూర్తి తోసిపుచ్చి.. ట్రైబ్యునల్ ఆదేశాలను సమర్థించారు.

## మళ్లీ దాడులకు దిగితే..

# పశ్చిమాసియా ఇక అగ్నిగుండమే

## ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్, ఆగస్టు 6:** తమ దేశంలోని విద్యుత్తు గ్రిడ్లు, వంతెనలు, పౌర మౌలిక సదుపాయాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభిస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ స్పష్టం చేసింది. మొత్తం పశ్చిమాసియా ప్రాంతాన్ని అగ్నిగుండంగా మార్చేస్తామని హెచ్చరించింది. ఇక, హర్మూజ్‌లో సమన్వయంపై ఒమన్‌తో అంగీకారానికి వచ్చినట్లు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ వెల్లడించారు. మూడో పక్షం (అమెరికాను ఉద్దేశిస్తూ) జోక్యం లేకుంటే త్వరలో సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు. దీంతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి తిరిగి పూర్తిగా తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు పశ్చిమాసియాలోని పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే, ఆ దేశం అణ్వాయుధాలు తయారు చేసేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని పునరుద్ఘాటించారు. తమ సైనిక చర్యలతో టెహ్రాన్ బలహీనపడిందన్నారు. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నాయన్నారు. వెనెజువెలాతో అనుసరించిన విధానాన్నే ఇరాన్ విషయంలోనూ అమలు చేస్తున్నామని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అమెరికాను ఇప్పుడు టెహ్రాన్ గౌరవిస్తోందని... తమ చర్యలు ఫలించాయని వ్యాఖ్యానించారు.

### మొజ్తాబాను కలవడం అత్యంత కష్టమైన పని: పెజెష్కియాన్

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీని సంప్రదించడం ప్రస్తుతం చాలా కష్టంగా ఉందని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తెలిపారు. ఇటీవల మొజ్తాబాతో అత్యంత రహస్య ప్రాంతంలో అధ్యక్షుడు భేటీ అయినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఖమేనీ ముఖాన్ని కూడా పెజెష్కియాన్ చూడలేదని కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడి తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే ఖమేనీ నేతృత్వంలోని కొత్త నాయకత్వం కారణంగానే తమ దేశం ఇంకా బలంగా ఉందని పెజెష్కియాన్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌ను కుప్పకూల్చాలని శత్రువులు యత్నిస్తున్నారని, దాన్ని తాము సమర్థంగా ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

## రూ.11 కోట్ల లాటరీ టికెట్ను చెత్తబుట్టలో పడేసింది..!



**రోమ్, ఆగస్టు 6:** అదృష్టం ఎవరిని ఎప్పుడు ఎలా వరిస్తుందో చెప్పలేం. ఇటలీలో ఓ మహిళకు దాదాపు రూ.11 కోట్ల లాటరీ తగిలినా.. ఆ విషయం తెలియక టికెట్‌ను చెత్తబుట్టలో పడేసింది. అయితే పారిశుద్ధ్య కార్మికుల కృషితో టికెట్ తిరిగి దొరకడంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దక్షిణ ఇటలీలోని బిటోంటో పట్టణానికి చెందిన ఓ మహిళ ఎప్పటిలాగే తనకు ఇష్టమైన 2, 4, 8, 10, 51 నంబర్లతో లాటరీ టికెట్‌ను కొనుగోలు చేసింది. ఫలితాలు చూసేందుకు ఓ దుకాణానికి వెళ్లగా.. ''నాన్ పేయబుల్'' అని కనిపించింది. అయితే టికెట్‌కు బహుమతి లేదని భావించిన ఆమె దానిని అక్కడే చెత్తబుట్టలో పడేసింది. ఇంటికి చేరుకున్న తర్వాత కుటుంబ సభ్యులు అసలు విషయం చెప్పారు. భారీ మొత్తంలో బహుమతి వచ్చినప్పుడు దుకాణంలో లాటరీ తగిలిన వారికి ఇచ్చేందుకు అవసరమైన నగదు లేకపోవడంతో ''నాన్ పేయబుల్'' అనే సందేశం వస్తుందని వివరించారు. వెంటనే పరిగెత్తుకుంటూ టికెట్ పడేసిన ప్రాంతానికి వెళ్లిన ఆమెకు అక్కడ నిరాశే ఎదురైంది. అప్పటికే పారిశుద్ధ్య కార్మికులు అక్కడ ఉన్న చెత్తను తరలించారు. దీంతో వ్యర్థాల నిర్వహణ సంస్థ అధికారులను ఆమె ఆశ్రయించారు. పారిశుద్ధ్య కార్మికులు రెండ్రోజుల పాటు శ్రమించి టికెట్‌ను గుర్తించారు. టికెట్ దొరికిందని తెలిసి మహిళ ఆనందంతో కన్నీళ్లు పెట్టుకుందని అధికారులు తెలిపారు.

## తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్ పాల్‌కు

# పదేండ్ల జైలు, 10 లక్షల జరిమానా



**ముంబై, ఆగష్టు 6 :** లైంగిక దాడి కేసులో దోషిగా తేలిన తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్పాల్ కు కోర్టు పదేండ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించింది. ఆయన్ను నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. 2013లో జూనియర్ సహోద్యోగినిపై లైంగికదాడి చేసిన కేసులో తేజ్ పాల్ ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు గోవా బెంచ్.. తాజాగా శిక్ష ఖరారు చేసింది. గతంలో ట్రయల్ కోర్టు ఈయనను నిర్దోషిగా ప్రకటించగా.. ఆ తీర్పును హైకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే.

2013లో గోవాలో జరిగిన థింక్ ఫెస్ట్ ఈవెంట్లో పాల్గొన్న సమయంలో హోటల్ ఎలివేటర్లో తరుణ్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు ఆరోపించారు. దీంతో అదే ఏడాది నవంబరులో అతడిని అరెస్టు చేయగా.. ఆ తర్వాత బెయిల్ పై విడుదలయ్యాడు. ఈ కేసుపై 2017లో మాపులా ట్రయల్ కోర్టులో విచారణ ప్రారంభం కాగా.. ఆయన్ను నిర్దోషిగా తేలుస్తూ 2021లో న్యాయస్థానం తీర్పు వెలువరించింది. దానిని గోవా ప్రభుత్వం హైకోర్టులో సవాలు చేసింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. తీర్పు అనంతరం ఆయన మాట్లాడుతూ.. ''తేజ్ పాల్ ను తక్షణమే అరెస్టు చేయాలి. బాధితురాలికి తండ్రి వయసులో ఉన్న అతడు ఈ నేరానికి పాల్పడ్డాడు. బాధితురాలి నిరాకరణను పట్టించుకోలేదు. ఒక అమ్మాయి వద్దంటే.. దాని అర్థం వద్దనే. దీనిపై ఈ కోర్టు సమాజానికి గట్టి సందేశం ఇవ్వాలి'' అని మెహతా అన్నారు.

మరోవైపు, ఈ కేసులో తానే బాధితుడినని, కనికరం చూపించాలని ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ అయిన తేజ్ పాల్ విచారణ సందర్భంగా కోర్టును కోరాడు. 'ఇప్పుడు నా వయసు 62. నేనొక బాధితుడిని. నాకు భార్య ఉంది. ఇంతకుమించి నేను చెప్పడానికి ఏమీ లేదు. మేం అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఉంది. దయచేసి నాపై కనికరం చూపండి. వాస్తవాలన్నీ రికార్డు చేసే ఉన్నాయి' అని అభ్యర్థించాడు. అయితే, ఆయన వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది.

## విమానాల ఇంధనంలో ఇథనాల్..

# ఏటీఎఫ్.. ఇథనాల్ రెండూ వేరు వేరు




### వాటిని కలపడం వీలు కాదు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**ఢిల్లీ, ఆగష్టు 6 :** విమానాల ఇంధనం 'ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్'లో ఇథనాల్ కలిపే ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో దీనిపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. విమాన భద్రతపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం వల్ల ప్రయాణికుల్లో అనవసరమైన ఆందోళన నెలకొంటుందని చెప్పారు. ప్రయాణికుల భద్రతే కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్య అంశమని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. కేంద్రం ఏటీఎఫ్ లో ఇథనాల్ కలపాలని యోచిస్తోందని, అది విమాన భద్రతకు ముప్పుగా మారొచ్చని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ఉదయం ఎక్స్ లో పోస్టు పెట్టడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఇథనాల్, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ రెండూ పూర్తిగా వేర్వేరు ఇంధనాలని వివరించారు. ఎస్ఏఎఫ్కు అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ గుర్తింపు ఉందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భద్రతా ప్రమాణాలు, పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే దానిని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.




## జర్నలిస్టుల సమస్యలు పక్షాన నిరంతరం టిడబ్ల్యూజేఎఫ్ ముందుంటుంది

### అర్హులైన ప్రతి జర్నలిస్టుకు సంక్షేమ పథకాలు అందాలి

### టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ



**ఉమ్మడి మహబూబ్ నగర్, ఆగస్టు 06 (మనం బ్యూరో):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఎల్లప్పుడు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతుంది టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలో ఉన్న వనమాలిక విశ్రాంతి సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా విస్తృత సమావేశం తో పాటు అచ్చంపేట నియోజకవర్గం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన కమిటీ గురువారం ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ హాజరయ్యారు. అదేవిధంగా నాగర్ కర్నూల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పరిపూర్ణా, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, ఉపాధ్యక్షులు చారకొండ వెంకటేష్, సయ్యద్ షఫీ, బాదం పరమేష్, జాతీయ కౌన్సిలింగ్ సభ్యులు రామచందర్, రంగముని, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతి జర్నలిస్టు ఇండ్లు, ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ ల పక్షాన పోరాటానికైనా సిద్ధంగా ఉంటుంది అన్నారు. ప్రతి జర్నలిస్టు అన్ని విధాలుగా న్యాయం చేసే విధంగా ముందు ఉండాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. జర్నలిస్టు సమస్యలను రాష్ట్ర, జాతీయస్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా ముందుంటామని తెలిపారు. తదానంతరం అచ్చంపేట నియోజకవర్గ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల,అన్ని మండలాల జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ఏర్పాటే తన జీవిత లక్ష్యంగా కృషి చేసిన జయశంకర్

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




నల్లగొండ-- ఆగస్టు 6 (మనం ప్రతినిధి ): తెలంగాణ ఏర్పాటే తన జీవిత లక్ష్యంగా కృషిచేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థి దశ నుండి చనిపోయే వరకు తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో నింపి తెలంగాణపై అవగాహన తీసుకొచ్చిన వ్యక్తి అని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన వ్యక్తుల్లో ప్రొఫెసర్ జయశంకర్ ముందు వరుసలో ఉంటారని అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం నల్గొండలోని ఇందిరా భవన్లో నిర్వహించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలలో మంత్రి పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతేకాక గద్దర్ వర్ధంతి సందర్భంగా గద్దర్ చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ కోసమే పుట్టిన వ్యక్తి అని, విద్యార్థి దశనుండే కాకుండా, పదవి విరమణ పొందిన తర్వాత కూడా తెలంగాణ కోసం ఆయన కృషి చేశారని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పలు సందర్భాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ తెలంగాణ తెచ్చుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారని తెలిపారు. శ్రీకాంత్ చారి లాంటి అమరుల బలిదానాలు, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి వారి త్యాగాల ఫలితంగా తెలంగాణ వచ్చిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 70,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని, అంతేకాక మరో ఏడు వేల పోలీసు ఉద్యోగాలు నింపనున్నట్లు మంత్రి తెలిపారు. అంతేకాక వీలైనంత త్వరలో స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు, న్యాక్ సెంటర్ ద్వారా మరి కొంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయనితెలిపారు. నల్గొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ గా ఏర్పాటైన తర్వాత సుమారు 2000 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని, అవన్నీ పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఆగిపోయిన ఎస్ఎల్ బి సి సొరంగం పనులు కూడా నడుస్తున్నాయని, 700 మీటర్ల పని పూర్తయిందని, ఆగస్టు 2028 నాటికి ఎస్ఎల్బీ సి పూర్తి చేసి దేవరకొండ మొదలుకొని బ్రాహ్మణ వెల్లేముల వరకు అన్ని ప్రాంతాలకు సాగునీరు ఇచ్చి నల్గొండ జిల్లాలోని నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామని, ఎంత కరువు వచ్చినా శ్రీశైలంలో డెడ్ స్టోరేజీ ఉన్నప్పటికి ఎస్ఎల్బీసీ ద్వారా పంటలకు సాగునీరు అందించే విధంగా డిజైన్ రూపొందించడం జరిగిందని తెలిపారు .ఎస్ఎల్బీసీ తో పాటు, తెలంగాణ లోని పాలమూరు- రంగారెడ్డి, ఇతర ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసి తెలంగాణను సస్యశ్యామలం చేసినప్పుడే ప్రొఫెసర్ జయశంకర్ ఆత్మకు శాంతి చేకూరుతుందని తెలిపారు. ప్రపంచం ఉన్నంతవరకు ప్రొఫెసర్ జయశంకర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని మాట్లాడుతూ తెలంగాణ కోసం కృషి చేసిన వారిలో గద్దర్ ఒకరని, ఆయన తన పాటల ద్వారా తెలంగాణలో ఊరూరా తిరుగుతూ పాటల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారని తెలుపుతూ గద్దర్ కు ఘన నివాళులర్పించారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి ,కార్పొరేటర్లు, తదితరులు ఉన్నారు . అనంతరం మంత్రి ప్రజల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు.

## ఏఈఓలను పాత పద్ధతిలోనే ఇన్-సర్వీస్ పంపాలి



సూర్యాపేట, ఆగస్టు 06 (మనం ప్రతినిధి): రాష్ట్ర సెంట్రల్ ఫోరం సూచనల మేరకు, ఇన్-సర్వీస్ బీఎస్సీ (అగ్రికల్చర్) ప్రవేశాలలో పాత విధానాన్ని కొనసాగిస్తూ ఏఈఓలను సీనియారిటీ ప్రాతిపదికన ఎంపిక చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన 5% ఇన్-సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ సూర్యాపేట జిల్లా ఏఈఓల సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ... జి.ఓ.ఎం.ఎస్. నెం.250, తేదీ 06.10.2009 స్ఫూర్తికి అనుగుణంగా డిప్లొమా అర్హత కలిగిన ఏఈఓలకు ఇన్-సర్వీస్ బీఎస్సీ (అగ్రికల్చర్)లో అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలవుతున్న విధానం వల్ల సీనియర్ ఏఈఓలు అవకాశాలు కోల్పోతుండటంతో జి.ఓ. నెం.250 యొక్క ఉద్దేశ్యం దెబ్బతింటోందని, గత విద్యా సంవత్సరంలో 31 మంది ఏఈఓలకు అవకాశం కల్పించగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో కేవలం 19 సీట్లు మాత్రమే కేటాయించడం వల్ల అర్హులైన అనేక మంది ఏఈఓలు నష్టపోతున్నారని తెలిపారు. అందువల్ల పాత విధానాన్ని కొనసాగించి 5% ఇన్-సర్వీస్ కోటాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, ఏఈఓల సేవా ప్రయోజనాలు, విద్యా మరియు ఉద్యోగోన్నతి అవకాశాలకు ప్రతికూలంగా ఉన్న జి.ఓ.ఎం.ఎస్. నెం.39ను రద్దు చేయాలని కూడా వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అనుబంధ సంఘం టి ఏ ఈ ఓ ఏజిల్లా అధ్యక్షులు పెద్దపంగ ప్రణయ్, జిల్లా కార్యదర్శి డి. మనోజ్ కుమార్, జిల్లా ట్రెజరర్ షేక్ ముస్తఫా, రాష్ట్ర సెంట్రల్ ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడి మురళి, ఏఈఓలు శ్రీను, శైలజ, వెంకటేష్, శ్యామ్ పాల్గొన్నారు.

## జయశంకర్‌కు నివాళులు అర్పించిన కలెక్టర్




వరంగల్, ఆగస్టు 6: (మనం ప్రతినిధి ): తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తిగా ఆయనను కొనియాడారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డిఆర్ఓ విజయలక్ష్మి మరియు కలెక్టరేట్ అధికారుకు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారికి ఘనంగా నివాళులర్పించారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్‌కు ఘన నివాళి




సూర్యాపేట ఆగస్టు 06 (మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్తగా, రాష్ట్ర ఏర్పాటుకు నాయకత్వం వహించి ప్రజలను, నాయకులను ఏకతాటిపైకి తీసుకువచ్చి మన నీళ్లు, నిధులు,నియామకాలు మనకే కావాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఎంతో కీలక పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 92 వ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....భారత దేశానికి స్వతంత్రం వచ్చినప్పటికి నిజాం పాలనలో ఉందని తదుపరి నిజాం పాలన నుండి స్వతంత్ర దేశం అయిన తదుపరి ప్రొఫెసర్ జయశంకర్ అన్యాయాలను ఎదిరించేందుకు పోరాటాల ద్వారా, సాహిత్యం ద్వారా ప్రజలకి వారి హక్కులు తెలిసేలా చేశారని, మన ప్రాంతానికి చెందిన వారికే ఉద్యోగాలు వస్తే ప్రాంతం తో పాటు, దేశం అభివృద్ధి చెందుతుందని భావించి ఉద్యోగాల కోసం ప్రజల తరుపున ఎంతగానో పోరాడారని, నిధులు నీళ్లు, నియామకాలు మన తెలంగాణ వారికే దక్కాలని, తెలంగాణ పరిస్థితి సామాజికంగా ఆర్థికంగా ముందుకు పోతే న్యాయం జరుగుతుందని, సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా ప్రజలను ఐక్యం చేసి సుదీర్ఘ పోరాటంలో ఏ విధంగా ముందుకు పోవాలో దిశా నిర్దేశం చేశారని, వారి ఆలోచనలు అర్థం చేసుకోని వారిని స్ఫూర్తి గా తీసుకొని ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించి ప్రజలకు సేవ చేయాలని జిల్లాలో అభివృద్ధి పనులు, విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ శాఖల ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకొనిరావాలని పేర్కొన్నారు. అర్హత ఉన్నవారికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టి భాధ్యతగా భావించి కృషి చేయాలని, మనం ఎక్కడి నుండి వచ్చామొ మర్చిపోకూడదని, సమాజంలో స్థిర మార్పు తీసుకొచ్చేందుకు ఉద్యోగులందరూ ఒక బృందంగా ఏర్పడి సూర్యాపేట జిల్లాని రాష్ట్రంతో పాటు, దేశంలోనే ముందంజలో ఉంచాలని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ బి.హరిసింగ్ మాట్లాడుతూ... ప్రొఫెసర్ జయశంకర్ మలి తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలక పాత్ర పోషించారని, తెలంగాణ ప్రాంతానికి చెందిన వనరులు తెలంగాణ ప్రజలకే దక్కాలని, తెలంగాణ పొలాలు తెలంగాణ వారికే దక్కాలని ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో వారి కృషిని తెలంగాణ ప్రజలు మరవద్దని ఆ మహనీయుని జయంతికి స్మరించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ ప్రేమ్ రాజ్ , సి పి ఓ కిషన్, డి ఏం అండ్ హెచ్ ఓ వెంకటరమణ, డీపీఓ యాదగిరి, డి డబ్ల్యు ఓ నరసింహారావు, డిటి ఓ రవికుమార్, ఇంచార్జ్ పరిపాలన అధికారి శ్రీలత అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా

- తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించిన కలెక్టర్

వరంగల్ ఆగస్టు 06(మనం ప్రతినిధి ): ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం వరంగల్ సి.కె.ఎం. ఆసుపత్రిలో నిర్వహించిన తల్లిపాల అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు జన్మించిన తొలి గంటలోపే వచ్చే ముర్రుపాలను (కొల్లస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు అవసరమైన పోషకాలను సమృద్ధిగా అందిస్తాయని తెలిపారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో డయేరియా, న్యూమోనియా, కామెర్లు (జాండిస్) వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గడంతో పాటు మెదడు ఎదుగుదల మెరుగుపడుతుందని, తల్లి-బిడ్డల మధ్య భావోద్వేగ అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతర రక్తస్రావం తగ్గడం, గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి చేరుకోవడం, స్థూలకాయం తగ్గడం, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, టైప్-2 మధుమేహం వంటి వ్యాధుల ప్రమాదం తగ్గడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు తల్లులకు కలుగుతాయని వివరించారు. శిశువుకు తొలి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన పరిపూరక ఆహారాన్ని అందించాలని సూచించారు. బాలింతలు సమతుల్య పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత నీరు తాగడం ద్వారా తల్లిపాల ఉత్పత్తి మెరుగుపడుతుందని తెలిపారు. అవసరానికి మించి తల్లిపాలు ఉత్పత్తి అయ్యే తల్లులు మిల్క్ బ్యాంక్కు పాలను దానం చేయాలని, ఆ పాలను అవసరమైన శిశువులకు అందించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. గర్భధారణ సమయంలోనే సాధారణ ప్రసవానికి మానసికంగా, శారీరకంగా సిద్ధం కావాలని, సాధారణ ప్రసవం ప్రతి తల్లికి జీవితంలో ఒక అద్భుతమైన అనుభూతి అని, వైద్య అవసరం లేనప్పుడు శస్త్రచికిత్స ప్రసవాలను ప్రోత్సహించకూడదని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు తల్లిపాల ప్రాముఖ్యత, కంగారూ మదర్ కేర్ విధానంపై రోల్ ప్లే ప్రదర్శించి అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గారు బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి, సి.కె.ఎం. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. లక్ష్మీదేవి, జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి రాజమణి, ప్రోగ్రామ్ అధికారులు డా. ఐ. ప్రకాష్, డా. రాజమౌళి, డా. సజిదా, డా. ఇక్తాదార్ అహమ్మద్, డా. అరుణ్ జోషి, ఆర్ఎంఓ డా. సృజన్ బాబు, యు.ఎఫ్.డబ్ల్యూ.సి. వైద్య అధికారి డా. దిలీప్ కుమార్, లెక్చరర్ ఇన్ కమ్యూనికేషన్ (డెమో) అబ్దుల్లా బాబా, డిప్యూటీ డెమో ఎస్. వెంకటేశ్వర్లు, నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి



సూర్యాపేట, ఆగస్టు 6 (మనం ప్రతినిధి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన 'ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకగా, తప్పుల్లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ వి సి హాల్ నందు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ... జిల్లాలో ఓటర్ల నమోదు సవరణ ప్రక్రియ వేగంగా సాగుతోందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24 తో ముగియాల్సిన బీఎల్ఓల ఇంటింటి సర్వే గడువును, క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆగస్టు 10 వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన ప్రకటించారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తయిందని, సేకరించిన సమాచారాన్ని ఆన్లైన్ చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తి అయినదని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు అలాగే ఉండటం వంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు బీఎల్ఓ, బియల్ఏ లతో అవగాహన చేసుకుని ఆగస్టు 10వ తేదీ వరకు గడువు ఉన్నందువలన తప్పులు లేకుండా చూసుకోవాలని, ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను ధ్రువీకరించు కోవాలన్నారు. 2026 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులందరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమీక్షలో కొత్త పోలింగ్ స్టేషన్ల పై రాజకీయ పార్టీ నాయకులతో చర్చించడం జరిగింది. జిల్లాలోని ఓటర్లు తమ ఓటు హక్కును సరిచూసుకోవాలని, బీఎల్ఓలు ప్రతి రాజకీయ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకుని, ఓటర్ల జాబితా ప్రక్షాళనలో అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సి సెక్షన్ సూపర్డెంట్ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నుండి సిహెచ్ రాజేశ్వరరావు,బి జె పి నుండి చల్లమల్ల నరసింహ, ఎండి హాబిద్, బి ఎస్ పి నుండి ఎం.స్టాలిన్, బిఆర్ఎస్ నుండి కరుణాకర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నుండి డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



- పీడీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి

హనుమకొండ, ఆగస్టు 6 (మనం ప్రతినిధి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్య రంగం అభివృద్ధి చేయడం లో పూర్తిగా విఫలం చెందిందని, కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగంలో అనేక సమస్యలు పెండింగులో ఉన్నాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యు ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని పీడీఎస్యూ కార్యాలయంలో జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొగిలి వెంకట్రెడ్డి హాజరై మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి విద్యారం గం పట్ల దాని అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి అన్నారు. ఫీజు రియం బర్స్మెంట్ రాక గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు యాజమాన్యాల సర్టిఫికెట్లు ఇవ్వక విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుం డా యూనివర్సిటీల్లో విద్యార్థులకు చదువు చెప్పడానికి ప్రొఫెసర్లు కూడా లేని స్థితి ఉందని, యూనివర్సిటీలకు కోట్ల రూపాయలు ఇస్తానని వరాలు కురిపించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. సంక్షేమ హస్టళ్లను అద్దె భవనాల్లో కొనసాగిసు న్న స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టి నాటి నుంచి విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం వలన ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని తక్షణమే విద్యాశాఖ కి మంత్రి కేటాయించి విద్యారంగా సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, నాయకులు ముషారఫ్, డానియల్, మోక్షిత్, అరున్ తదితరులు పాల్గొన్నారు.

## కెనాల్ పనులకు ఇండ్లు షాపులు తొలగిస్తామంటే ఊరుకునేది లేదు

- ఆర్ త్రి కెనాల్ పక్కన నివసిస్తున్న 300 కుటుంబాల బడుగు బలహీన వర్గాల ఆవేదన
- ప్రజల సంక్షేమం కొరకే ప్రభుత్వాలుపనిచేయాలి తప్ప వినాశనం కోరుకోవద్దు

నేరేడుచర్ల ఆగస్టు 6 మనం న్యూస్: ఆర్ త్రీ కెనాల్ ఆధునికరణ పనులకు అడ్డుగా ఉన్నాయనే సాకుతో జాతీయ రహదారి వెంట గత 50 సంవత్సరాలుగా జీవిస్తున్న బడుగు బలహీన వర్గాల వారి ఇండ్లు షాపులను తొలగిస్తామంటే చూస్తూ ఊరుకోబోమని నేరేడుచర్ల పట్టణ ఆర్ త్రీ కాలువ బాధితుల సంఘం డిమాండ్ చేసింది. ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వాలు పనిచేయాలే తప్ప ప్రజల వినాశనం కోరుకోవద్దంటూ ప్రజలు కంటతడి పెట్టారు. నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో గురువారం ఆర్ త్రీ కాలువ బాధితుల సంఘం సమావేశం ఏర్పాటు చేసింది. అఖిలపక్ష నాయకులు దొండపాటి అప్పిరెడ్డి మాట్లాడుతూ 2022 సంవత్సరంలో జాతీయ రహదారి పనులకు అడ్డుగా ఉన్నాయని పట్టణంలో కొంతమేర షాపులు ఇండ్లు తొలగించడం జరిగిందని అదే సమయంలో ఆర్ త్రీ కాలువ పక్కన నివసిస్తున్న ఇండ్లను షాపులను తొలగించాలని నాడు అధికారులు ప్లాన్ చేసినప్పటికీ తాము అప్పుడు అధికార పక్షంలో ఉండి అడ్డుకొని ఆపించామని నేడు మేము అధికారంలో లేమని ఇప్పుడు అధికారంలో ఉన్న పాలకులు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారితో మాట్లాడి ఆపించాలని లేకపోతే భవిష్యత్తులో నేరేడుచర్ల ప్రజలు క్షమించరని గుర్తు చేశారు. అనంతరం నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, నేరేడుచర్ల తాసిల్దార్ సురిగి సైదులు గౌడ్ లకు తమ ఇండ్లను షాపులను తొలగించవద్దని కోరుతూ అఖిలపక్ష నాయకులతో పాటు ప్రజలు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అరిబండి



సురేష్ బాబు, ధూళిపాల ధనుంజయ నాయుడు, కొనతం నాగిరెడ్డి, కరీముల్లా హుస్సేన్, సైదా, కొదమ గండ్ల నగేష్, సరికొప్పుల నాగేశ్వరరావు, చ న్నబోయిన సైదులు, ఇంజమూరి వెంకటయ్య, రాపోలు నవీన్, ఇంజమూరి రాము, జయ బాబు, నీలా రామ్మూర్తి, మెట్టు మధు, వాసపల్లయ్య సురగాని వెంకన్న గౌడ్, కందిబండ శ్రీనివాస్, భువనగిరి అంజయ్య, వెంపటి వెంకన్న బాలెన సైదులు ముషం నరసింహ మల్లేశ్వరరావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగో రోజుకు చేరిన దళిత క్రైస్తవుల ఐక్యవేదిక దీక్షలు



హనుమకొండ ఆగస్టు 6 (మనం ప్రతినిధి): ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనూ దళిత క్రైస్తవులు ఎస్సి హోదాను కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి డీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షులు బస్కే నాగరాజు అన్నారు దళిత క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పోచం మైదాన్ జంక్షన్లో చేస్తున్న దీక్షలు గురువారానికి నాలుగో రోజు చేరుకున్నాయి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం లో పొందుపరిచిన మత స్వేచ్ఛ హక్కులను కాపాడదన్నారు ప్రధాని మోడీ భారత రాజ్యాంగాన్ని గౌరవించి దళితుల హక్కులను కాపాడాలన్నారు దళిత క్రైస్తవ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఏర్ల కుమార్ మాట్లాడుతూ నాలుగు రోజులుగా శాంతి దీక్షలు విజయవంతంగా సాగర్ అన్నారు ఆగస్టు 10న హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ నుండి వరంగల్ కలెక్టర్ కార్యాలయం వరకు దళిత క్రైస్తవ శాంతియుత నిరసన ర్యాలీలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయ లా న్నారు . ఎంఎస్ శామ్యూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జన్ను శ్యామ్, నర్మెట్ట ప్రేమ్ మంద కుమార్ కొడవటి రవి వనం మహేందర్ ప్రవీణ్ భరత్ దీక్షలకు సంఘీభావం తెలిపారు దీక్షలో ఎస్.కె బాబు జన్ను యూసఫ్ రాజ్ సుంచు మహేష్ పంగా దయానంద్ జన్మ కర్ణాకర్ జన్ను ప్రశాంత్ నగేష్ బాబు స్వామి దయాకర్ విజయరాజ్ క్రాంతి హరినాద్ పాల్గొన్నారు.

## హన్మకొండ ప్రైవేట్ ఆసుపత్రిలో దారుణం

- చనిపోయిన వ్యక్తికి వైద్యం చేస్తున్నారంటూ బంధువుల ఆందోళన
- ఓ..డాక్టర్ కమీషన్ల దందా - మొదటి ఆసుపత్రి నిర్లక్ష్యం

హనుమకొండ ఆగస్టు 6 (మనం ప్రతినిధి): డబ్బుల కోసం కక్కుర్తి పడి హన్మకొండ విజయ టాకీస్ సమీపంలోని ఓ.. ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం మృతి చెందిన వ్యక్తికి వెంటిలేటర్ వైద్యం అందిస్తూ బిల్లులు వసూలు చేస్తోందని వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బుల్లికొండ గ్రామానికి చెందిన ఒక పేద కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

**కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం... వివరాలు ఇలా ఉన్నాయి**

**బాధితుడు: పంజాల శ్రీధర్ (32), తండ్రి: జలంధర్. ఇద్దరు చిన్న పిల్లలు వేదన్సీ (6), మహాన్సీ (3) ఉన్నారు**

ఐ: బ్రెయిన్ క్లాట్ అయిన శ్రీధర్ను స్థానిక ఓ వైద్యుడు సిఫార్సుపై మొదట హనుమకొండలోని బాలసముద్రంలోఒక ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండ విజయ టాకీస్ రోడ్డు మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ సర్జరీ ఆపరేషన్ చేయడం జరిగిందని, ఆపరేషన్ జరిగిన రెండు రోజుల నుండి పేషంటు నుండి ఎలాంటి కదలికలు చూపు స్పర్శ లేదని పేషెంట్ బంధువులు చెప్తున్నారు. పేషెంట్ పరిస్థితి ఏంటని వైద్యులను ప్రశ్నించగా చూద్దాం.. గ్యారెంటీ లేదు అంటూ దాటివేత ధోరణి చేపడుతు..విపరీతంగా బిల్లులు వేయడంతో, 'మేము అంత డబ్బు కట్టలేముఅని వేడుకున్నారు , పేషెంట్ వాస్తవ పరిస్థితి ఏంటో చెప్పండి అంటూ బంధువులు కాళ్ళు పట్టుకున్నా యాజమాన్యం వదల్లేదని బాధితులు పేర్కొంటున్నారు. డబ్బులు కడితేనే బాడీని అప్పగిస్తామని నిర్బంధిస్తున్నట్లు సమాచారం.

- ఈనెల 4వ తారీఖు పేషంట్ శ్రీధర్ హనుమకొండవిజయ టాకీస్ రోడ్డుసమీపంలోని న్యూరో ఫిజీషియన్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో ప్రాసెస్ లో ఉన్న 70 వేల రూపాయలు వసూలు చేసినట్లు పేషంట్ కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.

₹ వైద్య పరిజ్ఞానం - అనుమానం: మెడికల్ నాలెడ్జ్ ప్రకారం మెదడు పూర్తిగా పనిచేయడం ఆగిపోయినప్పటికీ (ఆట్బుజీ ఖ్బుజి), కృత్రిమ శ్వాస (గ్బుజీజ్బూౌట) పై ఉంచినంత సేపు గుండె కొట్టుకుంటున్నట్లు అనిపిస్తుంది. వెంటిలేటర్ తీసేస్తే గుండె ఆగిపోతుంది. శ్రీధర్ అప్పటికే మరణించాడని, కేవలం బిల్లులు పెంచడం కోసమే కృత్రిమ శ్వాసపై ఉంచి నాటకమాడుతున్నారని బంధువులు బలంగా అనుమానిస్తున్నారు.

తక్షణమే జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు స్పందించి ఈ ప్రైవేట్ ఆసుపత్రి దోపిడీపై విచారణ జరిపి, బాధితుడికి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

హనుమకొండ, ఆగస్టు 6 (మనం ప్రతినిధి): తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ , బిజెపి సీనియర్ నాయకులు గందే నవీన్ కుమార్లు అన్నారు జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం బిజెపి జిల్లా సీనియర్ నాయకులు గందె నవీన్ గారి ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు 28వ డివిజన్లోని విశ్వకర్మ వీధి లో ప్రొఫెసర్ జయశంకర్ గారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ జయంతి వేడుకలకి బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ గారు ముఖ్యఅతిథిగా హాజరై విశ్వకర్మ వీధి జంక్షన్ వద్ద గల జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించరు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ జయశంకర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సిద్ధాంతకర్తగా, ఆలోచనాపరుడిగా 'తెలంగాణ పితామహుడు'గా పేరుగాంచారని, తన జీవితాంతం తెలంగాణ ఆత్మగౌరవం, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతపై ప్రజలను చైతన్యపరచడానికి ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా ఎనలేని కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గందె నవీన్ కుమార్ ,బిజెపి రాష్ట్ర



కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ సా, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కె. రంజిత్ , క్రాంతి కుమార్, గ్రేటర్ వరంగల్ పట్టణ స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి కట్ట రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కందుకూరి చంద్రౌ ఎన, సంఘ సభ్యులు వంగళ బ్రహ్మానందం, కందుకూరి శ్రీధర్, రాజు, సామాజికవేత్త బండ్ల సురేందర్ మరియు శివనగర్ బిజెపి మండల అధ్యక్షులు ఎండి రఫీ, నాయకు లు అకేన సాగర్, వంగల శ్రీనివాస్, చింతంమహేందర్, మహోన్నత్, హరిశంకర్ పాల్గొన్నారు.

వరంగల్

# రోడ్డు భద్రతపై అవగాహన



**మహాదేవపూర్, ఆగస్టు 6 మనం న్యూస్:** అరైవ్ - అలైవ్ కార్యక్రమంలో భాగంగా మహాదేవపూర్‌లో గురువారం నాడు వాహనాల తనిఖీలు నిర్వహించారు. రహదారి భద్రతా కార్యక్రమంలో భాగంగా మహదేవ్పూర్ సెంటర్ వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని తొమ్మిది వాహనాలను సీజ్ చేశారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ పర్యవేక్షణలో, మహదేవ్పూర్ సీఐ వెంకట్, ఎస్ఐలు ఎం. సాంబమూర్తి , రమేష్ , ఏఎంవీఐ సుందర్ లాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా వాహనదారులు, ప్రయాణికులకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి వాహన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు. అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని వివరించారు.

తనిఖీలలో వాహన పత్రాలు సక్రమంగా లేని 9 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం తో పాటు ప్రజలకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు చెల్లుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి సురక్షితంగా ప్రయాణించాలని అన్నారు. అరైవ్ -అలైవ్ నినాదాన్ని ఆచరిస్తూ, కుటుంబ సభ్యుల కోసం సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు

- కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి ఆగస్టు 6 మనం ప్రతినిధి:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి అంశాన్ని క్రమబద్ధంగా అమలు చేయాలని సూచించారు. వేడుకలలో ప్రతి కార్యక్రమం 'మినిట్ టు మినిట్' ప్రణాళిక ప్రకారం ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా శాఖల వారీగా స్టాళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని డీఈఓ, ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షామియానాలు, నిరంతర విద్యుత్ సరఫరా, మంచినీరు, పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రాంగణంలో అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు వివిధ శాఖల ద్వారా లబ్ధిదారులకు అందించే సంక్షేమ ఫలాల పంపిణీకి సంబంధించిన జాబితాను సిద్ధం చేయాలని అన్నారు. వేడుకలకు ఆహ్వాన పత్రికలను సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు.

వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ప్రారంభం నుంచి ముగింపు వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తయ్యేలా చూడాలని ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. ఈ



సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం



**దుగ్గొండి ఆగస్టు 06 మనం ప్రతినిధిః** దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామంలో బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు బిడ్డకు తాగించిన ట్లయితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ సూపర్ జయరానణి అన్నారు. గురువారం మండలంలోని వెంకటాపురం అంగన్ వాడి కేంద్రంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. బిడ్డ పుట్టినప్పటినుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్ర మే ఇవ్వాలని సూచించారు. సర్పంచ్ పొగాకుశోభారాణి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ ఉపాధ్యాయులు అంగన్ వాడీ టీచర్లు ఆయమ్మ అంగన్ వాడీ పిల్లలు, తల్లులు, పాల్గొన్నారు.

# ఆర్అండ్ఆర్ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి ఆగస్టు 6 మనం ప్రతినిధి:** దుబ్బపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో ఆర్ అండ్ ఆర్ కాలనీ అభివృద్ధి పనులు, జెన్కో ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, విద్యుత్ పనులు, కన్వేయర్ బెల్ట్ నిర్మాణం తదితర అంశాలపై రెవెన్యూ, పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టెండర్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. విద్యుత్ పనుల అంచనాలకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు జెన్కో కు పంపించి సవరించిన అంచనాలను పొందాలని తెలిపారు. ఆర్ అండ్ ఆర్ పరిహారం పంపిణీపై సమీక్షిస్తూ అర్హులైన నిర్వాసితులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే పరిహారం మంజూరై మరణించిన లబ్ధిదారుల విషయంలో చట్టబద్ధ వారసుల ధ్రువపత్రాల ఆధారంగా చెల్లింపులు చేయాలని సూచించారు.ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించిన పెండింగ్ వినతులను త్వరితగతిన పరిష్కరించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కన్వేయర్ బెల్ట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి మిగిలిన భూముల సమస్యలు కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ కేసుల్లో సాదాబైనామా అంశాలపై చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, అర్హత నిర్ధారణలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కన్వేయర్ బెల్ట్, జెన్కోకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను త్వరగా పూర్తి చేసి సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టుల అమలులో ఎటువంటి జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్. కుమార్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, ఆర్డీఓ హరికృష్ణ, భూపాలపల్లి, గన్ పూర్ మండలాల తహసీల్దార్లు లక్ష్మి రాజయ్య, రాజేశ్వర రావు, ఏఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జయశంకర్ సార్ జయంతి వేడుకలు

**మహాదేవపూర్ ఆగస్టు 6 మనం న్యూస్:** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ జయంతి వేడుకలను గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం అమరవీరుల స్థూపానికి కూడా పూలను సమర్పించి నివాళులు అర్పించారు. ఆజన్మాంతం తెలంగాఆధ్వర్యంలోణ ఉద్యమ కోసం పరిశ్రమించిన జయశంకర్ సార్ ను తెలంగాణ ప్రజలు ఎన్నడు మరిచిపోరని ఆయన త్యాగం కలకాలం ఉండిపోతుందని వక్తలు అన్నారు. మలిదశ ఉద్యమకారుడు ఎండి జమీలుద్దీన్ ఇటీవల మరణించినందున రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో



తెలంగాణ ఉద్యమకారుల పోరం మండల అధ్యక్షుడు ఎండి అక్రముద్దీన్, ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఆన్కారి ప్రభాకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండి అయుబొద్దిన్ , కేదారి ప్రవీణ్ కుమార్, పోత రమేష్, కోలా అశోక్ కుమార్, కారంగుల బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# పనులు త్వరగా ప్రారంభించాలి



- ఇంజనీరింగ్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

**భూపాలపల్లిఆగస్టు 6 మనం ప్రతినిధి:** కెజిబివి పాఠశాల ప్రహరి నిర్మాణానికి ఏప్రిల్ నెలలో శంకుస్థాపన చేస్తే ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంపై టిజిఈడబ్ల్యుఐడిసి ఇంజినీరింగ్ అధికారులపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గురువారం జిల్లా కేంద్రంలోని కెజిబివి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ ప్రహరిగోడ నిర్మాణ పనులు చేపట్టకపోవడపై డిఈ రామకృష్ణతో ఫోన్ ద్వారా మాట్లాడి, వారం రోజుల్లోగా పనులను ప్రారంభించాలని ఆదేశించారు. కూరగాయల నిల్వ విధానాన్ని, భోజనశాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి, అందిస్తున్న ఆహారం నాణ్యత, అల్పాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో 10వ తరగతి విద్యార్థుల తరగతి గదిని సందర్శించి ఎలా ఉన్నారు, ఎలా చదువుతున్నారు అని విద్యార్థుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. చదువులో పురోగతి, భవిష్యత్తు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. నల్గొండలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అంజలిను అభినందించారు.

చదువుతో పాటు క్రీడలు కూడా శారీరక, మానసిక వికాసానికి ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి క్రీడల్లోను రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్, పాఠశాల ఎస్వో ఈశ్వరి, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానం విజయానికి కీలకం



- ఎస్పీ సంకీర్త్

**భూపాలపల్లి ఆగస్టు 6 మనం ప్రతినిధి:** నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రతి విద్యార్థి విజయంలో కీలకపాత్ర పోషిస్తుందని ఎస్పీ సంకీర్త్ అన్నారు.భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అడ్వాన్సుడు టెక్నాలజీ సెంటర్లోని అత్యాధునిక సాంకేతిక వసతులు, శిక్షణా ప్రయోగశాలలు, విద్యార్థులకు అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ఆయన గురువారం నాడు పరిశీలించారు. అనంతరం అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి విద్య, శిక్షణ, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రతి యువకుడి విజయానికి కీలకమని అన్నారు. ఆధునిక టెక్నాలజీపై పట్టు సాధించి, కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిరంతరం నేర్చుకోవడం, క్రమశిక్షణతో లక్ష్య సాధనకు కృషి చేయడం ద్వారా ప్రతి యువకుడు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. యువత చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సిగరెట్, గంజాయి, మత్తు పదార్థాలు మరియు ఇతర వ్యసనాలకు అలవాటు పడకుండా, విద్య, నైపుణ్యాభివృద్ధిపైనే దృష్టి సారించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సత్సంగతులు, క్రమశిక్షణ, కృషి మరియు మంచి లక్ష్యాలతో ముందుకు సాగితే ప్రతి విద్యార్థి విజయాన్ని సాధించగలడని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్వాన్సుడు టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపాల్ జుమ్లానాయక్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, భూపాలపల్లి సిఐ నరేష్,అడ్వాన్స్ డు టెక్నాలజీ సెంటర్ సిబ్బంది, విద్యార్థులు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వైద్య సేవల నిర్లక్ష్యంపై సీపీఎం సర్వే

- ఫుడ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తొలగించాలి
- ఎంజీఎం సమస్యలను వెంటనే పరిష్కరించాలి: సీపీఎం

**వరంగల్, ఆగస్టు 6: మనం ప్రతినిధి ):** సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో మాట్లాడి ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. సర్వే సందర్భంగా పలువురు రోగులు ఆసుపత్రిలో అందిస్తున్న ఆహారం నాసిరకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నం గట్టిగా ఉండటం, సరిగా ఉడకకపోవడం, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

ఈ విషయమై ఫుడ్ కాంట్రాక్టర్ సత్యనారాయణను సీపీఎం నాయకులు ప్రశ్నించగా, ఆయన బాధ్యతారాహిత్యంగా స్పందిస్తూ, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోండి కలెక్టర్కు చెప్పుకోండి ఆరోగ్య మంత్రికి చెప్పుకోండి నాకు ఏమీ కాదు అంటూ మాట్లాడినట్లు నాయకులు తెలిపారు. వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలం, పూర్చెకలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మణ్ మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా ఎంజీఎం ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుం టున్నప్పటికీ అవసరమైన డయాలసిస్ కిట్లు, మందులను ఆసుపత్రిలో ఇవ్వకుండా బయట కొనుగోలు చేయాలని వైద్యులు సూచిస్తున్నారని తెలిపారు. దీంతో ప్రతి వారం సుమారు రూ.1,500 వరకు అదనపు ఖర్చు అవుతోందని, పేద కుటుంబానికి ఇది తీవ్రమైన ఆర్థిక భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన మంగయ్య కూడా డయాలసిస్కు అవసరమైన కిట్లు, మందులు ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు

# రుణాల వసూలులో పురోగతి ఉండాలి

- స్త్రీ నిధి జిల్లా కమిటీ సమీక్ష సమావేశంలో కలెక్టర్...

**ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 06 (మనం బ్యూరో):** మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో వ్యాపార, ఇతర ఉపాధి అవకాశాలు పొంది ఆర్థిక సాధికారత సాధించాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా కమిటీ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సెర్ప్, మెప్మా ద్వారా ప్రతి ఏటా పెద్ద



ఎత్తున మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నప్పటికీ ఎంతమంది వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రుణాలతో చిన్నచిన్న వ్యాపారాలు కాకుండా ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను తయారు చేసేలా సృజనాత్మకతతో ఆలోచించి ముందుకెళ్లాలన్నారు. పౌల్ట్రీ, డెయిరీ, ఫిషరీస్, తదితర పాడి పరిశ్రమ అభివృద్ధిలో మహిళా సంఘాల పాత్ర ఉండేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని రవాణా సౌకర్యాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులే సొంతంగా ఎలక్ట్రికల్ ఆటోలు, మినీ వ్యాన్లు వంటి వాహనాలు కొనుగోలు చేసి ఆదాయం పొందేందుకు కృషి చేయాలన్నారు. పాత సంఘాలకే రుణాలు ఇవ్వడం కాకుండా స్నేహ కమిటీలు, ఇతర సంఘాల సభ్యులు సైతం వడ్డీ లేని రుణాలను పొంది ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకుంటే ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. ఈ విషయంలో సంబంధిత సీసీలు, ఏపిఎంలు పురోగతి సాధించాలన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



**మహాదేవపురం ఆగస్టు 6 మనం న్యూస్ :** రాష్ట్రస్థాయి జావలిన్ పోటీలకు బాలికల పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్టు పి డి పూర్ణిమ తెలిపారు. మహాదేవపూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పెద్ది అంజలి ఇటీవల భూపాల్ పల్లి జిల్లాలో అథ్లెటిక్ అసోసియేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి జావలిన్ ఈవెంట్ లో ద్వితీయ స్థానం సాధిం చి రాష్ట్రస్థాయికి ఎన్నిక కావడం జరిగింది. ఈనెల 7 న తెలంగాణ రాష్ట్ర ఐదవ జావలిన్ డే ఉత్సవాలలో భాగంగా హన్మకొండ జే ఎన్ ఎస్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మా పాఠశాల చదువులోనే కాదు ఆటలలో కూడా ముందుందని, పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారని,.జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన అంజలిని అభినందించి ఆ విద్యార్థిని ప్రత్యేక మెలుకువలు నేర్పిస్తూ ఆటలలో పాఠశాల పేరును నిలుపుతున్నటువంటి పిడి గుర్నింగ పూర్ణిమ ను అభినందిస్తూ, అంజలి రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎన్నిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని అంజలిని అభినందించారు.

## వర్గల్ విద్యాధరి క్షేత్రాన్ని దర్శించుకున్న ట్రెజరీ జాయింట్ డైరెక్టర్ నాగరాజు



**వర్గల్ ఆగస్టు 6(మనం న్యూస్):**ప్రశాంత వాతావరణం, ఎత్తైన కొండలపై వెలసిన శ్రీ విద్యాధరి అమ్మవారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని రాష్ట్ర ట్రెజరీ జాయింట్ డైరెక్టర్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన సతీసమేతంగా వర్గల్ క్షేత్రాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించిన అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాగరాజు దంపతులను శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 'అమ్మను దర్శించుకోవడం ఎంతో సంతృప్తి కలిగించింది' అని తెలిపారు.

ఆలయ నిర్వహణ చాలా బాగుందని, భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. వర్గల్ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మికంగా గొప్ప అనుభూతిని ఇస్తుందని, ప్రతి ఒక్కరూ ఒకసారి దర్శించుకోవాల్సిన పుణ్యక్షేత్రమని ఆయన అన్నారు.

## ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామసభలకు షెడ్యూల్ విడుదల



**కన్నాయిగూడెం, మనం న్యూస్ ఆగస్టు 6 :** కన్నాయిగూడెం మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) 5వ విడత సోషల్ ఆడిట్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభల షెడ్యూల్ను అధికారులు విడుదల చేశారు. ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. గ్రామసభల షెడ్యూల్ ప్రకారం కంతన్నపల్లి, ఏటూరు గ్రామాల్లో ఆగస్టు 7న, రాజన్నపేట, ఆలీపూర్, సర్వాయి గ్రామాల్లో ఆగస్టు 8న, గుర్రేవులలో ఆగస్టు 9న, లక్ష్మీపురంలో ఆగస్టు 11న, ముప్పనపల్లి, తుపాకులగూడెం, బుట్టాయిగూడెం, చింతగూడ గ్రామాల్లో ఆగస్టు 12న గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సమావేశాలు జరుగుతాయి.ఈ గ్రామసభలకు ప్రజా ప్రతినిధులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు, గ్రామస్థులు తప్పనిసరిగా హాజరై సోషల్ ఆడిట్ ప్రక్రియలో పాల్గొనాలని అధికారులు కోరారు. అలాగే, సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్ ఆగస్టు 13న ఉదయం 10 గంటలకు కన్నాయిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు షెడ్యూల్లో పేర్కొన్నారు.

## జగిత్యాల జిల్లాలో 64 అంగన్వాడీ టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

**జగిత్యాల ప్రతినిధి, ఆగస్టు 06( మనం న్యూస్ ):** జగిత్యాల జిల్లాలో ఖాళీగా ఉన్న 64 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి డా. ఆడెపు భాస్కర్ తెలిపారు. జిల్లా లో ఖలీల వివరాలు.. ధర్మపురి-16, జగిత్యాల-22, మల్యాల-12, మెట్పల్లి-14 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, 2026 జూలై 1 నాటికి 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉండాలి. సంబంధిత గ్రామం/వార్డుకు చెందిన స్థానిక మహిళలు అర్హులు. ఆగస్టు 7 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి అని జిల్లా సంక్షేమ అధికారి డా. ఆడెపు భాస్కర్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారి ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత మండల ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు మండల ఎంపిడిఓ, గ్రామ కార్యదర్శులకు నోటిఫికేషన్ లెటర్లను అందజేసి గ్రామపంచాయతీ నోటిస్ బోర్డుపై పెట్టాలని తెలియజేశారు అని తెలిపారు.



# తండ్రితో 'బరి'లో దిగనున్న వరుణ్ తేజ్..

కథానాయకుడు వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రం 'బరి'కి సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా యదు వంశీ దర్శకత్వంలో ఈ చిత్రం రానుంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ పై నిహారిక ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని వరుణ్ తేజ్ పంచుకున్నారు. ఇందులో నాగబాబు నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

'కొరియన్ కనకరాజు' ప్రచారంలో భాగంగా ఎన్ఆర్ఐ అభిమానులతో ముచ్చటించిన వరుణ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దీంతో మొదటి సారి ఈ తండ్రీ కొడుకులు స్క్రీన్ పంచుకోనుండడంతో సినిమాపై ఆసక్తినెలకొంది. గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ సినిమాగా 'బరి'ని తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రం కోసం వరుణ్ ఏడు నెలలుగా వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్నారు. వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలనే ప్రణాళికతో శరవేగంగా షూటింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' ప్రచారంలో బిజీగా ఉన్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ప్రతి సవాలుకు జవాబు ఇద్దాం: గౌతమ్ గంభీర్



మొన్నటి వరకు వన్డేలు, టీ20లు ఆడిన భారత జట్టు ఇప్పుడు టెస్టు ఫార్మాట్ లో తలపడేందుకు సిద్ధమైంది. ఇప్పటికే శ్రీలంకకు చేరుకొన్న టీమ్ఇండియా.. ఆ జట్టుతో రెండో టెస్టుల సిరీస్ ను ఆడనుంది. ఆగస్టు 15 నుంచి గాలె వేదికగా మొదటి టెస్టు ప్రారంభం కానుంది. దానికంటే ముందు.. శుక్రవారం నుంచి మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఈ క్రమంలో టీమ్ఇండియా ఆటగాళ్లకు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కీలక సూచనలను చేశాడు. ఆ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది.

''మన ముందు ఏ లక్ష్యం ఉందో మనకు తెలుసు. ఎందుకోసం ఆడుతున్నామో తెలుసు. పరిమితులను అధిగమించగలం. ఏదైనా సాధించగలం. అన్ని విభాగాల్లోనూ సత్తా చూపించగలం. బ్యాటింగ్, బౌలింగ్ ఏదైనా సరే.. ఆగస్టు 15 ఉదయం నుంచి మనకు ఎదురయ్యే ప్రతి సవాలుకు జవాబు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలి. ఇప్పట్నుంచే అందుకోసం సన్నద్ధమవుదాం.

ఇప్పుడు మనతోపాటు ఇద్దరు కొత్త ప్లేయర్లు ఉన్నారు. వారిద్దరికి శుభాకాంక్షలు చెబుతున్నా. సరాంశ్ ఇక్కడి వరకు వచ్చేందుకు చాలా కష్టపడ్డావు. ఎప్పుడు అవకాశం వచ్చినా దేశం, కుటుంబం గర్వపడేలా చేస్తావని ఆశిస్తున్నా. ఇక ఆకిబ్ నబీకి స్వాగతం. గత సీజన్ లో అదరగొట్టావు. జమ్ముకశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీని నెగ్గడంలో కీలక పాత్ర పోషించావు. ఇక, మనతోపాటు పనిచేసేందుకు శుభదీప్ ఘోష్ (ఫీల్డింగ్ కోచ్) వచ్చారు. చాలా జట్లతో గత కొన్నేళ్లుగా ఆయన వర్క్ చేశారు. ఆయన నిబద్ధత, ఎనర్జీ లెవల్స్ అద్భుతం. తన ప్రతిభతో మనందరిని లక్ష్యం దిశగా తీసుకెళ్తారని ఆశిస్తున్నా'' అని గౌతమ్ గంభీర్ వ్యాఖ్యానించాడు.



మహిళల ఆసియా కప్ 2026..

## భారత్, పాక్ మ్యాచ్ ఎప్పుడంటే?

మహిళల ఆసియా కప్ 2026 మ్యాచ్ ల షెడ్యూల్ ను గురువారం అధికారికంగా విడుదల చేశారు. మ్యాచ్ లు ఆగస్టు 28 నుంచి మొదలవుతాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టీ20 ఫార్మాట్ లో జరిగే ఈ టోర్నీలో టీమ్ఇండియా తొలి మ్యాచ్ ను ఆగస్టు 30న థాయ్ లాండ్ తో ఆడనుంది. సెప్టెంబర్ 5న చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. టోర్నీలో అన్ని మ్యాచ్ లు దుబాయిలోనే జరగనున్నాయి.

# షెడ్యూల్ మారింది..

## సౌతాఫ్రికా టూర్‌లో టీ20లు కూడా..

ఈ ఏడాది చివర్లో భారత మహిళల జట్టు సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్ లో టీమ్ఇండియా.. సఫారీలతో ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడేలా ముందుగా షెడ్యూల్ రూపొందించారు. తాజాగా ఈ షెడ్యూల్ సవరించి మూడు టీ20లు జోడించినట్లు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు గురువారం తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించనున్నారు. టీ20 ఫార్మాట్ లో మ్యాచ్ లు జరగనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ సిరీస్ ఇరుజట్లకు ఈ టీ20 సిరీస్ సన్నాహకంగా ఉపయోగపడనుందని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు వివరించింది.



సవరించిన షెడ్యూల్ ప్రకారం.. సౌతాఫ్రికా, భారత్ డిసెంబరు 9-12 మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ లో తలపడనున్నాయి. అదే నెల 16-22 మధ్య వన్డే సిరీస్, 26-30 మధ్య టీ20 సిరీస్ నిర్వహించనున్నారు. టెస్టు మ్యాచ్ కు గెబెరా, వన్డేలకు పార్ల్, కేప్ టౌన్, బ్లోమ్ఫోంటైన్ ఆతిథ్యమివ్వనున్నాయి. తొలి టీ20 బెనోనిలో, మిగిలిన రెండు టీ20లు పోచెఫ్ స్ట్రూమ్ లో జరగనున్నాయి.

# సింధు తొలి ప్రత్యర్థి సోఫియా



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ లో భారత షట్లర్లకు మిశ్రమ డ్రా ఎదురైంది. ఆసియా ఛాంపియన్ షిప్ రజత పతక విజేత ఆయుష్ శెట్టి తొలి రౌండ్లో అత్యంత కఠిన ప్రత్యర్థిని ఢీ కొట్టనున్నాడు. పురుషుల సింగిల్స్ ఆరంభ రౌండ్లో అతడు డిఫెండింగ్ ఛాంపియన్ షి యు కి (చైనా)తో ఆడతాడు. పీవీ సింధు, లక్ష్యసేన్ లకు మాత్రం ఆరంభంలో సానుకూల డ్రా లభించింది. మహిళల సింగిల్స్ లో ప్రపంచ 141వ ర్యాంకు షట్లర్ సోఫియా నోబెల్ (ఐర్లాండ్)తో పోరుతో సింధు టైటిల్ వేటను ఆరంభించనుంది. మెడల్ రౌండ్లకు ముందు ప్రపంచ నంబర్ వన్ ఆన్ సి యంగ్ (దక్షిణ కొరియా), డిఫెండింగ్ ఛాంపియన్ యమగూచి (జపాన్) ఆమెకు ఎదురయ్యే అవకాశం లేదు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్యసేన్.. ఆస్ట్రియాకు చెందిన ఫిలిమాన్ తో తలపడతాడు. రెండో రౌండ్లో అతడు కునన్లావ్ (థాయ్ లాండ్)తో ఆడే అవకాశముంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో అయిదో సీడ్ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జంటకు బై లభించింది. ఈ టోర్నీలో ప్రతి విభాగంలోనూ భారత్ కు రెండు ఎంట్రీలు ఉన్నాయి. మహిళల డబుల్స్ మొదటి రౌండ్లో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ ద్వయం.. స్పెయిన్ కు చెందిన పౌలా లోపెజ్, లూసికా రోడ్రిగ్వెజ్ జంటను ఢీకొంటుంది.

# 'ది ప్యారడైజ్' టీజర్.. నాని ఫ్యాన్స్‌కు ఇక మాస్ జాతరే

టాలీవుడ్ అగ్ర హీరో నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ లో వస్తున్న మరో సినిమా ది ప్యారడైజ్. ఈ సినిమాలో నాని సరసన కాయాదు లోహర్ హీరోయిన్ గా మెరువనున్నారు. అయితే, ఎన్నో రోజులుగా ఈ సినిమా కోసం నాని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. షూటింగ్ ప్రక్రియ దాదాపు ఫినిష్ అయిన నేపథ్యంలో తాజాగా బిగ్ అప్డేట్ ఇచ్చింది చిత్ర బృందం. ఈ ప్యారడైజ్ సినిమా టీజర్ ను విడుదల చేసింది. ఇందులో మునుపెన్నడు లేని మాస్



లుక్ లో నాని కనిపించారు. టీజర్ లో యాక్షన్ సీన్స్ అద్భుతంగా ఉన్నాయి. ముఖ్యంగా అనిరుధ్ అందించిన బీజీఎం టీజర్ లో హైలెట్ గా నిలిచింది. అంతేకాదు దిష్టంతా పోవాలే ! అంటూ నాని చెప్పే డైలాగ్ గూస్ బంప్స్ తెప్పిస్తుంది. అది కూడా చేతి నిండా బ్లేడ్లు పట్టుకొని, నాని వార్నింగ్ ఇవ్వడం ఆరాచకంగా ఉంది. కాగా ఈ సినిమా వచ్చే నెల 24వ తేదీన రిలీజ్ కానుంది.

# టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన రుక్మిణి వసంత్?

తెలుగు సినీ అభిమానులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో రామ్ చరణ్-సుకుమార్ కాంబినేషన్ లో తెరకెక్కనున్న సినిమా ఒకటి. ఈ చిత్రాన్ని 'ఆర్సీ17' అనే వర్కింగ్ టైటిల్ తో ఇప్పటికే అధికారికంగా ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత ఎలాంటి అప్ డేట్ రాలేదు. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ పనులు మరికొంత కాలం కొనసాగనున్న నేపథ్యంలో షూటింగ్ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.

అయితే ఈ చిత్రానికి హీరోయిన్ ను మాత్రం మేకర్స్ దాదాపు ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తల ప్రకారం, రామ్ చరణ్ కు జోడీగా కన్నడ నటి రుక్మిణి వసంత్ ను ఎంపిక చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆమెతో సంప్రదింపులు కూడా జరిపినట్లు ప్రచారం జరుగుతుంది. అన్ని అనుకున్నట్లు జరిగితే ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ హీరోయిన్గా కనిపించే అవకాశాలు ఉన్నాయని టాక్. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరి నిజంగానే రుక్మిణి వసంత్ ఈ క్రేజీ ప్రాజెక్ట్ లో హీరోయిన్ గా ఎంపికవుతుందా? లేక మరో హీరోయిన్ కు అవకాశం దక్కుతుందా? అనేది తెలియాలంటే కొంతకాలం వేచి చూడాల్సిందే.



# ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా చిరు?

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఆంధ్రప్రదేశ్ అధికారిక బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించనున్నారంటూ వస్తున్న వార్తలను ఆయన టీమ్ ఖండించింది. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న వార్తలను నమ్మొద్దని తెలిపింది.

ఏపీ బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వం చిరంజీవిని కోరిందంటూ గత రెండు రోజులుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా చిరంజీవికి ఉన్న



ప్రజాదరణతో పర్యాటకం, పెట్టుబడులు ఆకర్షించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఆ వార్తల సారాంశం. అయితే, ఇది పూర్తిగా అవాస్తవమని ఇలాంటి ధ్రువీకరించని వార్తలను, అసత్య ప్రచారాలను దయచేసి ప్రచారం చేయొద్దని చిరంజీవి టీమ్ కోరింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేయడంతో ఫేక్ న్యూస్ కు చెక్ పెట్టినట్లైంది.

**సినిమాలపైనే చిరంజీవి దృష్టి**

సినిమాల్లో రీఎంట్రీ తర్వాత చిరంజీవి దృష్టి అంతా సినిమాలపైనే పెట్టారు. ఒకదాని తర్వాత ఒకటి ప్రకటిస్తూ యువ కథానాయకులకు దీటుగా సినిమాలు చేస్తున్నారు. బాబీ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న మెగా 158గా సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఈ చిత్ర టైటిల్ టీజర్ని చిరు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇక వశిష్ఠ దర్శకత్వంలో రూపొందిన సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'ను దసరా సందర్భంగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీన్ని కూడా చిరు పుట్టినరోజు సందర్భంగానే ప్రకటించే అవకాశముంది. వీటి తర్వాత శ్రీకాంత్ ఓదెల మూవీ చేయాల్సి ఉంది. నాని ఈ సినిమాకు నిర్మాత.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.